అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 09-07-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 190 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50

షెడ్యూల్ ప్రకారమే డీఎస్సీ రాతపరీక్షలు

18 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహణ

11 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నరసింహారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డీఎస్సీ రాతపరీక్షలు షెడ్యూల్ ప్రకారమే ఈనెల 18 నుంచి యధాతథంగా నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి తెలిపారు. వచ్చేనెల ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని వివరించారు. అభ్యర్థులు ఈనెల 11న సాయంత్రం నుంచి హాల్‌టికెట్లను ...5లో

స్కిల్ వర్సిటీకి

ఏర్పాట్లు చేయండి

23లోపు ప్రతిపాదనలు సిద్ధం చేయండి : అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రయత్నాలను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరున జరిగే అసెంబ్లీ సమావేశాలకు ముందే, జులై 23వ తేదీ లోపు దీనికి సంబంధించిన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని పరిశ్రమలు, విద్యాశాఖల అధికారులకు చెప్పారు. దీనికి పారిశ్రామికరంగ ప్రముఖులు సహకారం అందించాలని కోరారు. ప్రతిపాదనలు వచ్చిన 24 గంటల్లో వాటిని పరిశీలించి ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. సోమవారం గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుపై అధికారులతో పాటు పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ప్రాంగణంలోనే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. ఈ ప్రాంతం ఐటీ కంపెనీలతో పాటు పరిశ్రమలకూ అందుబాటులో ఉన్నందున ఇక్కడే యూనివర్సిటీ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలన్నారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఐఎస్‌బీ తరహాలో ఒక బోర్డును ఏర్పాటు చేయాలనే చర్చ జరిగింది. దీనిపై సీఎం స్పందిస్తూ సమావేశానికి హాజరైన ప్రతినిధులందరినీ తాత్కాలిక బోర్డుగా భావించాలని నిర్ణయం తీసుకున్నారు. స్కిల్ యూనివర్సిటీలో ఉండాల్సిన కోర్సులు, పాఠ్యాంశాలు, పరిశ్రమల అవసరాలు తెలుసుకొని, దానికి అనుగుణంగా, ఆధునిక పరిజ్ఞానంతో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా, నైపుణ్య శిక్షణా తరగతులు ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆర్థికపరమైన అంశాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో, కరిక్యులమ్, కోర్సులకు సంబంధించి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ...13లో

ఆ ముగ్గురూ మోడీ పక్షమే

ఏపీలో ఉన్నదంతా పాలకపక్షమే

కడప ఎంపీ ఉప ఎన్నిక వస్తే గల్లీ గల్లీ తిరుగుతా :మంగళగిరిలో వైఎస్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్

6లో..



లీకేజీ ఎలా జరిగింది?

ఎంతమందికి చేరిందో వివరాలు కావాలి

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై సుప్రీం

దాన్నిబట్టే తిరిగి పరీక్ష నిర్వహణపై నిర్ణయం

11న దర్యాప్తు నివేదిక ఇవ్వాలని సీబీఐకి ఆదేశాలు





న్యూఢిల్లీ : మే 5 నిర్వహించిన నీట్ యూజీ పరీక్షల్లో ప్రశ్నాపత్రం లీకవడం వాస్తవమేనని సుప్రీం కోర్టు సోమవారం వ్యాఖ్యానించింది. అయితే ఈ లీక్ అయిన ప్రశ్నా పత్రం ఎంతమందికి లీక్ అయిందన్నది నిర్ధారించుకోగలిగితేనే తిరిగి పరీక్ష నిర్వహించాలన్న నిర్ణయం తీసుకోగలుగుతామని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ తెలిపింది. లీక్ అయిన పేపర్‌ను సోషల్‌మీడియాలో పోస్టు చేసినట్టైతే దావానలంలా అది వ్యాపిస్తుందన్నారు. దర్యాప్తు ఎంతవరకు పూర్తయిందో తెలియచేసేలా నివేదికను అందచేయాల్సిందిగా సీబీఐని ఆదేశించారు. తదుపరి విచారణ జరిగే 11వ తేదీ నాటికి ఈ నివేదిక సిద్ధం కావాలన్నారు. లీక్ జరిగిన తీరుపై సమాచారాన్ని ఇవ్వాల్సిందిగా ...13లో

35 కార్పొరేషన్లకు కొత్త చైర్మెన్ల నియామకం

పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్‌గా పటేల్ రమేశ్‌రెడ్డి

అటవీ అభివృద్ధి సంస్థ చైర్మెన్‌గా పొదెం వీరయ్య

టీజీఐఐసీ చైర్‌పర్సన్‌గా నిర్మలాజగ్గారెడ్డి

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నామినేటెడ్ పదవుల భర్తీపై గత మూడు నెలలుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. పలు కార్పొరేషన్లకు చైర్మెన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి మార్చి 15నే జీవో విడుదలైంది. ఆ వెంటనే పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో చైర్మెన్లు బాధ్యతలు చేపట్టలేదు. ఎన్నికల దృష్ట్యా ఆగిన నియామకపు ఉత్తర్వులను ప్రభుత్వం తాజాగా సోమవారం విడుదల చేసింది. తమకు కూడా నామినేటెడ్ పదవులు ఇవ్వాలని పలువురు కాంగ్రెస్ నేతలు ఎన్నికల అనంతరం పట్టుబట్టారు. కార్పొరేషన్ చైర్మెన్లలో ...5లో



మాస్కోలో మోడీ

రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రత్యేకమైనది

పర్యటనకు ముందు ప్రధాని వ్యాఖ్యలు

వివరాలు 13లో..



జనంలో రాహుల్

మణిపూర్ పునరావాసులకు అండగా ఉంటానని భరోసా

వివరాలు 13లో..



విశ్వాస పరీక్షలో నెగ్గాడు

హేమంత్ సోరెన్ ప్రభుత్వం విజయం

వివరాలు 13లో..

ఫ్రాన్స్‌లో లెఫ్ట్ ఫ్రంట్ విజయం

అతిపెద్ద కూటమిగా అవతరించిన వామపక్షం

ఫ్రాన్స్ ప్రధాని అత్తల్ రాజీనామా

తాత్కాలికంగా కొనసాగాల్సిందిగా అధ్యక్షుడు మక్రాన్ సూచన



పారిస్ : ఫ్రాన్స్ ఎన్నికల బరిలో వామపక్ష కూటమి, మధ్యే మార్గ, మితవాద పార్టీలు మూడు వున్నా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీ ఏ పార్టీకి రాలేదు. వామపక్షమే ఎక్కువ సీట్లు గెలుచుకుని అతిపెద్ద కూటమిగా అవతరించింది. యురోపియన్ యూనియన్ ఎన్నికల్లో మితవాద పార్టీ గెలుపొందిన నేపథ్యంలో అర్థంతరంగా మధ్యంతర ఎన్నికలకు మక్రాన్ పిలుపునిచ్చారు. తన అధికారాన్ని మరింత సుస్థిరం చేసుకునే ఆలోచనతో తీసుకున్న ఈ చర్య ప్రతికూల ఫలితాన్ని ఇచ్చింది. పారిస్ ఒలింపిక్స్ ప్రారంభం కావడానికి ఇంకా మూడు వారాలు కూడా గడువు లేదు. ఈ పరిస్థితుల్లో ఈ నిర్ణయం అంతర్జాతీయ వేదికపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. రాజకీయ పరిస్థితులను సరిదిద్దుకోవడానికి మాక్రాన్‌చేసిన ప్రయత్నం బెడిసి కొట్టడంతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి స్పష్టమైన పంథా లేకపోయింది. ఇదిలా ఉండగా ఫ్రాన్స్ ప్రధాని గాబ్రియెల్ అత్తల్ తన పదవికి చేసిన రాజీనామాను అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మక్రాన్ సోమవారం తిరస్కరించారు. తాత్కాలికంగా పదవిలో కొనసాగాల్సిం దిగా కోరారు. ఆదివారం ...5లో

సీపీఐ(ఎం) అభినందనలు

ఫ్రాన్స్ పార్లమెంట్ ఎన్నికల్లో వామపక్ష కూటమి అతిపెద్ద కూటమిగా అవతరించడంపై సీపీఐ(ఎం) హర్షం వ్యక్తం చేసింది. ఫ్రాన్స్ వామపక్షాలకు, నేతలకు అభినందనలు తెలియచేసింది. న్యూ పాపులర్ ఫ్రంట్‌గా ఎన్నికల బరిలో నిలిచిన వామపక్షాలు ఎక్కువ సీట్లను గెలుచుకున్నాయి. కేవలం మూడు వారాల క్రితమే ఏర్పడిన ఈ న్యూ పాపులర్ ఫ్రంట్‌లో కమ్యూనిస్టు పార్టీ, మెలంకన్ నేతృత్వంలోని లా ఫ్రాన్స్ ఇన్‌సోమైజ్, సోషలిస్టు ...5లో



మునిగిన ముంబయి

ఆరు గంటల్లో 300 మి.మీ వర్షపాతం

- జలదిగ్బంధంలో మహానగరం
- రైళ్లు, విమానాలు రద్దు
- పాఠశాలలకు సెలవులు
- మరో మూడ్రోజులు భారీ వర్షాలకు ఐఎండీ హెచ్చరిక

ముంబయి : మహారాష్ట్ర రాజధాని ముంబయిని భారీ వర్షాలు ముంచెత్తాయి. ఆదివారం, సోమవారం కురిసిన వర్షాలతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలకు సోమవారం సెలవు ప్రకటించారు. రైల్వే ట్రాక్‌లపై నీరు చేరడంతో రైలు సేవలకు ఆటంకం ఏర్పడింది. అనేక సబర్బన్ సర్వీసులను రద్దు చేశారు. పలు రైళ్లను దారి మళ్లించారు. ముంబయితో పాటు మహారాష్ట్రలోని అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురిసాయి. కేవలం ముంబయిలోనే కొన్ని ప్రాంతాల్లో అర్ధరాత్రి 1 నుండి సోమవారం ఉదయం 7 గంటల వరకు ఆరుగంటల వ్యవధిలో రికార్డు స్థాయిలో 300 మి.మీ పైగా వర్షపాతం నమోదైనట్టు ...13లో

మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా 17 నుంచి 25 వరకు రాష్ట్రవ్యాప్త సదస్సులు

వామపక్ష పార్టీల పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మైనార్టీల మీద బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు చేస్తున్న మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా ఈనెల 17 నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సదస్సుకు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, డీజీ నరసింహారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమ, రామచందర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె గోవర్దన్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఎం శ్రీనివాస్, ఆకుల పాపయ్య, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, ఎస్‌యూసీఐ(సీ) నాయకులు ధర్మతేజ, ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు సోమవారం ...13లో

టీచర్ పోస్టులు పెంచాలి

డీఎస్సీకి మూడు నెలల సమయం కేటాయించాలి

- తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి
- జేఏసీ నేతలు,నిరుద్యోగుల అరెస్ట్

వివరాలు 13లో



వణికిస్తున్న జ్వరాలు

సీజనల్ వ్యాధులతో కిక్కిరిసిన ఆస్పత్రులు

అసలే వానల కాలం.. ఆపై సీజనల్ వ్యాధులు రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ప్రతి ఇంట్లో దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతున్న వారు లేరంటే ఆశ్చర్యపోవాల్సిందే. ఇది ఒకరి నుంచి మరొకరికి ప్రబలడంతో ఇంటిల్లిపాది మంచం పడుతున్నారు. మరోపక్క డెంగ్యూ కేసులూ నమోదవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 900పైగా కేసులు నమోదైనట్టు ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. వైరల్ ఫీవర్‌తో ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ల్యాబ్‌ల కొరత వేధిస్తుండగా ఉన్న యంత్రాలు పని చేయడం లేదు. దీంతో రోగులు ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తుండగా వారి నుంచి యాజమాన్యాలు వేల రూపాయలు దండుకుంటున్నాయి.



నవతెలంగాణ- మొఫిసిల్ యంత్రాగం

రాష్ట్రంలో జ్వరాలతో నెల రోజుల నుంచి ఆస్పత్రులకు వస్తున్న రోగుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. పదిరోజుల నుంచి ఓపీ(ఔట్ పేషెంట్లు) బాగా పెరిగింది. హైదరాబాద్ నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో సాధారణ రోజుల్లో 40 మంది వస్తుంటే .. ఆ సంఖ్య 80 నుంచి వందకు పెరిగిందని డాక్టర్లు చెబుతున్నారు. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు వచ్చే రోగులతో వెయ్యిచొప్పున ఓపీ ...5లో

హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో డెంగ్యూ కేసులు నమోదు

జిల్లా, ప్రధాన ఆస్పత్రుల్లో రోజుకు 500 నుంచి వెయ్యిపైగా...

బస్తీ దవాఖానాల్లోనూ ఓపీకి క్యూ

కలుషిత ఆహారం, అపరిశుభ్రతే ప్రధాన కారణమంటున్న వైద్యులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ల్యాబ్‌ల కొరత.. పలుచోట్ల పనిచేయని వైనం

వేల రూపాయలు దండుకుంటున్న ప్రయివేటు ఆస్పత్రులు

జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

ఆరోగ్య పరీక్షల పేరిట దోపిడీ

భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులు పక్కదారి



టెస్టులు చేయకున్నా చేసినట్టు లెక్కలు..దారిమళ్లుతున్న వందల కోట్లు

కార్డులు రద్దవుతాయంటూ బెదిరింపులు.. అవసరం లేకున్నా టెస్టులు

ప్రయివేటు కంపెనీకి దొడ్డిదారిన కట్టబెట్టిన బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు :

సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షల పేరిట పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతున్నదనీ, వారి వెల్ఫేర్ బోర్డు నుంచి వందల కోట్ల రూపాయల నిధులు పక్కదోవ పడుతున్నాయని సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ చెప్పారు. వైద్యపరీక్షల పేరుతో జరుగుతున్న దోపిడీపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గోల్కొండ క్రాస్‌రోడ్డులోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 2022లో సీఎస్‌సీ హెల్త్‌కేర్ వెల్‌నెస్ సర్వీసెస్ లిమిటెడ్ అనే సంస్థకు కాంట్రాక్టు ఇచ్చాయని తెలిపారు. సంస్థ స్థాపించి ఏడాది గడవకముందే రాష్ట్రమంతటా టెస్టులు చేసే అవకాశం ఆ సంస్థకు ఎలా ఇచ్చారు? అంతే ధరలో అపోలో, యశోద, విజయా డయాగ్నస్టిక్ సెంటర్‌లో టెస్టులు చేస్తుంటే కొత్త సంస్థకు ఇవ్వడమేంటి? టెండర్లు వేయకుండా నేరుగా ఆ సంస్థకు ఎందుకిచ్చారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఇక్కడే అవినీతికి బీజం పడిందని తెలిపారు. రాష్ట్రంలో 14 లక్షల మంది నిర్మాణ రంగ కార్మికులుండగా ...13లో

ఐసీడీఎస్‌కు బడ్జెట్‌లో కేంద్రం నిధులు పెంచాలి

- అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలి : డిమాండ్స్‌డేలో పాల్గొననున్న అంగన్‌వాడీలు : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు ఎక్కువ నిధులను కేటాయించి బలోపేతం చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, కోశాధికారి పి.మంగ డిమాండ్ చేశారు. ఈ నెల పదో తేదీన దేశవ్యాప్తంగా జరిగే డిమాండ్ల డేలో అంగన్‌వాడీలు పాల్గొంటారని ప్రకటించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. అంగన్‌వాడీలకు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని కోరారు. గత ప్రభుత్వం సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్య సంరక్షణ, విద్య(ఈసీసీఈ), ప్రీ స్కూల్ విద్యావిధానాన్ని బలోపేతం చేయాలని విన్నవించారు. అంగన్‌వాడీ కేంద్రాలను నోడల్ ఏజెన్సీలుగా నియమించి ఈసీసీఈని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ టీచర్లను మూడు, నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. 45 ఐఎల్‌సీ సిఫారసులను అమలు చేయాలనీ, కనీస వేతనం రూ.26 వేలు, కనీస పింఛన్ రూ.10 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీలకు పే కమిషన్ వర్తింపజేయాలనీ, వారికి ట్రేడ్ యూనియన్ హక్కులను గుర్తించాలని విన్నవించారు. ఐసీడీఎస్‌ను ప్రయివేటీకరించొద్దని కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్‌హెచ్‌ఎం పథకాన్ని ప్రయివేటీకరించొద్దు

- ఆశాల సమస్యలు పరిష్కరించాలని 10న డిమాండ్ల డేలో పాల్గొంటాం : వైద్యారోగ్య కమిషనర్‌కు సీఐటీయూ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్ఎం) పథకానికి బడ్జెట్ పెంచాలనీ, దాన్ని ప్రయివేటీకరించొద్దని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి, కోశాధికారి పి.గంగమణి, కార్యనిర్వాహక అధ్యక్షులు కాసు మాధవి కోరారు. ఆశాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల పదో తేదీన తలపెట్టిన డిమాండ్ల డేలో ఆశాలందరూ పాల్గొంటారని ప్రకటించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్య కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆశాలకు నష్టం చేకూర్చే పరీక్షను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం నిర్ణయాన్ని రాష్ట్ర సర్కారు అమలు చేయవద్దని కోరారు. 45వ ఐఎల్‌సీ సిఫారసులను అమలు చేయాలనీ, ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ, తదితర చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు. ప్రతి నెలా పదివేల రూపాయల పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

కాసుల వర్షం కురిపిస్తున్న జీఎస్టీ

కానీ నెలవారీ వివరాలు ఏవి?

- త్రైమాసిక సమాచారంలోనూ జాప్యం
- సంపన్నులకే పన్ను మినహాయింపులు
- సామాన్యుల జేబులకు చిల్లులే



న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద నెలవారీ ఆదాయం రికార్డు స్థాయిని చేరుతోంది.

అయితే అధికారులు మాత్రం రాష్ట్రాలకు నెలవారీగా పంపకాలు జరపడం లేదు. సాధారణంగా అధికారులు పత్రికా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి నెలవారీ రాబడుల సమాచారాన్ని అందిస్తారు. అయితే ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈసారి అలాంటి సమావేశాన్ని నిర్వహించలేదు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తరచుగా సమాచారంలో పారదర్శకత, జవాబుదారీతనం గురించి మాట్లాడుతుంటారు. కానీ ఆచరణలో మాత్రం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.

జాప్యంపై అనుమానాలు

ఆర్థిక సమాచారాన్ని విడుదల చేయకుండా ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తోందన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

పెరిగిన వసూళ్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వసూళ్ల మోత మోగాయి. ఏప్రిల్ నెలలో వసూళ్లు రికార్డు స్థాయికి చేరాయి. ఆ నెలలో రూ.2.10 లక్షల కోట్ల ఆదాయం సమకూరింది. మే, జూన్ నెలల్లో రూ.1.73 లక్షల కోట్ల చొప్పున ఆదాయం వచ్చింది. మరో మాటలో చెప్పాలంటే ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో అంటే తొలి త్రైమాసిక కాలంలో రూ.5.57 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది.

సంపన్న దేశాలు నెలవారీగా జీఎస్టీ సమాచారాన్ని విడుదల చేస్తున్నాయి. కానీ మన దేశంలో త్రైమాసిక సమాచారం రెండు నెలల ఆలస్యంగా బయటికి వస్తోంది. ప్రభుత్వం నెలవారీ జీఎస్టీ సమాచారాన్ని ప్రతి నెలా మొదటి తేదీన విడుదల చేస్తే ప్రభుత్వానికి సంబంధించిన ఆర్థిక వివరాలు అందరికీ తెలుస్తాయి.

సామాన్యుల జేబులు కొల్లగొడుతోంది

జీఎస్టీ విధించడానికి ముందు కంటే దానిని అమలు చేసిన తర్వాత పన్ను రేటు తగ్గిందని ఆర్థికవేత్తలు తెలిపారు.

అధిక రాబడులు ఎప్పుడూ ఆనందదాయకమే. అయితే అధిక ధరలు, తక్కువ ఆదాయాలతో జీవితాలు నెట్టుకొచ్చే కుటుంబాల జేబులను ప్రభుత్వం కొల్లగొడుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

2017లో ప్రభుత్వ సగటు నెలవారీ ఆదాయం 85,000 కోట్లు ఉండగా ఇప్పుడది రూ.1.17 లక్షల కోట్లకు చేరింది. అంటే పరోక్ష పన్ను రాబడులు గణనీయంగా పెరిగాయన్న మాట. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నెలవారీ జీఎస్టీ వసూళ్లు సగటున రూ.1.51 లక్షలు ఉండగా అది 2023-24లో రూ.1.68 లక్షల కోట్లకు పెరిగింది.

పన్ను రేటు పెంచితే మరింత భారమే

ఎక్కువ ఖర్చు చేసే వారికి మినహాయింపులు ప్రయోజనం చేకూరిస్తే తక్కువ ఖర్చు చేసే వారికి తక్కువ పన్ను రేట్లు ప్రయోజనం కలిగిస్తాయని, కాబట్టి యథాతథ స్థితిని పాటించాలని పత్రం సిఫార్సు చేసింది. ఉదాహరణకు తక్కువ పన్ను పరిధిలో 5శాతం మినహాయింపులు ఉన్న వస్తువుల వినియోగం నెలవారీ సగటు వ్యయంలో కేవలం 4.8శాతం మాత్రమే. అయినా 5శాతం తక్కువ పన్ను రేటు పరిధిలో ఉన్న వారికి సగటు నెలవారీ వ్యయంలో 18.5శాతం -36.5శాతం వాటా ఉంది. కాబట్టి పన్ను రేటును పెంచే ప్రయత్నం చేస్తే పన్ను భారాన్ని పెంచినట్లే అవుతుంది.

మినహాయింపులతో ఎవరికి లాభం ?

జీఎస్టీ రేట్లపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పన్ను మినహాయింపులను రద్దు చేస్తే పన్ను చెల్లింపుదారులపై భారం పడదని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ) విడుదల చేసిన వర్కింగ్ పేపర్ తెలిపింది. ఇది స్వతంత్ర ప్రతిపత్తి కలిగి, ఆర్థిక మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్న పరిశోధనా సంస్థ. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ ఖర్చు చేస్తున్న వినియోగదారులు జీఎస్టీ మినహాయింపుల నుండి ప్రయోజనాలు పొందుతున్నారని ఈ సంస్థ చెబుతోంది. తక్కువ ఖర్చు చేస్తున్న వినియోగదారులే అధిక ప్రయోజనం పొందుతున్నారన్న వాదనను ఈ పత్రం పటాపంచలు చేసింది. మినహాయించిన వస్తువులు, సేవలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడం ద్వారా పన్ను వ్యవస్థను విస్తృతం చేయవచ్చునని, ఇది తిరోగమన చర్య కాబోదని ఆ పత్రం తెలిపింది.

పంటల బీమాపై అలసత్వం

ఆసక్తి చూపని ఇన్సూరెన్స్ కంపెనీలు

న్యూఢిల్లీ : 2023-24లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం కింద రైతుల పంటలకు బీమా సౌకర్యం కల్పించేందుకు ఇన్సూరెన్స్ కంపెనీలు ఆసక్తి చూపలేదు. వ్యవసాయ రంగంలో బీమా కవరేజిని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ ఇన్సూరెన్స్ కంపెనీలు ముందుకు రావడం లేదు. 2022-23లో ఇన్సూరెన్స్ కంపెనీలు రూ.32,011 కోట్ల మేర రైతుల పంటలకు బీమా పూచీకత్తు ఇచ్చాయి. అయితే 2023-24లో అది రూ.30,677 కోట్లకు...అంటే 4.17% తగ్గిపోయింది. వరదలు, అసాధారణ వర్షాలు, వడగాల్పుల కారణంగా రైతులు పెద్ద ఎత్తున నష్టపోయినప్పటికీ బీమా కంపెనీలు కనికరించలేదు.

2022-23 ఆర్థిక సంవత్సరంలో పంటల బీమా ప్రీమియం పూచీకత్తు 8.66% పెరిగి రూ.29,465 కోట్లకు చేరింది. అయితే 2023-24లో బీమా కంపెనీల పూచీకత్తు తగ్గడానికి ప్రధాన కారణం ప్రభుత్వ ఆధ్వర్యంలోని వ్యవసాయ బీమా కంపెనీ (ఏఐసీ) ప్రీమియం ఆదాయ పూచీకత్తును 32%కి తగ్గించడమే. 2022-23లో రూ.14,619 కోట్లుగా ఉన్న ఈ హామీ గత సంవత్సరం రూ.9,890 కోట్లకు తగ్గిపోయింది. దేశంలో పంటల బీమా కల్పిస్తున్న కంపెనీలలో ఏఐసీ పెద్దది. ఏఐసీతో పాటు న్యూ ఇండియా అస్యూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ జనరల్ కంపెనీలు కూడా గత సంవత్సరం పంటల బీమా మొత్తాన్ని తగ్గించాయి. ఈ నాలుగు కంపెనీలు ప్రత్యక్షంగా లేక పరోక్షంగా ప్రభుత్వ నియంత్రణలో ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ రంగంలోని ఓరియంటల్ ఇన్సూరెన్స్ రూ.8.94 కోట్ల మేరకు మాత్రమే పంటల బీమా కవరేజి కల్పించింది. గత ఆర్థిక సంవత్సరం రైతులకు కష్టాలు, కన్నీళ్లనే మిగిల్చింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఇది ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారితీసింది.



మాస్కో వెళతావు కానీ

మణిపూర్ వెళ్లవా?

ప్రధాని మోడీని ప్రశ్నించిన కాంగ్రెస్



(ఫైల్)

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీకి మాస్కో వెళ్లే తీరిక ఉంది కానీ అల్లర్లతో అట్టుడికిన మణిపూర్ వెళ్లడానికి తీరిక చిక్కలేదని కాంగ్రెస్ ఎత్తిపొడిచింది. మణిపూర్‌లో హింస ప్రజ్వరిల్లిన తర్వాత తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అక్కడికి మూడుసార్లు వెళ్లారని గుర్తు చేసింది. మణిపూర్ సందర్శనకు కొద్ది గంటలు కేటాయించడానికి కూడా ప్రధాని విముఖంగా ఉన్నారని విమర్శించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ విలేకరులతో మాట్లాడుతూ 'ప్రధాని మాస్కో వెళ్లారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత అస్సాం, మణిపూర్ పర్యటనలో ఉన్నారు' అని చెప్పారు.గత సంవత్సరం మే 3వ తేదీన మణిపూర్‌లో అల్లర్లు ప్రారంభమయ్యాయని, తీవ్ర సంక్షోభం నెలకొని ఉన్నప్పటికీ ఆ రాష్ట్రానికి వెళ్లేందుకు ప్రధానికి కొన్ని గంటల సమయం కూడా దొరకడం లేదని, అసలు అక్కడికి వెళ్లే ఉద్దేశం ఆయనకు లేదని జైరాం రమేష్ తెలిపారు. మణిపూర్ ముఖ్యమంత్రి బీజేపీకి చెందిన వ్యక్తే అయినప్పటికీ ఆయనను, ఆ రాష్ట్రానికి చెందిన ఇతర రాజకీయ నేతలను, ప్రజా ప్రతినిధులను మోడీ ఇప్పటి వరకూ కలవలేదని జైరాం రమేష్ చెప్పారు.

'వికసిత్ భారత్'పై ఎన్‌సీఈఆర్‌టీ క్వశ్చన్ బ్యాంక్

మెటీరియల్ సైతం సిద్ధం

- ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లో ఉపయోగించాలని పాఠశాలలను కోరిన వైనం
- టీచర్లు, తల్లిదండ్రుల నుంచి వెల్లువెత్తుతున్న ఆందోళన



న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తన రాజకీయాల కోసం పాఠశాలలనూ వదలటం లేదు. వికసిత్ భారత్ కార్యక్రమం కింద కేంద్రం చేపట్టిన ప్రాజెక్టుల గురించి పాఠశాలల్లోనూ చర్చ జరిగేలా ప్రణాళికలు చేస్తున్నది. ఇందుకు జాతీయ విద్యా పరిశోధనా శిక్షణా కౌన్సిల్(ఎన్‌సీఈఆర్‌టీ)ని పావుగా వాడుకుంటున్నది. వికసిత్ భారత్ ప్రోగ్రామ్ కింద కేంద్రం చేపట్టిన ప్రాజెక్టులపై క్వశ్చన్ బ్యాంక్, స్టడీ మెటీరియల్‌ను ఎన్‌సీఈఆర్‌టీ సిద్ధం చేసిందని ప్రభుత్వాధికారులు చెప్తున్నారు. పాఠశాలలు తమ అంతర్గత పరీక్షల్లో(ఇంటర్నల్ అసెస్‌మెంట్) వాటిని ఉపయోగించాలని ఎన్‌సీఈఆర్‌టీ కోరుతున్నదని వివరించారు. అయితే, ఈ నిర్ణయం తీసుకునే ముందు పాఠశాల బోర్డులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సంబంధిత వర్గాలు, వ్యక్తులను ఎన్‌సీఈఆర్‌టీ సంప్రదించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాల అంతర్గత పరీక్షలు.. బోర్డు పరీక్షలలో 20 శాతం వెయిటేజీని కలిగి ఉంటాయి.

అయితే, ఎన్‌సీఈఆర్‌టీ తీసుకున్న నిర్ణయం పట్ల పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వికసిత్ భారత్ ప్రభుత్వ కార్యక్రమమనీ, ఇది సిలబస్‌లో భాగం కాకపోయినా.. దాని ఆధారంగా ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లు నిర్వహించటం ఏ మాత్రమూ ఆమోదయోగ్యం కాదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తన అజెండాను పిల్లలపై బలవంతంగా ప్రయోగించటానికి ప్రయత్నిస్తున్నదని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్వశ్చన్ బ్యాంక్‌పై పాఠశాలలు లేదా తల్లిదండ్రుల నుంచి ఎన్‌సీఈఆర్‌టీ ఎలాంటి అభిప్రాయాన్ని కోరలేదని అంటున్నారు.

కాల్పుల విరమణ జరగాలి,

బందీలను విడుదల చేయాలి

ఇజ్రాయిలీల నిరసనలు, రహదారుల దిగ్బంధం

జెరూసలేం : గాజాలో ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించి ఆదివారానికి 9మాసాలు గడిచింది. ఈ నేపథ్యంలో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని, పాలస్తీనియన్ల చెరలో వున్న బందీలను విడిపించాలని కోరుతూ ఇజ్రాయిలీలు దేశవ్యాప్తంగా ఆదివారం రహదారులను దిగ్బంధించారు. ప్రధాని నెతన్యాహు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఒప్పందం కుదర్చడానికి అంతర్జాతీయ మధ్యవర్తులు కృషి చేస్తున్న తరుణంలో ఈ ప్రదర్శనలు చోటు చేసుకున్నాయి. గత అక్టోబరులో హమాస్ దాడి ప్రారంభించిన సమయమైన ఉదయం 6.29గంటలకే ఆదివారం నిరసనలు, ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ప్రధాన రహదారులను దిగ్బంధించారు. ఇజ్రాయిల్ ఎంపీల ఇళ్ళ వెలుపల ప్రదర్శనలు నిర్వహించారు. ఇజ్రాయిల్ వైపు మరణించిన, కిడ్నాప్‌కు గురైన వారికి గుర్తుగా 1500 నలుపు, పసుపు బెలూన్లు గాజాతో గల సరిహద్దు సమీపంలో ఆందోళనకారులు ఎగురవేశారు. బందీల విడుదల ఒప్పందంలో భాగంగా ఇప్పటివరకు వంద మందికి పైగా బందీలు విడుదలయ్యారు. ఇంకా 120మంది వరకు హమాస్ చెరలో వున్నారు. బందీల విడుదల ఒప్పందంలో భాగంగా దాడులకు కాస్త విరామం ఇవ్వడమే తప్ప పూర్తిగా నిలిపివేసేది లేదని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేశారు.

గాజాలో 24గంటల్లో 40మంది మృతి

తాజాగా ఆర్మీ ఆదేశాలతో దిక్కుతోచని స్థితిలో పాలస్తీనియన్లు



గాజా : అడ్డూ అదుపు లేకుండా గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులతో గత 24గంటల్లో 40మంది మరణించారు. 75మందికి పైగా గాయపడ్డారు. ప్రజలందరూ ఖాళీ చేయాల్సిందేనని ఇజ్రాయిల్ ఆర్మీ తాజాగా ఆదేశాలు జారీ చేయడంతో గాజాలో పలు ప్రాంతాల్లోని పాలస్తీనియన్లు ఎక్కడకు వెళ్లాలో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

నిరంతరాయంగా కొనసాగుతున్న దాడుల నేపథ్యంలో ఆదివారం రాత్రి కాళ రాత్రని హమాస్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. ఇజ్రాయిల్ బలగాలు దాడులను ముమ్మరం చేశాయి.

పౌరులపై శతఘ్ని గుళ్ళ వర్షం కురిసిందని, వారు అక్కడ నుండి పారిపోయేలా ఒత్తిళ్ల తీసుకువస్తున్నారని హమాస్ అధికారి పొలిటికల్ బ్యూరో సభ్యుడు హుసమ్ బద్రన్ విమర్శించారు. కాగా కాల్పుల విరమణపై ఈజిప్ట్, కతార్‌ల్లో ఈ వారం చర్చలు జరగవచ్చని భావిస్తున్నారు. కాల్పుల విరమణ ప్రతిపాదనలపై తాము సానుకూలంగా స్పందించామని, ఇక బంతి నెతన్యాహు కోర్టులో వుందని ఆయన వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఆపాలని అమెరికా ప్రభుత్వం నిజంగా కోరుకుంటే కాల్పుల విరమణ జరిగేలా నెతన్యాహుపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు. ఆయనను ప్రధానిగా కూర్చోబెట్టరాదని, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో నేరస్తుడిగా ఆయనను కూర్చోబెట్టాలని, అదే ఆయన స్థానమని విమర్శించారు. నైతిక విలువలు, మానవత్వం గురించి పదే పదే చెప్పే అంతర్జాతీయ సంస్థల బూటకత్వం, ద్వంద్వ ప్రవృత్తి బయటపడుతోందని, ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తున్నారని విమర్శించారు.

పశ్చిమ రాఫా నగరంలో జరిగిన కాల్పుల్లో నలుగురు మరణించారని పాలస్తీనా మీడియా తెలిపింది. ఇదిలావుండగా, గాజాలోని పలు ప్రాంతాల్లో ప్రజలను వెళ్ళిపోవాల్సిందిగా ఆర్మీ ఆదేశాలు జారీ చేసింది. వారందరినీ దక్షిణ గాజాలోని అల్ మవసి ప్రాంతంలో మానవతా జోన్ దగ్గరకు వెళ్ళాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. గాజా దక్షిణ, పశ్చిమ జిల్లాల్లో సోమవారం ఉదయం కూడా దాడులు జరిగాయి. ఇప్పటికి 9మాసాలుగా జరుగుతున్న ఈ దాడుల్లో 38,193మంది మరణించగా, 87,903మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. మరణించిన వారిలో 15,983మంది పిల్లలు కాగా, 10,637మంది మహిళలని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

మార్పేది?

- పలు రంగాల్లో కనిపించని పురోగాభివృద్ధి
- మోడీ పాలనలో పేదలు ఇంకా పేదలుగానే
- పని చేయని ప్రభుత్వ పథకాలు

కలగానే మహిళా సాధికారత

- దేశంలో నిరుద్యోగ యువతకు అందని నైపుణ్యాలు
- భారత్‌లో ఆశించినంతగా లేని సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు
- ఆర్థిక నిపుణులు, విశ్లేషకుల అంచనాలు



న్యూఢిల్లీ : భారత్ అనేక రంగాల్లో పురోగమిస్తున్నదని కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలతో పోలిస్తే భారత్ ఐదో ఆర్థిక వ్యవస్థగా నిలిచిందనీ, ఇది తమ ప్రభుత్వ గొప్పతనమేనని అంటున్నది. అయితే, మోడీ చెప్తున్నట్టుగా భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థే అయినా.. అది పేపర్లకు మాత్రమే పరిమితమనీ, వాస్తవానికి క్షేత్రస్థాయిలో పేదల సంఖ్య అధికంగా ఉన్నదని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు.

ఇలాంటి తరుణంలో పలు ప్రాంతాలలో పేదరికాన్ని నిర్మూలించటానికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రారంభించింది. కానీ పేదరిక నిర్మూలన పథకాలు ఉచిత రేషన్లు, విద్యార్థులకు సైకిళ్లు, ల్యాప్‌టాప్‌లు, నగదు పంపిణీ వంటివి దీర్ఘకాలంలో నిలకడగా ఉండవని ఆర్థిక నిపుణుల విశ్లేషణను బట్టి తెలుస్తున్నది. "భారత్‌లోని చిన్న పట్టణాలకు చెందిన నిరుద్యోగ యువత భాషా నైపుణ్యాలు తక్కువగా ఉన్నాయి. కొత్త సాంకేతికతను వారు పొందలేకపోతున్నారు. వేగంగా మారుతున్న మార్కెట్ సవాళ్లను వారు అందుకోలేకపోతున్నారు" అని విశ్లేషకులు చెప్తున్నారు. "ప్రపంచవ్యాప్తంగా రెండో, మూడో, నాలుగో స్థాయి దేశాల కోసం అభివృద్ధి వ్యూహాలను ప్రోత్సహించటానికి ఐక్యరాజ్యసమితి(యూఎన్) ఏజెన్సీలు రూపొందించిన వందలాది పదాలలో 'సుస్థిర అభివృద్ధి' అనే పదం ఎక్కువగా ఉపయోగించబడింది. అధికారిక కమిటీలలో, ప్రభుత్వం, ఎన్జీఓల మధ్య ఉమ్మడి చర్చలలో ఇది ఒక నిర్దిష్ట ధృఢమైన, తిరుగులేని స్థిరమైన పురోగతిని సూచించటానికి విస్తారంగా ఉపయోగించబడుతుంది. అయితే, ఈ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు మాత్రం దేశంలో ఆశించినంతగా లేవు" అని వారు అంటున్నారు.

2015లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యూఎన్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ (ఎస్డీజీ) ఎజెండాను భారత్ ఆమోదించింది. ఇది 2030కి సంబంధించి 17 లక్ష్యాలు, 169 అనుబంధిత లక్ష్యాలను జాబితా చేసింది. పేదరికం, వివిధ రకాల లింగ వివక్షలను నిర్మూలించటానికి ఉద్దేశించిన ఎజెండా అంశాలు ఇందులో ఉన్నాయి. 1947 నుంచి భారత ప్రభుత్వాలు, అభివృద్ధి విధాన చట్రంలో వివిధ మార్పులను చూస్తున్నాయి. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం చేసిన మొదటి చర్యల్లో ఒకటి, ప్రణాళికా సంఘాన్ని తీసేసి.. దాని స్థానంలో నిటి ఆయోగ్‌ని ఏర్పాటు చేయటం. పైన పేర్కొన్న లక్ష్యాలను సాధించటంలో భారత్ సాధించిన పురోగతిపై ఇటీవల విడుదల చేసిన నిటి ఆయోగ్ నివేదికను పరిశీలిస్తే.. గత దశాబ్దంలో కేంద్రం వృత్తిపరమైన ఏజెన్సీల ద్వారా క్రమం తప్పకుండా రూపొందించబడే ముఖ్యమైన డేటా లేకపోవటం గమనించదగినది.

కానీ వివిధ కారణాలతో భారత అన్ని ముఖ్యమైన దశాబ్దాల సెన్సస్ డేటా 2011 నుంచి అందుబాటులో లేదు. అలాగే 2019, 2020-21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) డేటా కూడా అందుబాటులో లేదు. కోవిడ్‌కు సంబంధించిన డేటా కూడా అదే విధంగా అందుబాటులో లేకపోవటం గమనార్హం. "పేద ప్రాంతాలలో పేదరికాన్ని నిర్మూలించటానికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రారంభించింది. కొన్ని గణాంకాల ప్రకారం భారత్‌లో దాదాపు 15 శాతం బహుమితీయ (మల్టీడైమెన్షనల్) పేదరికం తగ్గిందని చెప్తున్నారు. కానీ అందుబాటులో ఉన్న వివరాలను నిశితంగా పరిశీలిస్తే.. పేదరిక నిర్మూలన పథకాలు ఉచిత రేషన్లు, విద్యార్థులకు సైకిళ్లు లేదా ల్యాప్‌టాప్‌లు, నగదు హ్యాండ్‌అవుట్‌లు వంటివి దీర్ఘకాలంలో నిల కడగా ఉండవని తెలు స్తున్నది. భారత్‌లో చాలా పేద కుటుంబాలు నిరక్షరాస్యత, పేదరికం వంటి సమస్యలు ఇప్పటికీ ఎదుర్కొంటున్నాయి. పేదలు, ముఖ్యంగా యువకులు వ్యవసాయ ఆదాయాలు, భూములు తమ భవిష్యత్తు కాదని గ్రహించారు. ఎందుకంటే అవి రెండూ వేగంగా తగ్గిపోతున్నాయి. ఇప్పటివరకు అట్టడుగున ఉన్న కులాలకు చెందిన గ్రామీణ నిరుద్యోగులు రిజర్వేషన్‌పై తమ వాటాను కోరుకుంటారు. తద్వారా వారు నగరాలకు వెళ్లి గౌరవప్రదమైన పనిని పొందవచ్చని ఆశపడ్తున్నారు. ఆదాయ స్థిరత్వాన్ని తెచ్చే పెన్షన్ ఉద్యోగాలను అందించవచ్చని అనుకున్న అగ్నివీర్‌లాంటి పథకాల్లో ఆ పెన్షన్లు లేవని గ్రహిస్తున్నారు.

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్(డబ్ల్యూఈఎఫ్) ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ 2023 నివేదిక ప్రకారం.. ఈ నిరుద్యోగ యువతకు ఉన్న నైపుణ్యాలు పాతవి. కొత్త సాంకేతికతతో నడిచే పరిశ్రమ ఇప్పుడు కొత్త విశ్లేషణాత్మక, డిజిటల్ అక్షరాస్యతతో పాటు ఆంగ్లంపై మంచి పట్టును కోరుతున్నది. భవిష్యత్తు కోసం మెరుగైన ఉద్యోగాలు డేటా సైంటిస్టులు, క్లౌడ్ డెవలపర్‌లు, సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్‌లు, డిజిటల్ హెచ్ఆర్ నిపుణులు, కంటెంట్ క్రియేటర్‌లు వంటివి వీటిని కోరుతున్నాయి. భారత్‌లోని చిన్న పట్టణానికి చెందిన నిరుద్యోగ యువత భాషా నైపుణ్యాలు తక్కువగా ఉన్నాయి. కొత్త సాంకేతికతకు గురికావటం చాలా పరిమితంగా ఉన్నది.

మహిళా, శిశు సంక్షేమం విషయానికి వస్తే.. నిటి ఆయోగ్ నివేదిక మొత్తం పోషకాహార లోపం, మాతా, శిశు మరణాలలో తగ్గుదల ఉందని పేర్కొన్నది. కానీ ఈ కారకాలు మహిళలకు సంతోషకరమైన, ఆరోగ్యకరమైన, సురక్షితమైన జీవితాలకు హామీ ఇవ్వవని పరిశోధలకులు కొందరు చెప్పారు. భూమి, నీటి వనరులు, గాలి కాలుష్యం కొత్త సమస్యలతో మన మహిళలు ఎక్కువగా బాధపడుతున్నారని ఇటీవలి కొన్ని నివేదికలను వారు ఉటంకిస్తున్నారు. దేశంలోని అన్ని వయసుల మహిళల్లో రక్తహీనత స్థాయిలు పెరిగాయి. అయితే చాలా మంది భూమిలేని మహిళలు గతంలోలాగే వ్యవసాయ కార్మికులుగా పని చేస్తున్నారని పేర్కొంది ఆ నివేదిక. పిల్లల విషయానికొస్తే, ఉపాధ్యాయ-విద్యార్థుల నిష్పత్తి, హయ్యర్ సెకండరీ తరగతుల్లో స్థూల నమోదు రేట్లు కనిపించాయి.

వికలాంగ విద్యార్థుల నమోదులో కొంత మెరుగుదల ఉన్నది. కానీ ధనిక, పేదల మధ్య విస్తృత వ్యత్యాసం కారణంగా, రెండు కోవిడ్ సంవత్సరాలు పేద కుటుంబాల నుంచి వచ్చిన పిల్లల విద్యా పురోగతిని చాలా ఘోరంగా ప్రభావితం చేశాయి. ఎందుకంటే వారికి ఆన్‌లైన్ తరగతులను పొందే సౌకర్యాలు లేవు. పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటికీ, ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ తరగతుల్లో విద్యార్థుల సంఖ్య కరోనా మహమ్మారి స్థాయిల కంటే తక్కువగా ఉన్నది.

దేశంలో న్యాయం కోసం పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగానే పోరు సలపాల్సి వస్తున్నది. భారత్‌లో లక్ష జనాభాకు 1.93 కోర్టులు, 1.53 న్యాయమూర్తులు మాత్రమే ఉండటం గమనార్హం. సవరించిన కంపెనీల చట్టం 2013 ప్రకారం.. 500 లిస్టెడ్ కంపెనీలు బోర్డులో కనీసం ఒక మహిళా డైరెక్టర్‌ని కలిగి ఉండాలి. అయితే, వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఇలాంటి పరిస్థితులు కనిపించటం లేవు. ఇక పురుషులతో పోలిస్తే.. మహిళల వేతనాలు మాత్రం అంతగా పెరగటం లేదని గణాంకాలు వివరిస్తున్నాయి.



(ఫైల్)

113 కొత్త వైద్య కళాశాలలకు లైన్ క్లియర్

జాతీయ వైద్య కమిషన్ ఆమోదం

- యూపీకి అత్యధికంగా 22 కాలేజీలు
- తెలంగాణకు 11, ఏపీకి ఏడు

న్యూఢిల్లీ: జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నుంచి 113 కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతి లభించింది. ఇందులో యూపీ అత్యధిక సంఖ్యలో కాలేజీకి గ్రీన్ సిగ్నల్ పొందింది. సంబంధిత అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. అధికారుల సమాచారం ప్రకారం.. 22 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు యూపీ ఆమోదం పొందింది. ఆ తర్వాతి స్థానంలో మహారాష్ట్ర (14), రాజస్థాన్ (12), తెలంగాణ (11), పశ్చిమ బెంగాల్ (8), మధ్యప్రదేశ్ (7), ఆంధ్రప్రదేశ్ (7), కర్నాటక (5), తమిళనాడు (5), కేరళ (2)లు ఉన్నాయి. ఇక ఉత్తరాఖండ్‌లో మూడు కొత్త మెడికల్ కాలేజీలు రానున్నాయి. ఒడిశా, గుజరాత్‌లకు రెండు మెడికల్ కాలేజీల చొప్పున వస్తాయి. హర్యానా, ఢిల్లీ, అసోం, పంజాబ్, సిక్కిం, త్రిపురల్లో ఒక్కో మెడికల్ కాలేజీ చొప్పున ఏర్పాటుకు అనుమతి లభించింది.

నవతెలంగాణ

మంగళవారం 9 జులై 2024
www.navatelangana.com

సంపాదకీయం

తేడా...!?

డిమాండ్లలో తేడా గురించి మాత్రమే కాదు. రెండు ఆలోచనా ధారల్లో తేడా. రెండు సైద్ధాంతిక ధోరణుల్లో తేడా. "క్షీర నీర న్యాయం" లాగా ఇటీవలి కాలంలో కమ్యూనిస్టుల, ఇతర బూర్జువా పార్టీల విధానాలను ఇంత స్పష్టంగా బయటపెట్టిన ఘటన మరొకటి కానరాదు. మన సింగరేణి బొగ్గు గనుల వేలం రద్దు చేయాలంటాయి కమ్యూనిస్టు పార్టీలు. వేలంపాటకు సై అంటూనే మా గనులు మాకేదక్కాలంటాయి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు. ఒకటి ప్రభుత్వ రంగాన్ని కాపాడాలనేది, రెండవది ప్రభుత్వ రంగాన్ని తెగనమ్మాలనేది.

ఈ ఆశ్చర్యకర పరిణామాన్ని చూస్తే భారత గుత్త పెట్టుబడిదారులు తమ లాభాల్ని పెంచుకోవడానికీ, తమ బొక్కసాల్ని నింపుకోవడానికి చేస్తున్న నిరంతర ప్రయత్నాల ఫలితమే ఇదంతా అని అర్థమవుతుంది.

> కోలిండియా, ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ వంటివి వేలంలో అదానీ ఎగరేసుకుపోతుంటే సింగరేణి ఒక్కటే బతికి బట్టకలదా? సింగరేణిని రక్షించాలనుకునే రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ బీజేపీ విధానాలపై పోరాడటానికి ఏమి కృషి చేసింది? అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్ళవచ్చుకదా? సింగరేణి కార్మికుల్ని కదిలించడానికి, రాష్ట్ర ప్రజల్ని ఈ సమస్యపై పోరాటోన్ముఖుల్ని చేయటానికి చేసిన కృషి నాస్తి. మా 'శ్రావణపల్లి'మైన్ మాకే ఇవ్వాలంటే ఫలితం ఏమైనా ఉంటుందా?

ఇందిరాగాంధి తన పాలన చివర్లో, అంటే 1984 అక్టోబర్ మొదట్లో ఐఎమ్ఎఫ్ నుండి దిగుమతి చేసుకున్న డాక్టర్ అర్జున్ సేన్‌గుప్తాను "ప్రభుత్వ రంగ సంస్థల్ని ఏవిధంగా సంస్కరించాలో" చెప్పమని సలహా అడిగింది. "కోర్" సెక్టార్ తప్ప ఈ దేశంలో ప్రభుత్వరంగం అవసరం లేదని సదరు డాక్టర్‌జీ ప్రిస్క్రిప్షన్ ఇచ్చేసి వాషింగ్టన్ విమానమెక్కేశాడు. వాస్తవానికి ఆయన తన యజమాని (ఐఎంఎఫ్) ఆశించినట్టు, సారీ, ఆదేశించినట్టే చేశాడు. కానీ 2022 - 25 మధ్య రూ. 6 లక్షల కోట్లు ఈ కోర్ నుండే తెగ నమ్మడానికి నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ (ఎన్ఎంపీ) వేసింది మోడీ సర్కార్.



ఈ లిస్టులో బొగ్గు, విద్యుత్, టెలికం, రోడ్లు, హైవేలున్నాయి. అనేక ఇతర ఖనిజాలున్నాయి. వేర్‌హౌసులున్నాయి. ఆశ్చర్యమేమంటే వీటిల్లో ఇప్పటికే అంబానీ, అదానీలున్నారు. ఎల్అండ్‌టి వంటి వారి దోస్తులనేకులున్నారు. ప్రజలకవసరమైన మౌలిక రంగమంతా ప్రజల చేతుల్లోనే ఉండాలని, అంటే ప్రభుత్వమే అందించాలనేది "పాత చింతకాయ పచ్చడి" సిద్ధాంతం. ప్రభుత్వం చేసే పనంతా ప్రయివేటు వారి చేతుల్లో పెట్టేసి, అది చదువులైనా, ఆసుపత్రులైనా, ఏ సేవలైనా అమ్ముకోవచ్చనేది మార్గరేట్ థాచెర్ (1979-90లో బ్రిటీష్ ప్రధాని) సిద్ధాంతం. రైళ్ళని, నదుల్నీ, కరెంటును, విద్య, వైద్యాన్ని ఆమె ప్రయివేటీకరించింది. నరకం అంటే ఎక్కడుంటుందంటే బ్రిటన్ రైల్వే వ్యవస్థలో ఉంటుందన్న నానుడి ఉనికిలోకొచ్చింది. ప్రస్తుతం బ్రిటన్ ప్రభుత్వమే రైల్వేలను నడుపుతున్నది. ఇటీవలి ఫ్రంట్ లైన్‌లో సిపి చంద్రశేఖర్ "కొలాప్స్ ఆఫ్ నియోలిబరల్ ప్రయివేటైజేషన్"లో థేమ్స్ నదిని కాంట్రాక్టుకు తీసుకున్న సంస్థ 'థేమ్స్ వాటర్' బుడుంగున మునిగిందని రాశారు.

ఘనత వహించిన భారత పాలకులకివేవీ పట్టవు. ఈ నేపథ్యంలో "నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్"లో భాగంగా బొగ్గు గనుల ప్రయివేటీకరణను చూడాలి. ఇది ఒక రచయితన్నట్లు "అమ్మకుండా సొమ్ము చేసుకోవడం, కొనకుండా కొల్లగొట్టు కోవడం" ఇదే ఈ పైప్ లైన్ ఘనత.

రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు జనాన్ని ఏమర్చడానికి మాటల మిసైల్స్ విసురుకుంటున్నారు. గతంలో వేలం జరిగితే కేసీఆర్ తొడగొట్టి సవాల్ అన్నారు. ఆనాడు వేలంలో కోయగూడెం, సత్తుపల్లి ఓపెన్ కాస్ట్ మైన్స్ పొందినవారు బీఆర్ఎస్‌కు దగ్గరివారనే ప్రచారం గుప్పుమంది. బీఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్స్ ఇచ్చిన పెద్దలూ వీరేనన్న సంగతి ఆ తర్వాత బయటపడిందనుకోండి. తాము సింగరేణి రక్షణ కోసం నిలబడినట్టు చెప్పుకుంటే చెల్లుబాటుకాదు. మన రాష్ట్రం నుండి లోక్‌సభకు ఎన్నికై బొగ్గుగనుల శాఖా మంత్రిగా వెలిసిన వ్యక్తిగాని, మిగిలిన బీజేపీ పార్లమెంటు సభ్యులుగాని అసలు గనుల వేలాన్ని తప్పుపట్టిన పరిస్థితిలేదు. పార్లమెంటులో నోరువిప్పిన పరిస్థితీ లేదు. కాంగ్రెస్, ఎంఐఎంల సభ్యులూ తొమ్మిది రోజుల లోక్‌సభలోనూ ఉలికింది లేదు.. పలికింది లేదు.

పైన చెప్పిన వివరాలన్నీ చూసిన తర్వాత మోడీసాబ్ ప్రారంభించిన ఈ మహాయజ్ఞం 'నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్' అంటే మన దొడ్లో బోర్ వేసుకుని కార్పొరేట్లు తమింట్లోకి తోడిపోసుకోవడం ఆగకుండా సింగరేణి మనగలుగుతుందా? కోలిండియా, ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ వంటివి వేలంలో అదానీ ఎగరేసుకుపోతుంటే సింగరేణి ఒక్కటే బతికి బట్టకలదా? సింగరేణిని రక్షించాలనుకునే రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ బీజేపీ విధానాలపై పోరాడటానికి ఏమి కృషి చేసింది? అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్ళవచ్చుకదా? సింగరేణి కార్మికుల్ని కదిలించడానికి, రాష్ట్ర ప్రజల్ని ఈ సమస్యపై పోరాటోన్ముఖుల్ని చేయటానికి చేసిన కృషి నాస్తి. మా 'శ్రావణపల్లి' మైన్ మాకే ఇవ్వాలంటే ఫలితం ఏమైనా ఉంటుందా?

దీనికి భిన్నంగా కమ్యూనిస్టులు సూత్రబద్ధమైన వైఖరి తీసుకున్నారు. నాయకులు కదిలారు. కార్యకర్తల్ని కదిలించారు. జిల్లా కలెక్టరేట్ల నుండి సింగరేణి భవన్ వరకు తమ పోరాటాన్ని విస్తరించారు. మోడీ 3.0లో ప్రయివేటీకరణలు పూర్తి స్థాయిలో జరిగేలా వున్నాయి. ఆ విధానాలను వ్యతిరేకించకుండా, ప్రజల్ని కదిలించకుండా విజ్ఞప్తులు చేస్తే ఉపయోగం ఉండదు. తెలంగాణ కొంగుబంగారం సింగరేణి ప్రభుత్వ ఆధ్వర్యంలో మిగలదు.

ఫ్రెంచి వామపక్ష కూటమి-ప్రత్యామ్నాయ ఆర్థిక కార్యక్రమం!



ప్రభాత్ పట్నాయక్

ఈ మధ్య యూరోపియన్ పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో పచ్చి మితవాద శక్తులు చెప్పుకోదగ్గ రీతిలో విజయాలు సాధించాయి. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ ఫ్రెంచి పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహించడానికి నిర్ణయించాడు. ఈ ఎన్నికల్లో మితవాద శక్తిగా ఉన్న లీపెన్‌ను ఢీ కొనడానికి వామపక్ష పార్టీలలో నాలుగు న్యూ పాపులర్ ఫ్రంట్ పేరుతో ఒక కూటమిగా ఏర్పడ్డాయి. కమ్యూనిస్టులు, సోషలిస్టులు, గ్రీన్ పార్టీలతోబాటు ఫ్రాన్స్ అన్‌బౌడ్ (ఇది జీన్ లూక్ మెలెం కన్ నాయకత్వంలో ఉంది) ఈ కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. ఈ కూటమి ఏర్పాటు ఒక చారిత్రక ప్రాధాన్యత కలిగినట్టిది. 1930 దశకంలో ఫ్రాన్స్‌లో పాపులర్ ఫ్రంట్ అనే కూటమి ఏర్పడింది. అప్పటికి యూరప్‌లో పెను ప్రమాదంగా ముందుకొచ్చిన ఫాసిజాన్ని, ముఖ్యంగా జర్మనీలో అధికారాన్ని చేజిక్కించుకున్న నాజీ హిట్లర్ ఫాసిజాన్ని ఎదిరించడానికి ఈ ఫ్రంట్ అప్పట్లో ఏర్పడింది. మళ్ళీ ఇప్పుడు నయా ఫాసిజం యూరప్‌లో పెద్ద ప్రమాదంగా ముందుకొస్తున్న సందర్భంలో ఈ న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) ఏర్పడింది.

ఇప్పుడు ఎన్నికలలో ప్రధానంగా బరిలో ఉన్నవారిలో మాక్రాన్ సూటిగానే నయా ఉదారవాద విధానాలను బల పరుస్తున్నాడు. అతడి పార్టీకి విజయావకాశాలు బాగా తగ్గిపోయాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక తీవ్ర మితవాద శక్తిగా ఉన్న లీ పెన్ పార్టీ ఆర్థిక విధానాలమీద ఎటువంటి స్పష్టతా ఇవ్వకుండా దాటవేస్తోంది. ఇప్పటికి ఆ పార్టీ గుత్త పెట్టుబడిదారీ వర్గానికి కొంత అనుకూలంగా ఉంది. "సరైన తరుణంలో" అది బహిరంగంగానే గుత్త పెట్టుబడితో జట్టు కడుతుంది. మూడవ శక్తిగా ఉన్న ఎన్‌పిఎఫ్ తన ప్రత్యామ్నాయ ఆర్థిక కార్యక్రమాన్ని స్పష్టంగా ప్రకటించింది. ఈ కార్యక్రమం ఉక్రెయిన్ యుద్ధం విష యంలో అమెరికాకు అనుకూల వైఖరిని తీసుకుంది. కూటమి భాగస్వాములైన సోషలిస్టులను కలుపుకు పోవలసి వున్నందున ఈ రాజీ అవసరం అయింది. అదే విధంగా గాజాలో జరుగుతున్న ఊచకోత విషయంలో కూడా మరో భాగస్వామి అయిన మెలెం కన్ భావాలకు అనుగుణంగా వ్యవహరిం చింది. ఇలా కొన్ని అంశాలలో రాజీపడినప్పటికీ, నయా ఉదారవాదం విషయంలో మాత్రం స్పష్టంగా పూర్తి వ్యతిరేక వైఖరిని తీసుకుంది.

నెలవారీ కనీస వేతనాన్ని పెంచడం, ఆహార దినుసులు, పెట్రోలు, గ్యాస్, విద్యుత్తు వంటి నిత్యావసరాల ధరలపై సీలింగ్ విధించడం, ఈ మధ్య మాక్రాన్ పెంచిన రిటైర్మెంట్ వయో పరిమితిని 64 నుండి తగ్గించడం (దీని వలన ప్రభుత్వం చెల్లించవలసిన పెన్షన్ల బడ్జెట్ పెంచాలి), పర్యావరణ రక్షణకు, పౌర సేవలకు కేటాయింపులు భారీగా పెంచడం వంటి ప్రతి పాదనలు ఎన్‌పిఎఫ్ కార్యక్రమంలో ఉన్నాయి. వీటన్నింటికీ అయ్యే అదనపు ఖర్చును ఎన్‌పిఎఫ్ జాగ్రత్తగా అంచనా వేసి లెక్కలు కట్టింది. ఆ అదనపు ఖర్చు కోసం ద్రవ్యలోటును పెంచకుండా అదనపు వనరుల సమీకరణకు ప్రతిపాదనలు చేసింది. తద్వారా యూరోపియన్ యూనియన్ ద్రవ్యలోటుపై విధించిన నియంత్రణకు లోబడి నడుచుకోవచ్చు. అదనపు వనరుల కోసం సంపద పన్నును మళ్ళీ ప్రవేశ పెట్టాలని ప్రతిపాదించింది (దీనిని మాక్రాన్ గతంలో రద్దు చేశాడు). వివిధ రకాల పన్నుల వసూళ్లలో ఉన్న లోపాలను సరిచేయాలని ప్రతిపాదించింది.వారసత్వంగా సంపదను పొందేవారు ఒక పరిమితికి మించి ఆ సంపదను పొందకుండా ఉండేలా సీలింగు విధించాలని, ఆ సీలింగుకు మించి ఉన్న సంపదను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ప్రతిపాదించింది.

ఇదంతా నయా ఉదారవాదానికి పూర్తి వ్యతిరేక దిశలో ఉంది. ఇన్నేళ్లుగా నయా ఉదారవాదం ప్రబోధిస్తున్న విష యాన్ని పరమ సత్యంగా ప్రధాన స్రవంతి మీడియా ప్రచారం చేస్తూ వస్తోంది. ఈ ప్రచారం ఒక్క ఫ్రాన్స్‌కే పరిమితం కాలేదు. భారతదేశంతో సమా యావత్ ప్రపంచమంతటికీ ఈ ప్రచారం సాగింది. ఒక సందర్భంలో (కరోనా అనంతర కాలంలో) అన్ని దేశాలూ కార్పొరేట్ పన్ను కనీసం 25 శాతం విధించాలన్న ప్రతిపాదన చర్చకు వచ్చింది. దీనికి కారణం ఉంది. పెట్టుబడులను ఆకర్షించడం కోసం దేశాలు పోటీ పడి కార్పొరేట్ పన్నును తగ్గిస్తూ వచ్చాయి. పన్ను ఎక్కువగా ఉంటే పెట్టుబడులు తమ దేశానికి రావన్న ఆందోళన దీనికి కారణం. కాని దాని ఫలితంగా కార్పొరేట్ పన్ను రేటు మొత్తంగానే తగ్గిపోయింది. ప్రభుత్వాలకు రాబడి తగ్గిపోయింది. ఈ పరిస్థితి నుండి బయటపడడానికి అన్ని దేశాలూ కూడబలుక్కుని కార్పొరేట్ పన్ను కనీసం



25 శాతం ఉండేలా నిర్ణయించాలని ప్రతిపాదన వచ్చింది. కాని ఈ ప్రతిపాదన మీద చాలా దేశాలు రకరకాలుగా అడ్డుపుల్లలు వేశాయి. చివరకి కనీస కార్పొరేట్ పన్ను 15 శాతం ఉండేందుకు అంగీకారం కుదిరింది. ఐతే చాలా దేశాల్లో అప్పటికే అంతకన్నా ఎక్కువ పన్ను ఉంది. బడా కార్పొరేట్లమీద అదనపు పన్నులు విధించడానికి ప్రభుత్వాలు ఎంత వెనకాడుతున్నాయో ఈ ఉదంతం తెలియజేస్తోంది. ఇది నయా ఉదారవాదం పర్యవసానం. ఇటువంటి పరిస్థితిలో ఎన్‌పిఎఫ్ బడా సంపన్నుల మీద అదనపు పన్నులు విధించాలని ప్రతిపాదించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

> పెట్టుబడులను ఆకర్షించడం కోసం దేశాలు పోటీ పడి కార్పొరేట్ పన్నును తగ్గిస్తూ వచ్చాయి. పన్ను ఎక్కువగా ఉంటే పెట్టుబడులు తమ దేశానికి రావన్న ఆందోళన దీనికి కారణం. కాని దాని ఫలితంగా కార్పొరేట్ పన్ను రేటు మొత్తంగానే తగ్గిపోయింది. ప్రభుత్వాలకు రాబడి తగ్గిపోయింది. ఈ పరిస్థితి నుండి బయటపడడానికి అన్ని దేశాలూ కూడబలుక్కుని కార్పొరేట్ పన్ను కనీసం 25 శాతం ఉండేలా నిర్ణయించాలని ప్రతిపాదన వచ్చింది. కాని ఈ ప్రతిపాదన మీద చాలా దేశాలు రకరకాలుగా అడ్డుపుల్లలు వేశాయి. చివరకి కనీస కార్పొరేట్ పన్ను 15 శాతం ఉండేందుకు అంగీకారం కుదిరింది. ఐతే చాలా దేశాల్లో అప్పటికే అంతకన్నా ఎక్కువ పన్ను ఉంది. బడా కార్పొరేట్లమీద అదనపు పన్నులు విధించడానికి ప్రభుత్వాలు ఎంత వెనకాడుతున్నాయో ఈ ఉదంతం తెలియజేస్తోంది. ఇది నయా ఉదారవాదం పర్యవసానం.

ఇక సంపద పన్ను విధించే విషయంలో ఎక్కువగా చేస్తున్న వాదన ఒకటుంది. ఈ సంపద పన్నును అమలు చేయడం చాలా కష్టం అని, దాని ద్వారా వచ్చే ఆదాయం కన్నా ఆ పన్ను వసూలు కోసం ఏర్పాటు చేసే యంత్రాంగానికి అయ్యే ఖర్చు ఎక్కువ అని ఆ వాదన అంటుంది. భారతదేశంలో గతంలో ఉన్న సంపదపన్ను విధానాన్ని మార్చివేయడాన్ని సమర్థించుకోడానికి ఈ వాదననే ముందుకు తెచ్చారు. సంపద పన్నును అరకొరగా వసూలు చేయడం, దాని ఫలితంగా వచ్చే కొద్దిపాటి ఆదాయాన్ని చూపించి అసలు సంపదపన్ను వసూలు చేయడమే దండగ అని చెప్పి ఏకంగా సంపద పన్నునే రద్దు చేయడం వాళ్ల వ్యూహం.

ఎన్‌పిఎఫ్ ఇప్పుడు ప్రతిపాదించినట్టే గతంలోనూ వేరు వేరు రాజకీయ కూటములు సంపదపన్ను విధించాలన్న ప్రతిపాదనలు ముందుకు తెచ్చాయి. అమెరికాలో గత అధ్యక్ష ఎన్నికల సందర్భంగా బెర్నీ శాండర్స్, ఎలిజబెత్ వారెన్ సంపద పెరిగే కొద్దీ దాని మీద విధించే పన్ను రేటును పెంచాలన్న ప్రతిపాదనలు చేశారు. అమెరికన్ పాలకవర్గం వారిద్దరూ డెమాక్రటిక్ పార్టీ తరఫున అభ్యర్థులుగా నామినేట్ కాకుండా చూసుకుంది. ఆ కారణంగా వారి ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం అయ్యాయి. ఈ మధ్య ఫ్రెంచి ఆర్థికవేత్త థామస్ పికెటీ, అతడి బృందం భారతదేశంలో సంపద పన్నును తిరిగి ప్రవేశ పెట్టాలని సిఫార్సు చేశారు. ఈ బృందం ప్రపంచ అసమానతల గణాంకాలను నిత్యం పర్యవేక్షిస్తూ వాటిని తగ్గించడానికి సూచనలు చేసే సంస్థను నడుపుతోంది (వరల్డ్ ఇనీక్వాలిటీ డేటాబేస్). ఇటువంటి ప్రతిపాదనను ఇక్కడి వామపక్షాలు ఎప్పటినుంచో చేస్తూనే వున్నాయి.

ఎన్‌పిఎఫ్ ప్రతిపాదించిన విధంగా వారసత్వ పన్ను వ్యవస్థను సమూలంగా మార్చడం ఏ ప్రజాస్వామ్య దేశానికైనా చాలా అవసరం.నిజానికి ఈ మార్పు పెట్టుబడిదారీ సిద్ధాంతాన్ని బలపరుస్తుంది. కొన్ని ప్రత్యేక లక్షణాలు, నైపుణ్యాలు కలిగివున్నవాళ్ళకి అందుకు ప్రతిఫలంగా సంపదను సమకూర్చుకునే హక్కు ఉండాలే తప్ప ఆ ప్రత్యేకతలతో, నైపుణ్యాలతో నిమిత్తం లేకుండా కేవలం సంపన్నులకు సంతానంగా జన్మించినందు వల్ల ఆ తల్లిదండ్రుల సంపదపై హక్కు పొందడం న్యాయం కాదు అన్నదే పెట్టుబడిదారీ సిద్ధాంతం. అంతేకాదు, వారసత్వ పన్ను అనేది సంపదపన్ను వసూలు పక్కాగా అమలు జరగడానికి తోడ్పడుతుంది. ఈ రెండు రకాల పన్నులనూ అమలు చేసినప్పుడే పన్నుల చట్రం నుండి ఆ అతి ధనవంతులు తప్పించుకోలేరు. కాని ఈ మధ్య ఒక కాంగ్రెస్ పార్టీ నాయకుడు వారసత్వ పన్ను ప్రతిపాదనను చేస్తే (వామపక్షాలు ఎప్పటినుంచో చేస్తున్నాయి) ఆయన మీద మొత్తం మన మీడియా యావత్తూ విరుచుకు పడిపోయింది. ఇక ప్రధాని నరేంద్ర మోడీ అయితే ఆ ప్రతిపాదనను దారుణంగా వక్రీకరించి హిందూ స్త్రీల తాళిబొట్లను లాగేసుకుని ముస్లింలకు అప్పగించడానికే కాంగ్రెస్ ఈ ప్రతిపాదన చేసిందంటూ ప్రచారానికి దిగాడు! ఎన్‌పిఎఫ్ ప్రతిపాదనలో కేవలం వారసత్వ పన్ను విధించడం మాత్రమే కాదు, వారసత్వంగా సంక్రమించే సంపద మీద కూడా సీలింగు విధాంచాలని ఉంది. ప్రస్తుత పరిస్థితిలో దీనికి చాలా ప్రాధాన్యత ఉంది.

ఇక పౌర సేవల కోసం ప్రభుత్వం చేసే ఖర్చు పెంచాలన్న ప్రతిపాదన కూడా చాలా ప్రాముఖ్యత కలిగి వుంది. విద్య, వైద్యం వంటి రంగాలను ప్రయివేటీకరించడం వలన కలుగుతున్న హాని అంతా ఇంతా కాదు. ఇది మన దేశపు స్వంత అనుభవం. ఐతే ఈ రంగాలలో ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం నయా ఉదారవాదానికి ఎంతమాత్రమూ అంగీకారం కాదు. ఈ రంగంలో ప్రయివేటు కార్పొరేట్లకు అపార లాభాలు వస్తున్నాయి. నిజానికి మన దేశంలో రైతుల ఆత్మహత్యలు ఆగకుండా కొనసాగడానికి ఈ రెండు రంగాలనూ ప్రయివేటీకరిచండమే కారణం. తమ బిడ్డల విద్య కోసం, కుటుంబ సభ్యుల వైద్యం కోసం చేసిన అప్పులను తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నవారు చాలా ఎక్కువ.

ఇక నిత్యావసరాల ధరలపై సీలింగు విధించాలనే ప్రతిపాదన కూడా ముఖ్యమైనది. సామాన్య ప్రజల్ని ఇది ధరాభారం నుండి కాపాడుతుంది. కాని ఇది పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకం. నిజానికి పెట్టుబడిదారీ విధానం ధరలు తగ్గాలంటే డిమాండ్ తగ్గాలని, అందుకోసం ప్రజల కొనుగోలు శక్తి తగ్గాలని వాదిస్తుంది. మరింత నిరుద్యోగాన్ని పెంచితే అటు వేతనాలూ తగ్గి, ఇటు డిమాండూ తగ్గి ధరలు వాటంతట అవే తగ్గిపోతాయన్నది పెట్టుబడిదారీ సిద్ధాంతం. దీనికి భిన్నంగా నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని వామపక్షాలు ఎప్పటినుంచో చేస్తున్న డిమాండ్ ఇప్పుడు ఒక సంపన్న పెట్టుబడిదారీ దేశం ఫ్రాన్స్‌లో ప్రతిధ్వనిస్తోంది.

నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయం ఏమీ లేదంటూ చాలా కాలంగా పనికిమాలిన ప్రచారం సాగుతూనే వుంది. ఇప్పుడు ఎన్‌పిఎఫ్ ప్రతిపాదించిన కార్యక్రమం దానికి పూర్తిగా భిన్నంగా, ఒక కొత్త దనాన్ని తీసుకొచ్చింది. ఈ కార్యక్రమాన్ని తీవ్రంగా విమర్శిస్తూ ఫ్రాన్స్‌లోని బూర్జువా మీడియా, కొందరు రాజకీయవేత్తలు, నయా ఉదారవాదాన్ని సమర్థించేవారు మొదలు, పచ్చి మితవాదులు-అందరూ విరుచుకు పడుతున్నారు. ఈ కార్యక్రమం గనుక అమలులోకి వస్తే ఫ్రాన్స్ ఆర్థిక వ్యవస్థ యావత్తూ సర్వనాశనం అయిపోతుందంటూ ప్రజల్ని భయపెట్టే కథనాలు ప్రచారం చేస్తున్నారు. కాని ఇప్పటివరకూ ఒపినియన్ పోల్స్‌లో ఎన్‌పిఎఫ్ 26 నుండి 28 శాతం వరకూ ప్రజల మద్దత్తు పొందుతున్నట్టు, పచ్చి మితవాది లీ పెన్ పార్టీకి 31 శాతం మద్దతు ఉన్నట్టు, మాక్రాన్ పార్టీకి 20 శాతం కన్నా తక్కువ మద్దతు ఉన్నట్టు తేలింది.

ఫాసిజాన్ని ఓడించడానికి తమ నడుమ ఉన్న అన్ని విభేదాలనూ పక్కనబెట్టి ఫ్రెంచి వామపక్ష పార్టీలు ఐక్యంగా ముందుకు రావడం ఆహ్వానించదగ్గ పరిణామం. మెలెంకన్‌తో దీర్ఘకాలంగా శత్రుత్వ వైఖరి కలిగివున్న సోషల్ డెమాక్రటిక్ పార్టీ నాయకుడు గ్లక్స్‌మన్ ఆ వైఖరిని విడనాడి ఎన్‌పిఎఫ్‌కు మద్దతు ప్రకటించాడు. ఒకవేళ ఎన్‌పిఎఫ్ గనుక గెలిస్తే తనకే ప్రధాని పదవి దక్కాలని పట్టు పట్టబోనని మెలెంకన్ ప్రకటించాడు. ఈ విధంగా తమ తమ పదవీ కాంక్షల్ని, సైద్ధాంతిక విభేదాలను సైతం పక్కనబెట్టి పచ్చి మితవాద శక్తులకు అధికారం దక్కకుండా చేయాలన్న పట్టుదలను వారంతా ప్రదర్శించడం గొప్ప విషయం.

నయా ఉదారవాద చట్రం పరిధిని అతిక్రమించి ఒక కొత్త మార్గాన ఆర్థిక వ్యవస్థను నడిపించాలన్న దృక్పథంతో రూపొందిన కొత్త కనీస ఉమ్మడి కార్యక్రమం అంతకన్నా గొప్పవిషయం. ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్నది పక్కన పెడితే, ఒక సంపన్న పెట్టుబడిదారీ దేశంలోనే నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నా యం ఈ విధంగా తలెత్తడం కొత్త ఆలోచనలకు తెర తీస్తోంది.

(స్వేచ్ఛానుసరణ)

మనిషి గ్రహాల
స్థితిగతులను లెక్కిస్తూ..
కృత్రిమ గ్రహాలను సృష్టిస్తూ..
అంతరిక్షపు అంచుల్ని,
కదలి లోతుల్ని చేదిస్తూ..
భవిష్యత్తు ఫలితాల కోసం
మూఢనమ్మకాలైన
అదృష్టం, అంధ విశ్వాసాల
ఛాందస ఆలోచనల
భ్రమలో పడి
"భోలే బాబా పాద ధూళికై"
పాకులాడి
వంద మందికి పైన ప్రాణాలు


ఈ శోకానికి కారకులెవరు?



మట్టిలో కలిసే..
ఇంకా క్షతగాత్రులెంతమందో..!
ఈ శోకానికి ఎవరు
బాధ్యులు? శిక్ష ఎవరికి!
కంప్యూటర్ కాలంలో
పాత రాతియుగపు
ప్రవర్తనలా..
ఆవు చేలో మేస్తే దూడ
గట్టున మేస్తుందా?
పాలకులు, పాలితులు
వైజ్ఞానిక దృష్టితో
అభ్యుదయ భావాలతో
చైతన్యవంతులు
కాకపోతే? ఇంతే..
యదా రాజా.. తదా ప్రజా
అనేది పాత పాట
యదా పాలక తదా పాలిత
అనేది సరికొత్త రాగం..
సామాజిక రుగ్మతల
చీడపీడ నిర్మూలించేందుకు
మరో పోరాటం చేయాల్సిందే..

- మేకిరి దామోదర్,
9573666650

సింగరేణిపై కేంద్రం ప్రయి'వేటు'- సీఐటీయూ ఉద్యమం



భూపాల్
9490098034

కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ వేగం తగ్గుతుందని ఆశించిన వారి ఆశలు పటాపంచలయ్యాయి. మంత్రివర్గంలో భాగంగా కేంద్ర గనుల శాఖను మన రాష్ట్ర బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డికి కేటాయించింది. ఆయన పన్నెండు రోజులు తిరగకుండానే జూన్ 21న హైదరాబాద్ కేంద్రంగా దేశవ్యాప్తంగా 61 బొగ్గు బ్లాకులను వేలం ద్వారా అమ్మకానికి పెట్టాడు. ఇందులో మన రాష్ట్రంలోని గోదావరి పరివాహక ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కూడా వేలంలో పెట్టారు. దీంతో ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు ప్రారంభమయ్యాయి. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు వివిధ ప్రజా సంఘాలు ఆందోళనబాట పట్టాయి. సింగరేణి భవన్‌ను ముట్టడించాయి. సింగరేణి ప్రాంతంలో జూన్ 21న వేలంలో పెట్టిన రోజే సీఐటీయూ యూనియన్ అన్ని బావుల దగ్గర నిరసనలు చేసి ఉద్యమాన్ని ప్రారంభించింది. చివరకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వాటి అనుబంధ ట్రేడ్ యూనియన్స్ కూడా గళం విప్పవలసిన పరిస్థితి ఏర్పడింది. సింగరేణి పరిరక్షణ, బొగ్గు బావుల ప్రయివేటీకరణకు వ్యతిరేక ఉద్యమం మరోసారి ఊపందుకోబోతున్నది.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే కొత్త బావులు సాధిస్తామని, ఉపాధి కల్పిస్తామని హామీనిచ్చింది. గోదావరి పరివాహక ప్రాంతంలోని సింగరేణి ప్రాంతంలోని ఎంపీ స్థానాలన్నింటినీ కాంగ్రెస్ పార్టీ గెలుచుకున్నది. ఎన్నికల తర్వాత బొగ్గుబ్లాక్‌లను కేంద్రం వేలం వేస్తుంటే కాంగ్రెస్ పార్టీ పోరాడకుండా విజ్ఞప్తులతో సరిపెడుతున్నది. కేంద్ర గనుల శాఖ మంత్రికి, ప్రధాన మంత్రికి రాష్ట్ర ముఖ్యమంత్రి విజ్ఞప్తులతో సరిపెడుతున్నాడు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం ఎంతకైనా తెగిస్తుంది తప్ప విజ్ఞప్తులకు ఎప్పుడు దిగి రాలేదన్న విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, సింగరేణిని కాపాడుకోవడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజల ఆకాంక్ష మేరకు పోరాడకపోతే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. గని కార్మికులు కూడా గుర్తింపు ఎన్నికల సందర్భంగా ఇటీవల ఏటీయూసీ అనుబంధ సంఘాన్ని గుర్తింపు సంఘంగా గెలిపించారు. ఆరు ఏరియాలలో ఐఎన్టీయూసీని గెలిపించారు. పోరాడే సంఘం సీఐటీయూ బలాన్ని పెంచారు. రెండు ప్రధాన సంఘాలు అన్ని సంఘాలను కలుపుకొని సింగరేణి బొగ్గు బ్లాకుల సాధన కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేయాల్సిన కర్తవ్యం ఉంది.

సింగరేణిని ఎందుకు కాపాడుకోవాలి!

సింగరేణి గనులు తెలంగాణకు కొంగుబంగారం. కార్మికుల కష్టంతో సిరులు కురిపిస్తున్నాయి. సింగరేణి సంస్థ రాష్ట్ర అభివృద్ధి ,నిరుద్యోగ సమస్య పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్నది. ప్రస్తుతం తెలంగాణలో ఆరు జిల్లాలలో బ్రిటిష్ కాలం నుండి నేటి వరకు దేశంలో ప్రభుత్వ రంగ సంస్థగా సాగుతున్న ఏకైక సంస్థ సింగరేణి మాత్రమే. దేశంలో బొగ్గు ఉత్పత్తిలో 9.2శాతం వాటా కలిగి ఉంది. ఇప్పటివరకు 1753.78 మిలియన్ బొగ్గు వెలికి తీయబడింది. ఇంకా వందేండ్లకు సరిపడా బొగ్గు నిలువలున్నాయి. లక్షల మందికి ఉపాధి కల్పించడానికి అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల క్రమంగా బొగ్గు బ్లాక్‌లు మూతపడుతున్నాయి.కొత్త బావులు తీయకపోగా ఉన్న వాటిని కూడా మూసివేసి పైన ఓపెన్‌కాస్టులు తీస్తున్నారు. ప్రస్తుతం 18 ఓసిపి, 22 భూగర్భ గనులు మొత్తం 40 ఉన్నాయి. వీటిలో 39,856 పర్మినెంట్ వర్కర్స్, 26వేల కాంట్రాక్ట్ వర్కర్స్ పనిచేస్తున్నారు. పరోక్షంగా లక్షలాదిమంది ఉపాధి పొందుతున్నారు. సిఎస్ఆర్ నిధులతో ప్రజల మౌలిక సదుపాయాల కోసం జిల్లాల్లో అనేక గ్రామాల్లో వందల కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఇరవై ఏండ్లుగా లాభాలతో నడుస్తున్న సంస్థ సింగరేణి.ప్రతి సంవత్సరము కేంద్ర, రాష్ట్రాలకు డివిడెంట్లు,పన్నుల రూపంలో సుమారు రూ.8వేల కోట్లు చెల్లిస్తున్నది.ఒక్క 2022-23 సంవత్సరంలోనే కేంద్రానికి



> రాష్ట్ర ప్రభుత్వం కూడా సింగరేణి నిధులను వాడుకుంటున్నది. ప్రభుత్వ జెన్కో ట్రాన్స్‌కో ఇతర సంస్థలకు బొగ్గును సరఫరా చేయించింది. బకాయిలు సుమారు రూ.30 వేల కోట్లు ఉన్నాయి. ప్రభుత్వం సింగరేణికి బకాయిలు చెల్లించడం లేదు.అయినా ప్రతి సంవత్సరం రెండు నుంచి మూడు వేల కోట్ల లాభాలతో ఉంది. 2013 నుండి 24 మధ్య పదేండ్ల కాలంలో 20వేల మంది ఉద్యోగుల సంఖ్య తగ్గినా 20 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని పెంచింది. ఓపెన్ కాస్టు, కాంట్రాక్ట్ కార్మికుల శ్రమతోనే ఉత్పత్తి పెరిగింది వాస్తవం. సంవత్సరానికి సగటున 65 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు.సింగరేణిని ప్రభుత్వాలు ఎంత పిండుకున్నా సింగరేణి లాభాల బాటలో ఉండడానికి ప్రధాన కారణం కార్మికుల శ్రమనే.

3216 కోట్లు, రాష్ట్రానికి 5418 కోట్లు ఒరిస్సాకు 3.8 కోట్లు చెల్లించింది. కేంద్రంలో బీజేపీ పరిపాలించిన పదేండ్లకాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సుమారు 49 వేల కోట్లు చెల్లించింది.

రాష్ట్ర ప్రభుత్వం కూడా సింగరేణి నిధులను వాడుకుంటున్నది. ప్రభుత్వ జెన్కో, ట్రాన్స్‌కో ఇతర సంస్థలకు బొగ్గును సరఫరా చేయించింది. బకాయిలు సుమారు రూ.30 వేల కోట్లు ఉన్నాయి. ప్రభుత్వం సింగరేణికి బకాయిలు చెల్లించడం లేదు.అయినా ప్రతి సంవత్సరం రెండు నుంచి మూడు వేల కోట్ల లాభాలతో ఉంది. 2013 నుండి 24 మధ్య పదేండ్ల కాలంలో 20వేల మంది ఉద్యోగుల సంఖ్య తగ్గినా 20 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని పెంచింది. ఓపెన్ కాస్టు, కాంట్రాక్ట్ కార్మికుల శ్రమతోనే ఉత్పత్తి పెరిగింది వాస్తవం. సంవత్సరానికి సగటున 65 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు.సింగరేణిని ప్రభుత్వాలు ఎంత పిండుకున్నా సింగరేణి లాభాల బాటలో ఉండడానికి ప్రధాన కారణం కార్మికుల శ్రమనే. ప్రభుత్వ రంగ సంస్థగా ఉండడమే.

సింగరేణిపై కేంద్రం దాడి!

దేశంలో 1973 నాటికి గనులను జాతీయం చేసే సమయానికి సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థగా ఉంది. 1957లో మైన్స్ మినరల్ (డెవలప్మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్టు వచ్చింది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక 2015లో ఈ చట్టానికి సవరణ చేసి కమర్షియల్ మైనింగ్ అవకాశం కల్పించారు. వేలం ద్వారా బీజేపీ ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు 200 బొగ్గుబ్లాక్‌లను ప్రయివేటు వారికీ కేటాయించింది. 2025 నాటికి నేషనల్ మానిటైజేషన్ పైప్లైన్ పేరిట 160 బొగ్గు బ్లాక్‌లను ప్రయివేటుకు అప్పగించి మారు 29 వేల కోట్లు సంపాదించాలని నిర్ణయించింది. 2021లో సింగరేణి ప్రాంతంలో నాలుగు బ్లాకులను వేలంలో పెట్టింది. సింగరేణి వ్యాప్తంగా కార్మికుల సమ్మె చేసినారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా పోరాడకుండా సింగరేణి సంస్థను వేలంలో పాలు పంచుకోకుండా చేసి తన అనుకూల సంస్థలైన అరబిందో ఫార్మాకు, ప్రతిమ గ్రూపులకు కోయగూడెం ఓసి త్రిని, సత్తుపల్లి ఓసి త్రి వచ్చే విధంగా చేసింది. కోయగూడెం ఓసి త్రీ గిరిజన ప్రాంతం 1 ఆఫ్ 70 యాక్ట్ పరిధిలో ఉన్నా అతిక్రమించి ఇప్పించుకున్నది. ఈ రెండు సంస్థలు నేటికి గంపెడు మట్టి తీయలేదు. మైనింగ్ అనుభవం లేదు.మిషన్లు లేని సంస్థలకు కట్టబెట్టిన ఫలితమిది.

సింగరేణి సొంత డబ్బులతో ఖర్చు పెట్టి డ్రిల్లింగ్ చేసి 45 బొగ్గు బ్లాకులను గుర్తించింది. 15 బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలని కోరుతూ ఉన్నది. సింగరేణి సొంత నిధులను ఖర్చుపెట్టి కొత్తగూడెం నుండి సత్తుపల్లి వరకు రైల్వే ట్రాక్‌ను, బొగ్గు బ్లాక్ ల అన్వేషణ ఖర్చు, మౌలిక సదుపాయాలు కల్పించింది. కోయగూడెం ఓసి-3, సత్తుపల్లి ఓసి-3 బ్లాక్‌లను తిరిగి సింగరేణికి కేటా యించాలి. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తాటిచర్ల1ను ఏఎంఆర్ సంస్థకు ఇప్పించుకున్నది.కేంద్రం సవరించిన ఎంఎండిఆర్ యాక్ట్ 1957లో సెక్షన్ 17 (1) ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి ప్రభుత్వరంగ సంస్థలకు గనులను కేటాయించడానికి అవకాశం ఉంది. బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లకు కేటాయించు కుంటున్నది. తెలంగాణకు మొండిచేయి చూపుతున్నది.

శ్రావణపల్లి బ్లాక్ సాధనకు పోరు ఉధృతం చేయాలి!

పదవ విడత వేలంలో పెట్టిన శ్రావణపల్లి బొగ్గుబ్లాక్ 18.63 చదరపు కిలోమీటర్ పరిధిలో బొగ్గు నిల్వలు విస్తరించి ఉన్నాయని గుర్తించారు. ఇందులో 10.18 చదల కిలోమీటర్ల పరిధిలో ఆక్షన్‌లో పెట్టారు. 119.9 మిలియన్ టన్నుల బొగ్గు లభిస్తుంది. సింగరేణి విస్తరించడానికి తెలంగాణ నిరుద్యోగులకు ఉపాధి లభించడానికి అవకాశం ఉంది. ఎట్టి పరిస్థితిలోనూ ఈ బొగ్గు బ్లాక్‌ను ప్రయివేటువాళ్లకు దక్కకుండా అందరూ కలిసి కట్టుగా పోరాడాలి. కాంగ్రెస్ ప్రభుత్వం విజ్ఞప్తులతో సరిపెట్టకుండా కేంద్రంతో పోరాటానికి దిగాలి. కార్మికుల, ఉద్యోగుల, ప్రజల మద్దతు ఉంటుంది. లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజాక్షేత్రంలో దోషిగా నిలబడవలసి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలన్నీ కలిసి ఈ నెల 10న అన్ని బ్రాంచీలో పెద్దఎత్తున ధర్నాలు, జూలై 18న సింగరేణి భవన్ ముట్టడించడానికి సిద్ధపడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం కోసం అవసరమైతే సింగరేణి వ్యాప్తంగా సమ్మె చేయడానికి సంఘాలకు అతీతంగా కార్మికవర్గం సిద్ధపడాలి.

కౌలు రైతులకు రుణార్హత కార్డులివ్వాలి

- ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్



నవతెలంగాణ- మదనాపురం

రాష్ట్రంలో ఉన్న కౌలు రైతులందరికీ రుణార్హత కార్డులు, రైతు భరోసా అందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ ప్రభుత్వాన్ని కోరారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం అజ్జకొల్లు గ్రామంలో సోమవారం కౌలు రైతుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బ్యాంకుల సర్వే ప్రకారం 24 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని, వారు 35 లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో మొదటి రెండేండ్లు కౌలు రైతులకు "రుణ అర్హత కార్డు" ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ, రుణాలు మాత్రం రూ.23 కోట్లకు మించలేదన్నారు. ఆ తరువాత "జాయింట్ లయబిలిటీ" సంఘాలను ఐదుగురు రైతులతో ఏర్పాటు చేశారన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు, పంటల బీమా, ప్రభుత్వ పథకాలు (సబ్సిడీ), ప్రకృతి వైపరీత్యాల పరిహారం అందించాలని కోరారు. ఈ కార్డు వల్ల భూ యజమానుల హక్కులకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. లోన్ ఎలిజిబిలిటీ కార్డ్‌పై "ఈ కార్డు ద్వారా భూ యజమానికి వ్యతిరేకంగా కౌలుదారు ఎలాంటి సాక్ష్యంగా వినియోగించరాదు" అనే నిబంధన ఉందన్నారు. అందువల్ల రుణ కార్డుల వల్ల రైతులకు ఎలాంటి నష్టమూ, ప్రమాదమూ లేదన్నారు. ఈ పథకాలను కౌలు రైతులకు వర్తింపజేయాలని కోరారు. దశాబ్ద కాలంగా కోరుతున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పైగా కౌలుదార్లను, వాస్తవ సాగుదార్లను తొలగిస్తూ ధరణిలో చట్ట సవరణ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో కౌలు రైతులకు సహాయం చేస్తామని పేర్కొందని గుర్తు చేశారు. పంట రుణాలు, పంటల బీమా కూడా వర్తింపజేస్తామని, ప్రస్తుతం అమలులో ఉన్న "అధీకృత లైసెన్స్ రైతుల చట్టం-2011"ను అమలు చేస్తానని ప్రకటించిందని అన్నారు. కౌలుదారుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. నిజాం పాలనలో మొట్ట మొదటిసారి 1907లో కౌలుదారులకు హక్కులు కల్పిస్తూ చట్టం చేశారన్నారు. ఆ తర్వాత భారతదేశంలో ఆంగ్లేయ ప్రభుత్వం అనేక రాష్ట్రాల్లో కౌలు చట్టాలు చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్ రాములు, విష్ణు, వెంకటేష్, చెన్నయ్య, మణి వర్ధన్, మొగిలి, ఆది పాల్గొన్నారు.

భూ వివాదాల్లో రాజకీయ జోక్యం వల్లే రైతుల ఆత్మహత్యలు

- రెవెన్యూ, పోలీసు వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు తలవంచొద్దు : రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు



నవతెలంగాణ-ఖమ్మం

జిల్లాలోని భూ వివాదాల్లో రాజకీయ జోక్యంతో రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని, రెవెన్యూ, పోలీసు వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు తలవంచొద్దని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ జోక్యంతో భూ సమస్యలు జటిలమవుతూ పరిష్కారం కాని పరిస్థితి నెలకొందని అన్నారు. రాజకీయ అండ, ధన, కండ బలం కలిగిన వారిని, భూ కబ్జాదారులను ఎదురించే శక్తి లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి జిల్లాలో పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ దృష్టికి వచ్చిన భూ సమస్యలపై కేవలం ఒకవైపే కాకుండా రెండు వైపులా ఉన్న వాస్తవ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువలు సత్వరమే పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, అందుకు అవసరమైన నిధులు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. సాగుదారులకు తక్షణమే రైతు భరోసా విడుదల చేయాలని, ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు భరోసా అందించాలని, గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ చేపట్టాలన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె మీరా, సహాయ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, బిక్కసాని గంగాధర్ పాల్గొన్నారు.

'ప్రజావాణి'లో.. మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని చేతి రుమాలును మెడకు బిగించుకునే యత్నం
- అడ్డుకున్న పోలీసులు
- ఆందోళనకు దిగిన మాజీ సర్పంచులు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

" అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని తమపై ఒత్తిడి చేసిన అధికారులు ఇప్పుడు ఆ పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడతారా? మండల స్థాయి మొదలు జిల్లా అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగినా బిల్లులు మంజూరు చేయకపోగా.. ఇప్పుడు మా పదవీ ముగియడంతో కనీసం పట్టించుకోవడం లేదు. లక్షలు అప్పులు చేసి వడ్డీలు కట్టలేక అవస్థలు పడుతున్నాం. మా గోస మీకు పట్టదా?' అంటూ కరీంనగర్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఓ మాజీ సర్పంచ్ భర్త మెడకు చేతిరుమాలు బిగించుకుని ఆత్మహత్యాయత్నం చేయబోయాడు. అక్కడే ఉన్న కలెక్టర్ సహా పోలీసులు అడ్డుకుని ఆయనను బయటకు నెట్టేశారు. దీంతో అక్కడే ఉన్న మరికొంత మంది మాజీ సర్పంచులు ఆందోళనకు దిగారు. రామడుగు మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ పంజాల ప్రమీల భర్త జగన్‌గౌడ్ తమకు రావాల్సిన పెండింగ్ బిల్లుల విషయమై కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు ప్రజావాణికి వచ్చారు. కలెక్టర్ పమేలా సత్పతితో తాము గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల్లో ఒక్క రూపాయి కూడా రాలేదని చెప్పాడు. పనులు చేసే వరకూ అధికారులు ఒత్తిడి చేశారని, బయట అప్పులు తెచ్చి పూర్తి చేశామని, అవి వడ్డీల మీద వడ్డీలు అవుతున్నాయని చెప్పుకొచ్చాడు. 'మన ఊరు - మన బడి' కింద పాఠశాల మరమ్మతులు, ఆధునీకరణ పనులకు మేనేజ్‌మెంట్ కమిటీ ముందుకు రాకపోవడంతో తానే పూర్తి చేశానని తెలిపాడు. ఇవేకాక గ్రామంలో మరికొన్ని పనులు చేశానన్నాడు. రూ.లక్షల్లో రావాల్సిన బిల్లులకు ఎమ్‌బీ రికార్డులూ పూర్తయినా ఇప్పటికీ నిధులు విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అప్పటికే ఆవేశంతో ఉన్న జగన్‌గౌడ్ 'నేను చెప్పులు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా.. ఇప్పుడు మా పదవీకాలం ముగిసిందని ఎవరూ పట్టించుకోవడం లేదు. మీరు బిల్లులు ఇవ్వకుంటే చావే శరణ్యం' అంటూ చేతిరుమాలతో మెడకు బిగించుకున్నాడు. గమనించిన పోలీసులు వెంటనే ఆ రుమాలు లాక్కుని అతన్ని బయటకు లాక్కెళ్లారు. అక్కడే ఉన్న రామగుడు, గంగాధర మండలాల మాజీ సర్పంచులు బిల్లుల విషయమై ఆందోళనకు దిగారు. వారిని సముదాయించిన పోలీసులు ప్రజావాణి నుంచి బయటకు పంపించారు.

వణికిస్తున్న జ్వరాలు



(మొదటిపేజీ తరువాయి)

ఉంటోంది. చికిత్స కోసం ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య కూడా పెరుగుతున్నది. కలుషితాహారం, అపరిశుభ్రమైన వాతావరణంతో పాటు దోమలూ వైరల్ ఫీవర్‌కు ప్రధాన కారణమవుతున్నాయి. కలుషిత ఆహారం వల్ల అనారోగ్యంతో చాలా హాస్టల్స్ నుంచి విద్యార్థిని విద్యార్థులు ఆస్పత్రుల్లో జాయిన్ అవుతున్నారు. ఫుడ్ పాయిజన్ జరిగి డయేరియా, వాంతులు, విరేచనాల కేసులు నమోదవుతున్నాయి. దోమ కాటు కూడా జనాన్ని భయపెట్టిస్తున్నదని, కొంతమంది రోగులకు ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయని డాక్టర్లు తెలిపారు. డెంగ్యూ కేసులు నమోదు అయినా, ప్రమాదకర పరిస్థితికి రాలేదంటున్నారు వైద్యులు. అయితే టెస్టులు చేయించుకునేందుకు ప్రభుత్వాస్పత్రుల్లో ల్యాబ్‌ల కొరత తీవ్రంగా ఉంది. కొన్నిచోట్ల ఉన్నా పని చేయడం లేదు అని తెలుస్తోంది. చాలామంది రోగులు భయంతో ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లడంతో వారి ప్రాణభీతిని ఆసరా చేసుకుని టెస్టుల పేరిట వేల రూపాయలు గుంజుతున్నాయి. ఈ సమయంలో భయపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు కోరుతున్నారు. నగరాలు, గ్రామాలతో పాటు గిరిజన ప్రాంతాల్లో వ్యాధుల బారిన పడే వారి సంఖ్య అధికంగానే ఉంది. సీజనల్ వ్యాధులపై సమీక్షలు జరుగుతున్నా కిందిస్థాయిలో అవగాహన కల్పించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే మందులు అందుబాటులో లేకపోవడమూ ప్రధాన లోపంగా ఉంది.

900 పైగా డెంగ్యూ కేసులు నమోదు

వైద్యశాఖ అధికారిక లెక్కల ప్రకారం నల్లగొండ జిల్లాలో ఇప్పటివరకు 46 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. గత సంవత్సరం జిల్లాలో 241 డెంగ్యూ కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం ఇప్పటివరకు 46 కేసులు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పలువురు డెంగ్యూ బాధితులు ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించి వైద్యం చేయించుకుంటున్నారు. వీరి వివరాలు వైద్యశాఖ అధికారులు చేపట్టిన సర్వేలో నమోదు కానట్టు తెలుస్తోంది. ఒళ్ళు నొప్పులు, విరోచనాలతో పలువురు బాధితులు ఆస్పత్రుల్లో చేరుతున్నా వారి వివరాలు ఆరోగ్య శాఖ సేకరించడం లేదు. హైదరాబాద్‌లో మే నెలలో 39 డెంగ్యూ కేసులు, జూన్ నెలలో 56 కేసులు నమోదు కాగా, ఈ నెలలో నాలుగో తేదీ వరకు 20 కేసులు నమోదయ్యాయి. జ్వర పీడితులు ప్రయివేటు ఆస్పత్రికి వస్తే మొదట ప్లేట్లెట్స్ పరీక్ష చేయిస్తున్న వైద్యులు రక్తం ఎక్కించాలని లేకపోతే ప్రాణాలకు ముప్పు ఉంటుందని రోగి బంధువులకు చెప్పి వేల రూపాయలను దండుకుంటున్నారు. రంగారెడ్డి జిల్లాలో 56 కేసులు నమోదైనా.. ప్రమాదకరం కాదని, తగ్గిపోయాయని అధికారులు తెలిపారు. వికారాబాద్‌లో ఎనిమిది కేసులు నమోదయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో డెంగ్యూ మూడు, మలేరియా కేసు ఒకటి నమోదయ్యింది.

పెరుగుతున్న ఓపి...

సీజనల్ వ్యాధులు, విషజ్వరాలతో ఆయా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. నల్లగొండ ప్రభుత్వ జన రల్ ఆస్పత్రిలో సాధారణ రోజులలో 800 నుంచి 900 వరకు నమోదయ్యే ఓపి ప్రస్తుతం 1500 నుంచి 1700 వరకు పెరిగింది. నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డిపాటు మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి కూడా రోగులు వస్తున్నారు, రోజుకు 1800 నుంచి 2000 మంది వస్తున్నట్టు జిల్లా అధికారులు తెలిపారు.. వారికి పూర్తిస్థాయిలో చికిత్స చేసిన తరువాతే పంపిస్తున్నామని వైద్యాధికారులు చెబుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రిలో సాధారణంగా ఔట్ పేషెంట్లు ప్రతి రోజూ 700కు మించి వచ్చేవారు కాదు. గత వారం రోజులుగా 1200 మందికి పైగా పేషెంట్లు ఆస్పత్రికి వస్తున్నారు. వచ్చిన వారిలో 20 శాతం మంది ఇన్‌పెషెంట్లుగా చేరుతున్నారు. కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో ప్రతిరోజూ 400 నుంచి 450 మంది వరకు రోగులు ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారు. వర్షాలు కురవడం, వాతావరణ మార్పులతో జ్వరాలు, జలుబు, ఇతర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా సోమ, మంగళవారం సర్వజన ఆస్పత్రికి రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ప్రస్తుతం 500 నుంచి 600 మంది వరకు ఔట్ పేషెంట్లు వచ్చి వివిధ వ్యాధులకు పరీక్షలు చేయించుకుంటున్నారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో సాధారణ రోజుల్లో ఓపీ 150 నుంచి 200 ఉంటుంది. ప్రస్తుతం 200 నుంచి 250 మంది రోగులు వివిధ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వస్తున్నారు. నల్లగొండలో జూన్ ఒకటవ తేదీ నుంచి ఇప్పటివరకు వైరల్ ఫీవర్ బాధితులు 300 మంది ఉన్నట్లు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యులు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభు త్వ ఆస్పత్రికి గత నెలలో సుమారు వంద మందికి పైగా జ్వర పీడితులు వచ్చి చికిత్స చేయిం చుకు న్నారు. ఈ నెలలో ఇప్పటివరకు 23 డయో రియా కేసులు, 96 మంది జ్వరంతో చికిత్స చేసుకు న్నట్టు ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. ప్రయివేట్ ఆస్పత్రి లో వందలాది మంది చికిత్స పొందుతు న్నారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతోంది. 15 రోజుల కింద టితో పోల్చితే... రోగాల బారిన పడిన వారి సంఖ్య రెట్టింపయ్యింది.

ఎక్కడ చూసినా అపరిశుభ్రత..

ఇంతకుముందు గ్రామీణ ప్రాంతాల నుంచి రోగాల బారిన పడిన వారు అధికంగా వస్తుండే వారు. ఇప్పుడు నగరాల్లో ఉంటున్న వారి సంఖ్య కూడా రెట్టింపు అయ్యింది. శుద్ధమైన నీరు, ఆహారం లేకపోవడం వల్ల వ్యాధులకు గురౌతున్నారు. నగరాలతో పాటు గ్రామాలూ అపరిశుభ్రంగా ఉంటున్నాయి. ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం, ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా డయేరియా... మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలుతున్నాయి. వర్షాకాలంలో రోగాల బారిన పడిన వారి సంఖ్య పెరగడం సాధారణమేనని, భయపడకుండా జాగ్రత్తలు పాటించాలని డాక్టర్లు సూచించారు. సొంతవైద్యం కంటే వైద్యులను సంప్రదించడమే మేలని తెలిపారు. జ్వర పీడితులు అనవసరంగా ఆందోళన చెందొద్దు. ప్రతి పీహెచ్‌సీలో అన్ని సౌకర్యాలతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని నల్లగొండ జిల్లా వైద్యాధికారి కల్యాణచక్రవర్తి తెలిపారు. వైరస్ లేని దోమలు ప్రమాదకరమేమీ కావు. శుభ్రమైన తాగునీరు.. వేడివేడి ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చని నాగర్‌కర్నూల్ డీఎం అండ్ హెచ్‌ఓ సుధాకర్‌లాల్ సూచించారు.

బదిలీ అయిన టీచర్లను విడుదల చేస్తాం

- ఆ దిశగా చర్యలు తీసుకుంటాం : యూఎస్‌పీసీ, జాక్టో నేతలతో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి
- బదిలీలపై అప్పీళ్లను సత్వరమే పరిష్కరిస్తాం : విద్యాశాఖ సంచాలకులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇటీవల బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను విడుదల చేసి పాఠశాలల్లో అవసరాలకు అనుగుణంగా సర్దుబాటు చేస్తామనీ, వ్యక్తిగత సమస్యలపై న్యాయమైన అప్పీళ్లను సానుకూలంగా పరిష్కరిస్తామని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ), ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) నాయకులు వెంకటేశంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అవాంతరాలను అధిగమించి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను సజావుగా పూర్తి చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యాశాఖ అధికారులకు యూఎస్‌పీసీ, జాక్టో పక్షాన వారు అభినందనలు తెలిపారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో సమయాభావం, సాంకేతిక సమస్యల వల్ల కొందరు ఉపాధ్యాయులు నష్టపోయారనీ, ముఖ్యంగా ఎస్జీటీ వెబ్ ఆప్షన్ల సందర్భంలో అప్రకటిత రేషనలైజేషన్ అమలు చేస్తూ ఖాళీలను బ్లాక్ చేయటం, సమయం తక్కువగా ఇవ్వటం, బదిలీ అయిన అందరినీ రిలీవ్ చేయకపోవటం వల్ల పలువురికి నష్టం జరిగిందని పేర్కొన్నారు. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల అసమతుల్యత ఏర్పడిందనీ, వాటిని పరిష్కరించాలనీ, సాంకేతిక సమస్యల కారణంగా లేదా సమయాభావం, అవగాహనా లోపంతో పొరపాటుగా ఆప్షన్లు ఇవ్వటం వల్ల నష్టపోయిన ఉపాధ్యాయుల అప్పీళ్లను పరిశీలించి సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. ఈ అంశాలకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సానుకూలంగా స్పందించి అంగీకరించారని తెలిపారు. పదోన్నతుల్లో నాన్ జాయినింగ్, లెఫ్ట్ ఓవర్ ఖాళీలకు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలనీ, మల్టీజోన్-1,2 లలో ఖాళీగా ఉన్న ఉన్నత పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని సూచించారు. దానిపై నిర్ణయం తీసుకున్నామనీ, త్వరలోనే షెడ్యూల్ విడుదల చేస్తామని బుర్రా వెంకటేశం వివరించారని పేర్కొన్నారు. స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగ పరిచిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు. 317 జీవో అమలు కారణంగా నష్టపోయి, పరస్పర బదిలీ ద్వారా జిల్లాలు మారిన ఉపాధ్యాయులకు ప్రస్తుత పోస్టులో రెండేండ్ల సర్వీసు పూర్తయినందున మిగిలిపోయిన ఖాళీల్లో డీఎస్సీ నియామకాలకంటే ముందుగా బదిలీ అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేయగా, పరిశీలిస్తామంటూ హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి హైకోర్టులో ఉన్న కేసును సత్వరమే పరిష్కరించి ఆ ప్రక్రియ అమలయ్యేలా చూడాలని బుర్రా వెంకటేశాన్ని యూఎస్‌పీసీ, జాక్టో నాయకులు విజ్ఞప్తి చేశారు.

కేజీబీవీ, యూఆర్ఎస్‌లో గల ఖాళీల్లో సిబ్బందికి బదిలీలు నిర్వహించిన అనంతరమే నూతన నియామకాలు చేపట్టాలని కోరారు. అందుకు ఆయన అంగీకరించారని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకులకు తగిన ఆదేశాలు ఇస్తామన్నారని పేర్కొన్నారు. అంతకు ముందుగా ఆయా సంఘాల నాయకులు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పలు సమస్యలపై చర్చించారు. వాటిని పరిష్కరిస్తామంటూ ఆయన హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌పీసీ, జాక్టో నాయకులు కె జంగయ్య, జి సదానందంగౌడ్, వై అశోక్ కుమార్, టి లింగారెడ్డి, ఎం రాధాకృష్ణ, యూ పోచయ్య, సిహెచ్ శ్రీనివాస్, బి కొండయ్య, వీరు నాయక్, కొమ్ము రమేష్, టి గీతాంజలి, డి రాజనర్సు బాబు, విఠల్, చావ రవి, పి నాగిరెడ్డి, ఎం సోమయ్య, చంద్రశేఖర్, చక్రవర్తుల శ్రీనివాస్, గౌరీశంకర్, శర్మన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అసైన్డ్ భూమి కబ్జా చేసిన వారిని శిక్షించాలి

- గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మానాయక్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజనులపై దాడి చేసి అసైన్డ్ భూమి కబ్జాచేసిన నాగభూషణ్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మానాయక్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండలం , గట్టు ఇప్పలపల్లి. కోరింతకుంట తండాలో ఇస్లావత్ లాక్య, రాజుతోపాటు మరో ఆరుగురి భూములను స్థానిక పెత్తందారు నాగభూషణ్‌రెడ్డి కబ్జా చేశారని తెలిపారు. 70 ఏండ్ల నుంచి సాగు చేసుకుంటున్న ఆ భూములను ఆక్రమించటం దుర్మార్గమని పేర్కొన్నారు. గిరిజనులను తమ పొలంలోకి పోనీయకుండా ఆయన అడ్డుకుంటున్నాడని పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కీ వెంకటయ్యకు వినతి పత్రం సమర్పించినట్టు తెలిపారు.అమాయక గిరిజనులను మోసం చేసిన పెత్తందారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో రైతు సంఘం రంగారెడ్డి జిల్లా నాయకులు కానుగుల వెంకటయ్య, రాజు, లాక్య. తదితరులు ఉన్నారు.

ఫ్రాన్స్‌లో లెఫ్ట్ ఫ్రంట్ విజయం

(మొదటిపేజీ తరువాయి)

వెలువడిన ఫ్రాన్స్ పార్లమెంటరీ ఎన్నికల ఫలితాల్లో మక్రాన్ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలిన నేపథ్యంలో ఈ పరిస్థితి ఎదురైంది. సోమవారం ఉదయం ప్రధాని రాజీనామా చేస్తూ, అవసరమైతే పదవిలో కొనసాగుతానని వ్యాఖ్యానించారు. అయితే దేశ సుస్థిరత దృష్ట్యా పదవిలో కొనసాగాల్సిందిగా మక్రాన్ కోరారు. ఏడు మాసాల క్రితమే మక్రాన్ ఆయనను ప్రధానిగా నియమించారు. ఆకస్మికంగా ఎన్నికలకు పిలుపివ్వాలని మక్రాన్ తీసుకున్న నిర్ణయంతో తాను ఏకీభవించడం లేదని అత్తల్ ఆదివారం స్పష్టం చేశారు.

సీపీఐ(ఎం) అభినందనలు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ, జనరేషన్ ఎస్, యూకలాజిస్ట్స్, ప్లేస్ పబ్లిక్ పార్టీలు వున్నాయి. కొద్ది వారాల క్రితమే ఏర్పడినా అనతి కాలంలోనే నయా ఉదారవాద సంస్కరణలకు వ్యతిరేకంగా బలమైన వేదికగా ఈ ఫ్రంట్ మారింది. పాలస్తీనా అనుకూల ఫ్రంట్‌గా నిలిచింది. అధ్యక్షుడు మక్రాన్ పార్టీని, మితవాద లీపెన్ పార్టీని ఓడించింది. ఇది వామపక్షాలకు గుర్తుంచుకోదగిన, గణనీయమైన విజయమని సీపీఐ(ఎం) వ్యాఖ్యానించింది.

బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవానికి సీఎస్‌కు ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవంలో పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యం కోరారు. సోమవారం ఆ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆధ్వర్యంలో బల్కంపేట ఆలయ ప్రతినిధి బందం సీఎస్‌ను కలిసి ఈ మేరకు ఆహ్వానించారు.

సీఎస్‌తో అనితా ప్రవీణ్ భేటీ..

కేంద్ర ప్రభుత్వ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనితా ప్రవీణ్ సోమవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో భేటీ అయ్యారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్ఐ

- ఇసుక టిప్పర్ విడుదలకు ఇస్తుండగా..



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

ఇసుక టిప్పర్ విడుదల కోసం మధ్యవర్తి ద్వారా లంచం తీసుకుంటూ హవేలీ ఘనపూర్ ఎస్ఐ ఆనంద్ గౌడ్ ఏసీబీ అధికారులకు పట్టుపడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా హవేలి ఘనపూర్ మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా హవేలీ ఘనపూర్ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు. అనంతరం ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ మాట్లాడుతూ.. గత నెల 26న స్పెషల్ పార్టీ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను సీజ్ చేసి హవేలీ ఘనపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాంతో టిప్పర్ విడుదలకు స్టేషన్ ఎస్ఐ ఆనంద్ గౌడ్ ఇసుక టిప్పర్ యజమానిని రూ.50 వేలు డిమాండ్ చేశారు. ఈ నెల 28న బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. మూడు రోజుల అనంతరం రూ.50 వేలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్న యజమాని.. ఎస్ఐ సూచన మేరకు మధ్యవర్తి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీకి పట్టుపడ్డారు. దాంతో పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు పోలీస్ స్టేషన్‌కు రాగా, మధ్యవర్తిగా వ్యవహరించిన బికనూర్ మండలానికి చెందిన మస్తాన్‌కు డబ్బులు ఇవ్వాలని ఎస్ఐ చెప్పడంతో పోలీస్ స్టేషన్‌కు కొద్ది దూరంలో బోధన్ రోడ్డుపై బాధితుడు డబ్బులిస్తుండగా రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. ఎస్ఐతో మధ్యవర్తిగా ఉన్న మస్తాన్‌ను పోలీస్ స్టేషన్‌లో విచారించామని, రూ.20వేలు పట్టు పడ్డాయని తెలిపారు. డీఎస్పీ వెంట ఏసీబీ అధికారులు వేణు.రమేష్ తదితరులు ఉన్నారు.

35 కార్పొరేషన్లకు కొత్త చైర్మెన్ల నియామకం

(మొదటిపేజీ తరువాయి)

కొందరిని మార్చాలంటూ సీనియర్లు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 60కి పైగా కార్పొరేషన్లు ఉన్నప్పటికీ మొదటి దశలో 35 సంస్థల చైర్మెన్లను మాత్రమే నియమించామనీ, మిగతా వాటికి నియమించేటప్పుడు అందరికి న్యాయం చేస్తామని అధినాయకత్వం వారిని బుజ్జగించింది. మొదటి నుంచి పార్టీ గెలుపు కోసం పనిచేసిన వారందరికీ అవకాశ కల్పిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. ఈ నేపథ్యంలో తీవ్ర తర్జన భర్జనల అనంతరం ఎట్టకేలకు సోమవారం ప్రభుత్వం జీవోను బహిరంగపరిచింది. కాగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రెండు సంవత్సరాలు వీరు పదవిలో కొనసాగనున్నారు. రెండ్రోజుల్లో కొత్త చైర్మెన్లందరూ బాధ్యతలు స్వీకరించనున్నారని చేరనున్నట్టు సమాచారం.

పార్టీ విధేయులకు ప్రాధాన్యత

నామినేటెడ్ పదవుల భర్తీలో పార్టీ విధేయులకు అధిష్టానం ప్రాధాన్యత ఇచ్చింది. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో, సామాజిక సమీకరణాల దృష్ట్యా సీట్లు రానివారికి, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పాటు పడిన వారికి పదవులను కట్టబెట్టింది. కాంగ్రెస్ సీనియర్ లీడరైన పోదెం వీరయ్య భద్రాచలంనుంచి పోటీ చేసి ఓడి పోయారు. బీఆర్ఎస్ హయాంలో అనేక ప్రలోభాలకు గురి చేసినా పార్టీని వీడలేదు. అయనకు అటవీ అభివృద్ధి సంస్థ చైర్మెన్‌గా అవకాశం దక్కింది.నల్లగొండ ఎంపీ, సూర్యాపేట ఎమ్మెల్యే టికెట్లు ఆశించి భంగపడ్డ పటేల్ రమేశ్‌రెడ్డిని పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ పదవి వరించింది. పదేండ్ల పాటు ఎలాంటి పదవులు లేకున్నా పార్టీని వీడకుండా ఉన్న పలువురు సీనియర్లకు చైర్మెన్లుగా అవకాశం దక్కింది.

కార్పొరేషన్ చైర్మెన్ల వివరాలు

క్రసంఖ్య	కార్పొరేషన్	చైర్మెన్
1).	పర్యాటక అభివృద్ధి సంస్థ	పటేల్ రమేశ్‌రెడ్డి
2).	అటవీ అభివృద్ధి సంస్థ	పొదెం వీరయ్య
3).	పారిశ్రామిక అభివృద్ధి సంస్థ	నిర్మలాజగ్గారెడ్డి
4).	రాష్ట్ర సహకార సంఘం	మానాల మోహన్‌రెడ్డి
5).	రాష్ట్ర గిడ్డంగులు సంస్థ	రాయల నాగేశ్వరరావు
6).	ముదిరాజ్ కార్పొరేషన్	జ్ఞానేశ్వర్ ముదిరాజ్
7).	మత్స్యసహకార సమాఖ్య	మెట్టు సాయికుమార్
8).	రాష్ట్ర గ్రంథాలయ పరిషత్	ఎండీ. రియాజ్
9).	ఎస్టీ కార్పొరేషన్	బెల్లయ్య నాయక్
10).	ఆర్యవైశ్య కార్పొరేషన్	కాల్వ సుజాత
11).	పోలీసు హౌసింగ్ కార్పొరేషన్	ఆర్. గురునాథ్‌రెడ్డి
12).	సెట్ విన్ చైర్మెన్	ఎన్. గిరిధర్‌రెడ్డి
13).	ఎంబీసీ కార్పొరేషన్	జె. జైపాల్
14).	కనీస వేతనాల సలహా బోర్డు	జనక్ ప్రసాద్
15).	నీటిపారుదల అభివృద్ధి సంస్థ	ఎం.విజయ్‌బాబు
16).	హస్త కళల అభివృద్ధి చైర్మన్‌గా	నాయుడు సత్యనారాయణ
17).	విత్తనాభివృద్ధి సంస్థ	ఎస్. అన్వేష్‌రెడ్డి
18).	ఆగ్రో పరిశ్రమల అభివృద్ధి సంస్థ	కాసుల బాలరాజు
19).	ఆయిల్ సీడ్స్ అభివృద్ధి సంస్థ	జంగా రాఘవరెడ్డి
20).	ఖనిజాభివృద్ధి సంస్థ	అనిల్ ఎర్రవాత్
21).	వాణిజ్య ప్రోత్సాహక కార్పొరేషన్	అయిత ప్రకాశ్‌రెడ్డి
22).	సాంకేతిక సేవల అభివృద్ధి సంస్థ	మన్నె సతీష్‌కుమార్
23).	పట్టణ ఆర్థిక అభివృద్ధి సంస్థ	చల్లా నర్సింహారెడ్డి
24).	శాతవాహన పట్టాణాభివృద్ధి సంస్థ	కె.నరేందర్‌రెడ్డి
25).	కాకతీయ పట్టాణాభివృద్ధి సంస్థ	ఈ.వెంకటరామిరెడ్డి
26).	రహదారి అభివృద్ధి సంస్థ	మల్‌రెడ్డి రామిరెడ్డి
27).	తెలంగాణ ఫుడ్స్	ఎం.ఎ.ఫహీమ్
28).	మహిళా సహకార అభివృద్ధి సంస్థ	బి. శోభారాణి
29).	వికలాంగుల కార్పొరేషన్	ఎం.వీరయ్య
30).	తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ	కె. శివసేనారెడ్డి
31).	సంగీత నాట్య అకాడమీ	అలేఖ్య పుంజాల
32).	ఎస్సీ కార్పొరేషన్	ఎన్.ప్రీతం
33).	బీసీ కార్పొరేషన్	నూతి శ్రీకాంత్
34).	గిరిజన కార్పొరేషన్	కె.తిరుపతి
35).	మైనార్టీ కార్పొరేషన్ వైస్ చైర్మెన్	ఎంఏ. జబ్బార్

షెడ్యూల్ ప్రకారమే డీఎస్సీ రాతపరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. మార్చి నాలుగు నుంచి గతనెల 20 వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించామని పేర్కొన్నారు. మెగా డీఎస్సీకి 2,79,966 దరఖాస్తులొచ్చిన విషయం తెలిసిందే. స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ), భాషాపండితులు (ఎల్పీ), సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ (పీఈటీ), స్పెషల్ ఎడ్యుకేషన్‌లో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులను భర్తీ చేస్తున్నామని తెలిపారు. డీఎస్సీ రాతపరీక్షలను వాయిదా వేయాలంటూ అభ్యర్థులు, విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి ప్రకటన విడుదల చేయడంతో అభ్యర్థులకు స్పష్టత వచ్చింది.

రాష్ట్రంలో మారనున్న రాజకీయాలు : టీడీపీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణలో రాజకీయ సమీకరణాలు మారనున్నాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. తెలుగుదేశం అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు హైదరాబాద్ రాక నేపథ్యంలో వెల్లువెత్తిన ప్రజాభిమానమే ఇందుకు నిదర్శమని చెప్పారు. సోమవారం నగరంలోని ఎన్టీఆర్‌భవన్‌లో పార్టీ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు వేలాది మంది హాజరయ్యారని గుర్తు చేశారు.

ఆ ముగ్గురూ మోడీ పక్షమే



ఏపీలో ఉన్నదంతా పాలకమే

- కడప ఎంపీ ఉప ఎన్నిక వస్తే గల్లీ గల్లీ తిరుగుతా : మంగళగిరిలో వైఎస్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, వైఎస్సార్ సీపీ అధినేత జగన్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్... ఈ ముగ్గురూ మోడీ పక్షమేనని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. సోమవారం ఏపీలోని మంగళగిరిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షం లేదనీ, అంతా పాలకపక్షమేనని ఎద్దేవా చేశారు. ప్రజల పక్షాన పోరాడుతున్నది కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల మాత్రమేనని చెప్పారు. 1999లో వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి పోషించిన పాత్రను ప్రస్తుతం షర్మిల పోషిస్తున్నదని అభివర్ణించారు. వైఎస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లిన వారే ఆయనకు నిజమైన వారసులవుతారు... అంతే గానీ ఆయన పేరుతో రాజకీయ వ్యాపారాలు చేసేవారు కాదని స్పష్టం చేశారు. వైఎస్ఆర్ ఆశయాలను కొనసాగించేందుకు ముళ్ల బాటను ఎంచుకున్న షర్మిలకు తామంతా అండగా నిలబడేందుకే మంత్రివర్గ సభ్యులతో కలిసి వచ్చినట్టు తెలిపారు. కడప లోక్‌సభ సీటుకు ఉప ఎన్నిక వస్తే ఎన్నికల ప్రచారంలో గల్లీ గల్లీ తిరగడానికి తానే వస్తానని రేవంత్ తెలిపారు. 2029లో ఏపీలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనీ, దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్ లేని లోటు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నదని రేవంత్ వ్యాఖ్యానించారు. తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది అభిమానులున్న వైఎస్ఆర్, చట్టసభలకు కొత్త వారు వస్తే ప్రోత్సహించే వారని గుర్తుచేశారు. ప్రతి పోరాటానికీ ఒక సమయం వస్తుందన్నారు. రాహుల్ గాంధీ జోడో యాత్ర స్ఫూర్తితో కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే వైఎస్‌కు నిజమైన నివాళి : భట్టి విక్రమార్క

రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే వై.ఎస్.రాజశేఖర్ రెడ్డికి ఇచ్చే నిజమైన నివాళి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆ దిశగా రెండు రాష్ట్రాల కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్ఆర్ తనకు ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా అవకాశమిచ్చి రాజకీయ ఓనమాలు నేర్పించడం వల్లే తాను ఈ రోజు ఉప ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానని విక్రమార్క ఈ సందర్భంగా చెప్పారు. వైఎస్ ప్రజల హృదయాల్లో నిలిచిన నాయకుడని కొనియాడారు. పాలకులు ఎలా ఉండాలో చూపించిన గొప్ప నాయకుడని కీర్తించారు. ఆరోగ్యశ్రీ పథకం తెచ్చిన మార్గదర్శకుడు, పాదయాత్రలో రైతుల బాధలు చూసి ఉచిత విద్యుత్ కోసం తొలి సంతకం చేసిన దార్శనికుడు. ఫీజు రీయింబర్స్ మెంట్ తెచ్చిన విద్యావేత్త వైఎస్ఆర్ అని తెలిపారు. ఆయన ఆలోచన, మాటలు, వేసిన బీజాలు నేడు దేశానికి ఆదర్శంగా ఉన్నాయని భట్టి తెలిపారు.

వారే వైఎస్‌కు నిజమైన వారసులు : గాంధీభవన్ వైఎస్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి అందించిన సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకూ వైఎస్ స్ఫూర్తి అని చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా వై.ఎస్ పని చేశారని గుర్తుచేశారు.

ఆ లక్ష్యం కోసం కృషి చేసే వారే వైఎస్‌కు నిజమైన వారసులని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో నిర్వహించిన వైఎస్ 75వ జయంతి వేడుకల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తదితర నాయకులతో కలిసి సీఎం పాల్గొన్నారు. వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజశేఖర్ రెడ్డి చేసిన పాదయాత్రే ...రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పాదయాత్ర చేసేందుకు స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి రాహుల్ యాత్ర కారణమైందని తెలిపారు. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఆయన రాణిస్తున్నారని చెప్పారు. ప్రధాని పదవికి రాహుల్ ఒక అడుగు దూరంలో ఉన్నారనీ, ఆయన ప్రధాని కావడం చారిత్రక అవసరమని అభిప్రాయ పడ్డారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి రాహుల్‌ను ప్రధాని చేయాలని సూచించారు. ఆయన నాయకత్వానికి వ్యతిరేకంగా వెళ్లే వారు వైఎస్ వారసులు కాబోరని స్పష్టం చేశారు. మూడేండ్లుగా పీసీసీ అధ్యక్షుడిగా అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నానని రేవంత్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రాజశేఖర్ రెడ్డి జన్మదినం సందర్భంగా 35 మందికి కార్పొరేషన్ పదవులు ఇచ్చినట్టు తెలిపారు. ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

ప్రజాభవన్‌లో వైఎస్ఆర్ ఫొటో ప్రదర్శన

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతి రావు పూలే ప్రజాభవన్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవితానికి సంబంధించిన ఫొటో ప్రదర్శనను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, దీపాదాస్ మున్షీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎల్పీ కార్యాలయంలో

వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని శాసనసభ ప్రాంగణంలో గల సీఎల్పీ కార్యాలయంలో రేవంత్ ఆయనకు నివాళులర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని వైఎస్ విగ్రహానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నిరంతర తనిఖీలు

- నాసిరకం సరుకులొస్తే టీచర్లు తీసుకోవద్దు :మహిళా శిశుసంక్షేమ శాఖ సమీక్షలో మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యత లేని గుడ్లు పంపిణీ కావడంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) సీరియస్ అయ్యారు. దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్లు నాసిరకం గుడ్లు సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యతలేని గుడ్లను పంపిణీ చేస్తే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై ఆమె సమీక్ష నిర్వహించారు. కాంట్రాక్టర్లు నాసిరకం గుడ్లు, వస్తువులు సరఫరా చేస్తే టీచర్లు తిరస్కరించాలని సూచించారు. లేదంటే సంబంధిత కేంద్రాల టీచర్లు, హెల్పర్లే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. సరుకుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలనీ, ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తువులను సరఫరా చేసే కాంట్రాక్టులను గత ప్రభుత్వం రెండేండ్లకు పొడిగించడంతో కొందరు కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలా చేసేవారిని ఉపేక్షించబోమన్నారు. వస్తువుల క్వాలిటీని చెక్ చేసేందుకు జిల్లాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లో అందుతున్న సేవలపై థర్డ్ పార్టీతో అధ్యయనం చేయించి లోపాలుంటే సవరిస్తామన్నారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకతను పెంచే దిశలో మరికొన్ని ప్రభుత్వ శాఖల సహకారం తీసుకుంటామని చెప్పారు. సమీక్షలో మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, మహిళా సంక్షేమ శాఖ కమిషనర్ కాంతి వెస్లీతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సెర్ప్ పై సీతక్క సమీక్ష

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)పై మంత్రి సీతక్క సచివాలయంలో సోమవారం సమీక్షించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. సెర్ప్ ద్వారా అమలవుతున్న పథకాలు, బడ్జెట్ ప్రతిపాదనలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వకపోవడం వల్ల చాలా వరకు కేంద్ర నిధులను వాడుకోలేక పోయామని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పథకాల వారీగా పెండింగ్ మ్యాచింగ్ గ్రాంట్ల వివరాల జాబితాను సమర్పించాలని అధికారులను సీతక్క ఆదేశించారు. కేంద్ర నిధులను వినియోగించుకునే విధంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. సామాజిక పెన్షన్ల కోసం గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన దరఖాస్తులు, తమ ప్రభుత్వానికి అందిన దరఖాస్తులపై ఆరా తీశారు. అర్హుల జాబితాను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అభయ హస్తం వంటి పథకాలను అమలు చేయకుండా వందల కోట్ల రూపాయల మహిళల పొదుపు సొమ్మును గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. ఆ నిధుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాలని అధికారులకు సూచించారు.

చిన్నారుల జోలికొస్తే సహించేదిలేదు

సోషల్ మీడియాలో ఓ చిన్నారిపై కొందరు యువకులు జుగుప్సాకరమైన, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన ఘటనపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇలాంటి ఘటనలను సహించేది లేదని స్పష్టం చేసారు. చిన్నారుల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ ఘటనపై తెలంగాణ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసారని తెలిపారు. తండ్రి, చిన్నారి కూతురు మధ్య ఉండే ప్రేమానురాగాలపై సోషల్ మీడియాలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన నిందితులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. చౌకబారు హాస్యం కోసం కుటుంబ బాంధవ్యాలు, మానవ సంబంధాలను అపహాస్యం చేస్తూ సోషల్ మీడియాను దుర్వినియోగ పరుస్తున్న అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట పడేలా, చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తమన్నారు.

రేపు డీసెట్

- 17,655 మంది దరఖాస్తు
- 39 కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో 2024-26 బ్యాచ్ ప్రవేశాల కోసం డీసెట్-2024 ప్రవేశ పరీక్ష బుధవారం ఆన్‌లైన్‌లో జరగనుంది. ఈ మేరకు డీసెట్ కన్వీనర్ ఎస్ శ్రీనివాసాచారి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 17,655 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు.

ఈ పరీక్ష నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 39 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. బుధవారం రెండు విడతల్లో రాతపరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి విడతలో తెలుగు మాధ్యమం అభ్యర్థులకు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తామని పేర్కొన్నారు.

ఉదయం 9.45 గంటల వరకే అభ్యర్థులను అనుమతిస్తామనీ, ఆ తర్వాత గేట్లు మూసేస్తామని తెలిపారు. రెండో విడతలో ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమం అభ్యర్థులకు మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

మధ్యాహ్నం 1.30 గంటల నుంచే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని వివరించారు. మధ్యాహ్నం 2.45 గంటల వరకే అభ్యర్థులను అనుమతిస్తామనీ, ఆ తర్వాత గేట్లు మూసేస్తామని తెలిపారు.

అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు http://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

జేఎల్ ఫలితాలు విడుదల

- జీఆర్ఎల్ ప్రకటించిన టీజీపీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఇంటర్ విద్యాశాఖ కమిషనరేట్ పరిధిలో 1,392 జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టులకు సంబంధించిన ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ ఒక ప్రకటన విడుదల చేశారు. జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను ప్రకటించామని తెలిపారు. జేఎల్ పోస్టుల భర్తీకి గతేడాది సెప్టెంబర్ 12 నుంచి అక్టోబర్ మూడో తేదీ వరకు రాతపరీక్షలను సీబీఆర్టీ విధానంలో నిర్వహించామని పేర్కొన్నారు.

జీఆర్ఎల్‌కు ఎంపికైన అభ్యర్థుల వివరాలు www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు. కమిషన్ ప్రస్తుత నిబంధనల ప్రకారం జీఆర్ఎల్‌ను ప్రకటించామని పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు 1:2 నిష్పత్తిలో జనరల్ అభ్యర్థులు, 1:5 నిష్పత్తిలో వికలాంగుల అభ్యర్థుల జాబితాను త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. 1,392 జేఎల్ పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ తొమ్మిదిన టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.




యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలి

- రాజకీయ జోక్యం ఉండొద్దు : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలకు వెంటనే రెగ్యులర్ వీసీలను నియమించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు, ఓయూ రీసెర్చ్ స్కాలర్ ఆర్ఎల్.మూర్తి కోరారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ యూనివర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలను నియమించి రెండు నెలలు గడుస్తున్నా అకాడమిక్, విద్యా ప్రమాణాలు మెరుగుపడటం లేదన్నారు. యూనివర్సిటీలో నూతన విద్యార్థులను పరిశోధనలకు ప్రోత్సహించడానికి పీహెచ్‌డీ నోటిఫికేషన్ తక్షణ అవసరం ఎంతైనా ఉందన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి సంబంధించి ఫైళ్లు అనేకం పెండింగ్ ఉన్నాయన్నారు. ఇలాంటి సమస్యలు చాలా ఉన్నాయని.. వీటిని పరిష్కరించడంలో ఇన్‌చార్జి వీసీలు విఫలమయ్యారని అన్నారు. తక్షణమే రాజకీయ జోక్యం లేకుండా అకాడమిక్ మెరిట్, పరిపాలన అనుభవం ఉన్న ప్రొఫెసర్లను రెగ్యులర్ వీసీలుగా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఓయూ కార్యదర్శి రవి నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు ఫెలోషిప్ విడుదల చేయకపోవడం వల్ల ప్రయివేటు కాలేజీల, ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు సర్టిఫికెట్స్ తీసుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను జులై నెలాఖరు వరకు నియమించాలని, లేకపోతే చలో అసెంబ్లీకి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ ఓయూ ఉపాధ్యక్షులు కృష్ణ, శ్రీకాంత్, అజయ్, నాయకులు శ్రీను, రాజ్ కుమార్, శ్రీనాథ్, ప్రవీణ్, జవహర్ లాల్, యశ్వంత్ ఉన్నారు.

కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్‌కు యువనాయకుల అభినందనలు



నవతెలంగాణ-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన యువ నాయకులు, తొలుపులురి కృష్ణగౌడ్‌కు సోమవారం పలువురు యువనాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై వారు కృష్ణగౌడ్‌తో చర్చించారు. అభినందనలు తెలిపిన వారిలో పి. సంపత్‌గౌడ్, ఆర్.శ్రీకాంత్, విజయ్‌గౌడ్, జితేందర్, శివలాల్, నరేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

11న మొండి బాకీల పరిష్కారం

- బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడి

BOI Relationship beyond banking

హైదరాబాద్ : మొండి బాకీల పరిష్కారానికి తమ రుణగ్రహీతలకు ప్రత్యేక అవకాశం కల్పిస్తోన్నట్లు ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) తెలిపింది. దేశ వ్యాప్తంగా జులై 11న వన్ టైమ్ సెటిల్మెంట్ (ఓటీఎస్) కింద మొండి బాకీల రుణ ఖాతాలను పరిష్కరించడానికి ప్రత్యేక క్యాంపెయిన్ చేపడుతున్నామని ఆ బ్యాంక్ తెలంగాణ జోన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (రికవరీ) ఓ ప్రకటనలో వెల్లడించారు. తమ అన్ని శాఖలు, జోన్లు, ఎఫ్‌జీఎంవోలో సంఘౌత దినోత్సవంలో భాగంగా ఏదైనా నిజమైన కారణం వల్ల సకాలంలో రుణాన్ని తిరిగి చెల్లించలేని రుణగ్రహీతల కోసం దీన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. చిన్న, మధ్యస్థ ఖాతాల పరిష్కారం కోసం తమ బ్యాంక్ ఒటిఎస్‌ను కల్పిస్తుందన్నారు. దీని ద్వారా ప్రత్యేక డిస్కౌంట్లను అందిస్తున్నామన్నారు. ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకోవాలని ఆ బ్యాంక్ విజ్ఞప్తి చేసింది.

విద్యారంగంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

- సమర్థంగా ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు
- 11,062 పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్
- బడుల పున:ప్రారంభం రోజే యూనిఫారాలు, పుస్తకాల పంపిణీ
- అమ్మ ఆదర్శ కమిటీలతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన
- అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఐటీఐల మార్పు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేసవి సెలవులు వస్తున్నా పూర్తికాని సిలబస్... సకాలంలో అందని పుస్తకాలు, యూనిఫారాలు... అడ్డగోలుగా ఉపాధ్యాయుల బదిలీలు, నానా చిక్కులతో పదోన్నతుల ప్రక్రియ. నూతన ఉపాధ్యాయుల నియామకానికి ఏండ్లకు ఏండ్లు అభ్యర్థుల ఎదురుచూపులు. నెలల తరబడి మధ్యాహ్న భోజన బిల్లుల బకాయిలు. ఇదంతా గతం.

పాఠశాలలు పున:ప్రారంభమైన రోజే పుస్తకాలు, యూనిఫారాల పంపిణీ. విద్యా సంవత్సరం ప్రారంభమైన నెల తిరగక ముందే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి. ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ. ఉపాధ్యాయ విద్య పూర్తి చేసుకున్న వారికి ఇబ్బంది లేకుండా టెట్ నిర్వహణ. మధ్యాహ్న భోజన బిల్లుల బకాయిల చెల్లింపు. ఇంటిగ్రేటెడ్ గురుకుల స్కూళ్లకు రూపకల్పన. ఇది వర్తమానం.

ప్రభుత్వ విద్యారంగంలో నిన్నటికీ నేటికీ ఎంతో తేడా కనిపిస్తున్నది. ఏడు నెలల కాలంలో ఇంత మార్పునకు కారణం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. ప్రభుత్వ విద్యారంగాన్ని సమున్నత స్థితిలో నిలిపేందుకు కృతనిశ్చయంతో పనిచేస్తున్నారు. అందుకే విద్యాశాఖను సీఎం పర్యవేక్షిస్తున్నారు. పుస్తకాల పంపిణీ మొదలు ఉపాధ్యాయుల నియామకం వరకు ప్రతి అంశంపైనా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. అవసరమైన సలహాలు, సూచనలతో విద్యాశాఖను మరింత బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏడు నెలల కాలంలో ముఖ్యమంత్రి విద్యాశాఖపై ప్రత్యేకంగా దృష్టిసారించారు.

ఆగస్టు నెలాఖరుకే రెండోజత యూనిఫారాలు

ఉమ్మడి రాష్ట్రం మొదలు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన పదేండ్లలో పుస్తకాలు, యూనిఫారాల పంపిణీ ప్రహసనంగా ఉండేది. ఒక పుస్తకం వస్తే మరొకటి రాక, ఒక్కోసారి ఏడాది పూర్తయినా పుస్తకాలు అందేవి కాదు. యూనిఫారాల పరిస్థితి అంతే. కానీ ఈ ఏడాది అలాంటి పరిస్థితి రావొద్దంటూ సీఎం రేవంత్‌రెడ్డి ముందుగానే సూచించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫలితంగా పాఠశాలలు తెరిచిన తొలిరోజే పుస్తకాలు, యూనిఫారాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. గత ప్రభుత్వాలు ఆర్నెల్ల తర్వాత పార్ట్-2 పుస్తకాలు, రెండో జత యూనిఫారాలు ఇచ్చేవి. ఈ ఏడాది మాత్రం ఈనెలాఖరుకే పార్ట్-2 పుస్తకాలతోపాటు వచ్చేనెలాఖరుకు రెండో జత యూనిఫారాలను అందజేయనుంది. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు వర్క్‌బుక్స్‌ను ప్రభుత్వం అందజేసింది. అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నది. తలుపులు, కిటికీలు, ఫ్యాన్లు, ఎలక్ట్రిక్ స్విచ్‌లు, బ్లాక్ బోర్డుల ఏర్పాటు, మరమ్మతులు, మరుగుదొడ్ల మరమ్మతులు, గదులకు రంగులు వేయడం వంటి పనులను వేసవిలోనే చేపట్టి దాదాపుగా పూర్తి చేసింది. ఈ పనుల కోసం రూ.667.25 కోట్లను కేటాయించింది. విద్యా సంవత్సరం ప్రారంభమైన వెంటనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను విజయవంతంగా పూర్తి చేసింది. ఇందులోనూ హేతబద్ధతను పాటించింది. ఒకటి నుంచి పది మంది విద్యార్థులుంటే ఒకరిని, 11 నుంచి 40 మంది విద్యార్థులకు ఇద్దరిని, 41 నుంచి 60 మంది విద్యార్థులుంటే ముగ్గురిని, 60పైన విద్యార్థులున్న పాఠశాలకు వాటిలో మంజూరైన పోస్టులకు అనుగుణంగా ఉపాధ్యాయులను బదిలీ చేసింది. 25 వేలకుపైగా టీచర్ల బదిలీలు వివాదరహితంగా పూర్తయింది. ఈ విధానంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతోంది.

మధ్యాహ్న భోజన బకాయిల విడుదల

గత ప్రభుత్వం విద్యా శాఖకు సంబంధించి రూ.వందల కోట్ల బకాయిలను పెట్టింది. మధ్యాహ్న భోజన బిల్లులకు సంబంధించి గత ప్రభుత్వం రూ.50 కోట్లు బకాయిలను విధించింది. ప్రజా ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేసింది. తర్వాత మరో రూ.50.45 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. ఇంకో రూ.52.07 కోట్లు త్వరలో విడుదల కానున్నాయి. కోడి గుడ్ల బకాయిల చెల్లింపులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.13.82 కోట్లను జిల్లా విద్యాశాఖాధికారులకు విడుదల చేసింది. మరో రూ.8.48 కోట్లు త్వరలోనే విడుదల చేయనుంది. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలకు సంబంధించి నెలకు రూ.వెయ్యి చొప్పున జూన్ వరకు చెల్లించింది.

రాష్ట్ర ప్రభుత్వం అదనంగా చెల్లించే రూ.2 వేలకు సంబంధించిన బకాయిల్లో సుమారు 80 శాతం చెల్లింపులు పూర్తయ్యాయి. గత ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లేకుండానే ఎన్నికల లబ్ధి కోసం సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ పథకం బకాయిలు రూ.3.5 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. సర్వశిక్షా అభియాన్‌లో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ల జీతాలు జూన్ వరకు చెల్లించింది.

19 వేల మందికిపైగా పదోన్నతులు

సుమారు దశాబ్ద కాలంగా ఉపాధ్యాయుల పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి. అనేక న్యాయ వివాదాలతో ఆ ప్రక్రియపై ఉపాధ్యాయులు ఆశలు వదిలేసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు న్యాయపరమైన వివాదాల పరిష్కారానికి కృషి చేశారు. ఫలితంగా విద్యా సంవత్సరం ఆరంభంలోనే 19 వేల మందికిపైగా ఉపాధ్యాయులకు పదోన్నతులు దక్కాయి. ఉపాధ్యాయుల నియామక విషయంలోనూ ప్రజా ప్రభుత్వం చురుగ్గా వ్యవహరిస్తోంది. వాస్తవ ఖాళీల ఆధారంగా 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈనెల 18 నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు జరుగుతాయి. డీఎస్సీ రాయాలంటే తొలుత ఉపాధ్యాయ అర్హత పరీక్షలో (టెట్) అర్హత సాధించాల్సి ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో 2011 నుంచి 2014 వరకు నాలుగుసార్లు టెట్ నిర్వహించగా, బీఆర్ఎస్ ప్రభుత్వ పదేండ్ల కాలంలో కేవలం నాలుగు సార్లు టెట్‌ను నిర్వహించారు. 2018 నుంచి 2021 వరకు నాలుగేండ్లు టెట్ ఊసేలేదు. సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. ఆ సమయంలో టెట్ విషయంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో వెంటనే టెట్ నిర్వహించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇక నుంచి ఏటా జూన్, డిసెంబరులో టెట్ నిర్వహిస్తామని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది ఉపాధ్యాయ విద్య పూర్తి చేసిన వారికి ఎంతో ఊరట కలిగిస్తుంది.



ఒకేచోట అన్ని గురుకులాలు

ఉమ్మడి రాష్ట్రంలో, ప్రత్యేక తెలంగాణలోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు వేర్వేరు చోట్ల ఉన్నాయి. అందులోనూ ఎక్కువగా అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అలా కాకుండా వాటన్నింటినీ ఒకే క్యాంపస్ పరిధిలో ఇంటిగ్రేటెడ్ గురుకుల స్కూళ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఒకే చోట ఈ గురుకులాలన్నీ ఉంటే విద్యార్థుల మధ్య స్నేహసంబంధాలు పెరగడంతోపాటు విద్యా, క్రీడాపరమైన పోటీ పెరిగి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. క్రీడా మైదానాలు, ఆస్పత్రి, ఇతర మౌలిక వసతులు వారికి కల్పించడం సులువవుతుంది. ఇప్పటికే ఈ స్కూళ్ల నిర్మాణానికి జిల్లాల్లో స్థల గుర్తింపు పనులు సాగుతున్నాయి. కొడంగల్, మధిరలో ఈ దిశగా తొలి అడుగు పడింది.

పరిశ్రమల అవసరాలు తీర్చేలా ఐటీఐల ఆధునీకరణ

పరిశ్రమల అవసరాలు తీర్చేవిధంగా ఐటీఐలను ఆధునీకరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టిసారించారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని 65 ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) తీర్చిదిద్దాలని సంకల్పించారు. ఇందుకోసం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)లో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఐటీఐలను ఏటీసీలుగా మార్చడంతోపాటు ఆధునిక కోర్సుల్లో శిక్షణకు అవసరమయ్యే పరికరాలు, శిక్షకులను టీటీఎల్ సమకూర్చనుంది. ఇందుకు టీటీఎల్ రూ.2,016 కోట్లు వ్యయం చేయనుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.307.96 కోట్లు ఖర్చు చేయనుంది.

పరిశ్రమలు 4.0 అవసరాలకు తగిన నిపుణులను ఏటీసీలు అందిస్తాయి. దీంతో వచ్చే పదేండ్లలో వాటి నుంచి 4.70 లక్షల మంది వృత్తినిపుణులు బయటకు రానున్నారు. ఏటీసీలకే పరిమితం కాకుండా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే పట్టుదలతో రేవంత్‌రెడ్డి ఉన్నారు. ఇది రాష్ట్రంలోని ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలకు దిక్సూచిగా ఉంటుంది.

స్పీకర్‌కు నోటీసులివ్వలేం

- పార్టీ ఫిరాయింపులపై హైకోర్టులో ఏజీ వాదన

నవతెలంగాణ - హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీ చిహ్నంపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావులను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ వేసిన పిటిషన్లపై సోమవారం హైకోర్టులో వాదనలు జరిగాయి ఖైరతాబాద్, భద్రాచలం, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకటరావు, కడియం శ్రీహరిలను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, వివేకానంద వేసిన వ్యాజ్యాలను జస్టిస్ బి విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. స్పీకర్‌కు కోర్టులు ఆదేశాలు ఇవ్వజాలవని ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్పీకర్ నిర్ణయం తీసుకునే వరకు కోర్టుల జోక్యానికి వీల్లేదన్నారు. వాదనలు ఈ నెల 11కి వాయిదా పడ్డాయి.

గ్రాట్యుటీ ఉద్యోగుల హక్కు

రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ పెంపు విషయంపై ఈసీఐఎల్ వేసిన అప్పీల్‌ను హైకోర్టు జడ్జి నంద కొట్టేశారు. ఈసీఐఎల్‌లో ఉద్యోగుల గ్రాట్యుటీ సీలింగ్ పరిమితి రూ.3.5 లక్షలు కాకుండా రూ.10 లక్షలుగా పీఎఫ్ అప్పీలెట్ అథారిటీ తేల్చడాన్ని ఆ సంస్థ హైకోర్టులో సవాల్ చేసింది. ఈసీఐఎల్ గ్రాట్యుటీ ట్రస్ట్ నిబంధనల ప్రకారమే చెల్లింపులు ఉండాలనీ, అథారిటీ ఉత్తర్వులను రద్దు చేయాలన్న ఆ సంస్థ వాదన వీగిపోయింది. దీనిపై హైకోర్టు పీఆర్‌సీ సిఫారసుల ప్రకారం 2008 నవంబర్ 26న కేంద్రం ఆఫీసు మెమోరాండం జారీ ప్రకారం కూడా ఉద్యోగులు అర్హులని చెప్పింది. ఇప్పటికే చెల్లించిన మొత్తాన్ని మినహాయించి మిగిలిన సొమ్మును వడ్డీతో చెల్లించాలంది. అప్పీలేట్ అథారిటీ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోబోమని చెప్పింది.

నిమ్మగడ్డకు ఎదురుదెబ్బ

వైఎస్ జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో వాన్‌పిక్ భూమి కేటాయింపుల వ్యవహారంలో పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆ కేసులో సీబీఐ చార్జిషీట్‌ను సీబీఐ కోర్టు విచారణకు అనుమతించింది. ఈ చర్యలను నిమ్మగడ్డ హైకోర్టులో సవాల్ చేసిన పిటిషన్‌ను జస్టిస్ లక్ష్మణ్ కొట్టేశారు. సీబీఐ కోర్టులో డిస్చార్జి పిటిషన్ వేసుకునేందుకు నిమ్మగడ్డకు అనుమతిచ్చారు.

ఇలా చేస్తే దాని మెరిట్స్ ఆధారంగా ఉత్తర్వులు ఇవ్వాలనీ, ఈ ఉత్తర్వులను గమనంలోకి తీసుకోరాదని సీబీఐ కోర్టును ఆదేశించారు. నిజాంపట్నంలో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పేరుతో గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 12,073 ఎకరాలను రూ.165.30 కోట్లకు వాన్‌పిక్‌కు కేటాయించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ నిర్ణయంపై సీబీఐ కేసు పెట్టింది.

అటవీ భూమిలో అక్రమ మైనింగ్‌పై పిల్

సూర్యాపేట జిల్లా సుల్తాన్‌పూర్ రిజర్వ్ ఫారెస్టులో భూముల ఆక్రమణల ఆరోపణలపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన సాగర్, నాగార్జున సిమెంట్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. అటవీ ప్రాంతంలో సాగర్ సిమెంట్స్ లిమిటెడ్, ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అక్రమ మైనింగ్ వ్యవహారంపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని న్యాయవాది ఈ కర్నాటి వెంకటరెడ్డి ప్రజాహిత వ్యాజ్యం వేశారు. దీనిపై జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ జూకంటి అనిల్ కుమార్లతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం విచారించి ప్రతివాదులకు నోటీసులు ఇచ్చింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

గృహ జ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోండి

- డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య



నవతెలంగాణ-హాయత్ నగర్

గృహ జ్యోతి పథకానికి హాయత్ నగర్ సిర్కిల్ పరిధిలో ఉన్న ఆయా వార్డు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సిర్కిల్ డిప్యూటీ కమిషనర్ డా.తిప్పర్తి యాదయ్య సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 200యూనిట్ల లోపు విద్యుత్ వినియోగ దారులకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కేవలం 10శాతం మందికి మాత్రమే మొదటి విడత లో జీరో బిల్లు అమలు అయిందని, 90శాతం మంది కి అది అమలు కాకపోవడంతో మరోసారి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు.

చిత్రా లేఅవుట్‌లో వైఎస్ఆర్ 75వ జయంతి

నవతెలంగాణ - చైతన్యపురి



మహేశ్వరం నియోజకవర్గం రామకష్ణ పురం డివిజన్ పరిధిలోని చిత్రా లేవుట్ లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ సీఎం దివంగత డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్న గారి లక్ష్మా రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలు, ప్రవేశ పెట్టిన పథకాలు మరవలేనివన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నేత,బండి మధు సుధాన్ రావు,నిజాముద్దీన్,పిట్ట హరినాద్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి,భాస్కర్ రెడ్డి,అంజి రెడ్డి,కష్ణ రెడ్డి, రమేష్ నేత,యాదవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి ఉప్పల ఆర్థిక సాయం



నవతెలంగాణ- నాగోల్

బండ్ల గూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధం గూడ లో శ్రీశ్రీశ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం నిర్మాణానికి రాష్ట్ర పర్యాటక అభివద్ధి సంస్థ మాజీ చైర్మెన్, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్తా లక్ష 11 వేల రూపాయలు (రూ. 1,11,000/-) ఆర్థిక సహాయాన్ని దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులకు సోమవారం నాగోలు డివిజన్‌లోని కోపరేటివ్ బ్యాంకు కాలనీలో గల తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. దేశ వ్యాప్తంగా వైశ్యులందరూ కలిసి మెలసి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రావి కంటి కిషన్ , వైస్ ప్రెసిడెంట్ మెడ సత్యనారాయణ కార్యదర్శి సురేందర్ మరియు నరేష్, రాములు,లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మన నేతన్నకు అండగా ఉందాం

టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్త

నవతెలంగాణ -నాగోల్



చేనేత కళలను ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరూ ప్రతి సోమవారం చేనేత వస్త్రాలను ధరించి మన నేతన్నలకు అండగా ఉండాలని ఉప్పల శ్రీనివాస గుప్తా పిలుపునిచ్చారు. చేనేత కళలను ప్రోత్సహించడానికి తాను ప్రతి సోమ వారం చేనేత వస్త్రాలను ధరించే సాంప్రదాయానికి శ్రీకారం చిట్టి అనుసరిస్తున్నట్టు తెలిపారు. చేనేత వస్త్రాలు కార్మికుల నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తూ, వారి నాణ్యమైన పనితీరును కనబరుస్తూ ఎంతో సౌకర్యంగా ఉంటాయన్నారు. రాజకీయ నేతలు మేధావులు యువత చేనేత వస్త్రాలపై ఆసక్తిని చూపి వాటిని ధరిస్తే చేనేత కార్మికులకు ఆర్థికంగా సామాజికంగా బాసటగా నిలిచిన వారమవుతామని తెలిపారు.

మ్యాన్ హెూళ్ల చుట్టూ గుంతలు

నవతెలంగాణ-కొత్తపేట



శ్రీరామలింగేశ్వర కాలనీ కమాన్ నుంచి ప్రజానివాస్‌కు వెళ్లే దారి గుంటలుగా మారింది. ప్రతి మ్యాన్ హెూల్ చుట్టూ గుంటలు ఏర్పడినవి. ఈ దారిన వెళ్లే వాళ్లకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. వర్షాకాలం కావడంతో మ్యాన్ హెూల్ రిపేర్‌కు వచ్చి డ్రయినేజీ సమస్య ఏర్పడే అవకాశం ఉంది. కావున దీనిపై అధికారులు స్పందించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.


అనుమతి లేని స్కూల్ ఎక్సేల్సియాకు నోటీసులు



నవతెలంగాణ-పెద్ద అంబర్ పేట్

ఎక్సేల్సియా స్కూల్‌కు కొద్ది రోజుల క్రితం మండల విద్యాధికారి వచ్చి అనుమతి లేదని స్కూల్ ని మూసి వేశారని.. అయినా యజమాన్యం మళ్లీ తిరిగి అడ్మిషన్స్ తీసుకొని పాఠశాలను నడిపిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ అన్నారు. సోమవారం పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో పసుమాముల గ్రామంలో ఎక్సేల్సియా స్కూల్‌కు ఎలాంటి అనుమతులు లేకున్నా లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను నిలువు దోపిడి చేస్తున్నదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అబ్దుల్లపూర్ మెట్ మండల కార్యదర్శి వంశీ, నాయకులు సాయి పాల్గొన్నారు.

కుమ్మరవాడిలో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు



బోనాలు సమర్పించిన మహిళలు

నవతెలంగాణ-సంతోష్ నగర్

పాతబస్తీ చంద్రాయణగుట్ట గ్రామంలో బొడ్రాయి (పోత లింగన్న) విగ్రహ పున్ణ ప్రతిష్ఠాపనోత్సవ తొలి వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. రెండు రోజుల ఉత్సవాలలో భాగంగా బొడ్రాయిన పసుపు, కుంకుమ, పూలతో అలంకరించారు. బలిగంప, బోనాల సమర్పణ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చాంద్రాయణగుట్ట, కేశవగిరి, కుమ్మర్వాడి, ఆర్ఎస్ఎస్ మైదానం, గాంధీ విగ్రహం తదితర బస్తీలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పసుపు, వేపాకులు, నీళ్లతో సాకపెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొబ్బరి కాయలు కొట్టి హారతులిచ్చారు. కుటుంబ సభ్యులను చల్లంగ చూడాలని వేడుకున్నారు. విజయ పంతులు, ఆర్గనైజేషన్ నాగరాజు, ధర్మాకర్, రాజేందర్, పోచయ్య గౌడ్, అజయ్ గౌడ్, మల్లేష్ గౌడ్, నితీష్ గౌడ్, రెండవ ప్రతిష్ఠాపన హాజరైన ముఖ్య అతిథిగా కిషన్ పాలంఘటి తోట్, గురు చరణ్ రాజ్ పాలంటితోడ్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ అభివృద్ధిలో మరో కలికితురాయి

- దేశంలో మొదటిసారిగా అత్యాధునిక ఎస్.బి.ఆర్(సీక్వెన్సర్ బ్యాక్ రియాక్టర్)
- టెక్నాలజీ సాయంతో రూ. 450 కోట్లచే ఎస్.టీ.పీ.పనులు
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ -నాగోల్

ఎల్బీనగర్ నియోజకవర్గ అభివద్ధిలో మరో కలికితురాయి అని.. భారతదేశంలోని మొట్టమొదటి సారిగా ఎస్‌బీఆర్ (సీక్వెన్సర్ బ్యాక్ రియాక్టర్) టెక్నాలజీ సాయంచే దాదాపు రూ. 450 కోట్ల ఎస్‌టీపీ పనులు జరుగుతున్నాయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. సోమవారం నాగోల్ డివిజన్ పతుల్లాగూడాలో ఉన్న ఎస్.టీ.పీ.ప్లాంట్ యందు జరుగుతున్న అభివద్ధి పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్లాంట్ నందు రోజుకు దాదాపు 320 ఎం.ఎల్.డి. మురుగునీరు శుద్ధి చేయడం జరుగుతుందన్నారు. దేశంలోనే అతి పెద్ద ప్లాంట్ ఇదే అని తెలిపారు.మరో రెండు సంవత్సరాల తర్వాత ముంబాయి నగరంలో నిర్మిస్తారని చెప్పారు. మూసినది ప్రక్షాళనలో బాగంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో తాను మూసి చైర్మెన్‌గా నియామకమైన సందర్భంగా 2022 మార్చి 17న శంకుస్థాపన చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం పనులు చివరిదశకు చేరుకున్నాయని.. జంటనగరాల్లో సౌత్ సైడ్ ఉన్న బాపుఘట్ నుంచి వచ్చే మురికినీరు నాయపుల్ గుండా ఇక్కడి వరకు వస్తాయని వివరించారు. అక్కడి నుంచి వచ్చే సివరేజీ నీరు ఇక్కడ శుద్ధి చేసి మూసిలోకి వదలడం జరుగుతుందని తెలిపారు. పూర్తిగా అందుబాటులోకి వచ్చాక కోట్ల సివరేజీ నీరు శుద్ధి చేయడం జరుగుతుందన్నారు.ఈ ప్లాంట్ విషయంలో అధికారులతో పలుమార్లు చర్చలు జరిపి, ఇట్టి ప్రదేశంలో పనుల మీద అధ్యయనం చేసినట్టు వెల్లడించారు. మరో నెలలోపు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అధికారులు ఈ ప్లాంట్ ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, చిరంజీవి, సతీష్, మధుసాగర్ అధికారులు రాజ్ కుమార్, రజినీకాంత్, రమేష్, నవీన్, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

అవినీతిలో పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ

నవతెలంగాణ-పెద్ద అంబర్ పేట

అవినీతి అక్రమాలలో పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ కూరుకుపోయిందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ ఒక ప్రకటనలో అన్నారు. గత సంవత్సర కాలంగా 19 వ వార్డు కన్జర్వేషన్ జోన్‌లో సర్వేనెంబర్ 234, 235 అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే వాటిని తొలగించకుండా స్థానిక ప్రజాప్రతినిధులు కమిషనర్ కుమ్మక్కై అక్రమ నిర్మాణ దారుడు దగ్గర కోట్ల రూపాయలు తీసుకొని వాటిని కూలగొట్టకుండా రక్షిస్తూ వస్తున్నారని తెలిపారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 2023 అక్టోబర్ 13న ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. మున్సిపాలిటీ అధికారులు కులగొట్టకపోవడంతో కోర్టు పోయి అక్రమ నిర్మాణాలను తీసివేయాలని కోర్టు ఆర్డర్లో ఉన్న, తాతకాలికంగా షెడ్లను కులగొట్టినట్టు చేసి డబ్బులు తీసుకొని చేతులు దులుపుకున్నారని చెప్పారు. మున్సిపల్ అధికారులు, ఎన్నికల కోడ్ ఉన్నందున అక్రమ నిర్మాణాన్ని తొలగించలేకపోతున్నామని ఎన్నికల అనంతరం తీసివేస్తామనికమిషనర్ చెప్పినా ఎన్నికల అయిపోయి ఆరు నెలలు గడుస్తున్న ఇప్పటివరకు వాటిని తొలగించలేదన్నారు. పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. మున్సిపాలిటీకి రావలసిన ఆదాయానికి గండి కొట్టి ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటీ ,అధికారులు జేబులు నింపుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుతం 19 వ వార్డులో ఉన్న నిర్మాణాలు ఇక్కడ భూమి కన్జర్వేషన్ జోన్ లో ఉందని... ఇందులో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదు అయినా అధికారులు అందరికీ డబ్బులు పంచి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీలో కమిషనర్ బలహీనత వల్ల అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయని మున్సిపాల్టీలో చర్చ జరుగుతోందన్నారు. సీఎండీఏ ఆఫీస్ నుండి కూడా 6-07-24న అట్టి అక్రమ నిర్మాణాలను వెంటనే తీసివేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ వాటిని తొలగించకుండా డబ్బులు తీసుకున్నారు కాబట్టి వాటిని తొలగిస్తే ఎక్కడ బదనమైపోతామో అనే భయంతో అధికారులు వాటి జోలికి పోవడం లేదని... కావున వెంటనే వాటిని కూల్చి వేయకపోతే పెద్ద ఎత్తున సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళన చేయిస్తామని హెచ్చరించారు.

నాగోల్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య



నవతెలంగాణ-కొత్తపేట్

కొత్తపేట్ నుంచి నాగోల్ వెళ్లే దారిపై ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్యగా మారింది. స్కూల్ బస్సులు, కాలేజీ బస్సులు వారి ఇష్టానుసారంగా నడిరోడ్డుపై వాహనాలు నిలపడంతో దారిపై వెళ్లే వాహనదారులకు సమస్యగా మారింది. కావున స్కూల్ కాలేజ్ బస్సు డ్రైవర్లకు ఒక స్టాప్ వద్ద ఆపితే ట్రాఫిక్ సమస్య కొంత తగ్గుతుందని వాహనదారులు, పాదాచార్యులు వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధిని గాలికి వదిలేసిన కాంగ్రెస్

- న్యాలకొండ శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి



కాంగ్రెస్ పార్టీ అభివద్ధిని గాలికి వదిలివేసి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని మహేశ్వరం నియోజకవర్గం ఉద్యమ కారుల కమిటీ కన్వీనర్ న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం ఆర్కేపురం లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతం లో పార్టీ ఫిరాయింపుల ను వ్యతిరేకించిన మీరే , ఇప్పుడు నాయకుల ఇంటి దగరికి వెళ్లి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం సిగ్గు చేటన్నారు. పార్టీ మారినప్పుడు కేసులు వేసి ఇప్పుడూ స్వాగతం చెప్పడం ఏంటని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన 6 హామీలు అమలు చేయకుండా కల్లబొల్లి మాటలతో పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలు తిరగ బడే రోజులు దగ్గర పడ్డాయని చెప్పారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రాష్ట్రం ఎంతో ప్రగతి సాధించిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం పాలించే అర్హత కోల్పోయిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో కన్నా ఢిల్లీ లోనే ఎక్కువ ఉంటున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, రమేష్ కురుమ పాల్గొన్నారు.

అనుమానస్పదంగా సాఫ్ట్ వేర్ ఇంజినీర్ మృతి

- కుళ్లిన స్థితిలో మృతదేహం

నవతెలంగాణ- నాగోల్



అనుమానాస్పద స్థితిలో ఓ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ మృతి చెందిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన తెరతేపల్లి నరేష్(35) నాగోల్‌లోని సాయి నగర్ రోడ్ నెంబర్ 4లో ఎస్.కె మూర్తికి చెందిన ఇంట్లో గత రెండు మాసాల నుంచి అద్దెకు ఉంటున్నాడు. బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తన భార్య ప్రసవం కోసం మిర్యాలగూడకు వెళ్లింది. అతను ఇంటి నుంచి పనిచేస్తున్నాడు. ఇంట్లో పని అవసరం ఉన్నప్పుడు పని మనిషికి ఫోన్ చేసి చెప్పేవాడు. ఈ మేరకు బుధవారం పనిమనిషి ఇంట్లో పని చేసి వెళ్లింది. గురువారం నుండి అతడు పని మనిషికి ఫోన్ చేయలేదు. ఇదిలా ఉండగా ఆదివారం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తున్నదని ఇంటి యజమాని మూర్తి 100 డయల్ ద్వారా పోలీసులు సమాచారం అందించారు .దాంతో వెంటనే సంఘటన స్థలానికి చేరు కొని ఇంటి తలుపులు విరగ్గొట్టి చూడగా నరేష్ మృతదేహం బోర్ల పడి కుళ్లిన స్థితిలో కనిపించింది. మృతదేహాన్నిపోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి మృతుడి తండ్రి రమేష్‌కు సమాచారం అందించారు. రమేష్ ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నరేష్ హై బీపీతో బాధపడేవాడని తెలిసింది

కార్మికుల కోరికల దినోత్సవ కరపత్రాల విడుదల

నవతెలంగాణ-నాగోల్



భవన నిర్మాణ కార్మికుల సంఘం (సీఐటీయూ) న్యూ నాగోల్ డివిజన్ ఆధ్వర్యంలో డివిజన్ కోశాధికారి ఎండి లతీఫ్ అధ్యక్షతన ఈ నెల 10న జరిగే కార్మికుల కోరికల దినోత్సవం విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) రంగారెడ్డి జిల్లా కోశాధికారి జి.చైతన్య, సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ ఎం వీరయ్యలు అన్నారు. సోమవారం అందుకు సంబంధించిన కరపత్రాలను న్యూ నాగోల్ డివిజన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల కోరికల దినోత్సవాని పురస్కరించుకొని నాగోల్ చౌరస్తా వద్ద ఈ నెల 10న ఉదయం 9 గంటలకు కార్మికులందరూ పనులు వెసులు బాటు చేసుకుని ధర్నాకు హాజరుకావాలని కోరారు. కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసేసి నాలుగు కోడ్‌లుగా చేసి కార్మికుల చట్టాలన్ని నిర్వర్యం చేస్తున్నారని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని, ప్రతీ కార్మికునికి లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు మంజూరు చేయాలని, నేరుగా అడ్డాల మీదికి వచ్చి వాళ్ల సమస్యలు కూడా అడిగి తెలుసుకోవాలని కోరారు. అలాగే వెల్ఫేర్ బోర్డులో ఏఎల్ఓ లు చిన్న చిన్న తప్పులను చూపిస్తూ స్కీములు రాకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. కార్మికుల వెల్ఫర్ కార్డు రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. న్యూ నాగోల్ కమిటీ సభ్యులు ఎల్ శంకర్, కే చంద్రయ్య, పి. వెంకటేష్, ఏ. శ్రీనివాస్ గౌడ్, కే. జంగయ్య, కే. రామస్వామి, బి. విజయ్ తదితరులు పాల్గొన్నారు

హయత్ నగర్ సర్కిల్‌లో ప్రజావాణిలో 4 ఫిర్యాదులు

నవతెలంగాణ -ఎల్‌బీనగర్



జీహెచ్ఎంసీ హయత్ నగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి నాలుగు ఫిర్యాదులు వచ్చినట్టు హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన రెండు ఫిర్యాదులు, ఆస్తి పన్ను రెవెన్యూ విభాగానికి సంబంధించి రెండు ఫిర్యాదులు అందినట్టు చెప్పారు. ఈ మేరకు వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. అధికారులు పారదర్శకంగా పనిచేస్తున్నారని ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నట్టు తెలిపారు.

మంత్రి సహకారంతో డివిజన్ అభివృద్ధి

- కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్

నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మరింతలా అభివద్ధి చేసేలా నిధులు మంజూరీ చేసేలా కోరామని కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. డివిజన్ సమీపంలోని టీకేఆర్ విద్యాసంస్థల్లో మాజీ ఎమ్మెల్యే తీగల కష్ణారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మెన్ తీగల అనిత రెడ్డి, హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్, మధుయాష్కి గౌడ్ కలిసి హస్తినాపురం డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రధానంగా రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని, డ్రయినేజీ సమస్యలు పరిష్కరించడానికి ఇతర సమస్యల పై పూర్తిగా చర్చించి అట్టి సమస్యలను పరిష్కరించడానికి నిధులు కేటాయించాలని మంత్రిని త్వరలో కలవనున్నట్టు తెలిపారు. ఎల్బీనగర్ నియోజక వర్గంలో ప్రధాన సమస్యలన్నిటిని మంత్రి దష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. డివిజన్ పరిధిలో రోడ్ల నిర్మాణం డ్రయినేజీల నిర్మాణం నూతన కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, సమస్యలన్నిటినీ కార్పొరేటర్ వారి దష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బుర్ర జగన్ రెడ్డి ,లోహిత్ రెడ్డి ,రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ, ఎంపీపీకి ఘన సన్మానం

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్



తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక, ఉద్యమకారుల పోరం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అబ్దుల్లాపూర్ మెట్ మండల మాజీ ఎంపీపీ బుర్ర రేఖమహేందర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ బింగి దాస్ గౌడ్‌లను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన ఐదేండ్లలో మహేందర్ గౌడ్ మండలంలోని గ్రామాల అభివద్ధి కోసం అనేక సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. సంక్షేమ అభివద్ధిలో తన వంతు బాధ్యతగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించి మౌలిక సదుపాయాల కల్పనలో ముందుకు వెళ్లారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకొని అభివద్ధి కోసం ముందడుగు వేశారన్నారు. ఎక్కడ ఎలాంటి అవరోధాలు, ఆరోపణలు, అవినీతి మచ్చలు లేకుండా ప్రజలందరి సహకారాలతో ఐదేండ్ల పదవీకాలం సంతప్తిగా విజయవంతం చేయడాన్ని అభినందిస్తున్నామని తెలిపారు. ఇకనుంచి కూడా ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని కోరారు. వారికి ఎల్లప్పుడూ తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వెన్నంటూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం దక్షిణ తెలంగాణ కన్వీనర్ గుర్జని వెంకటేష్ గౌడ్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక మండల అధ్యక్షులు అంతటి ధనుంజయ గౌడ్ , ఉపాధ్యక్షులు ఏసూరి జంగయ్య, నాయకులు బుర్ర జంగం గౌడ్, బద్దుల కష్ణ కుమార్ యాదవ్ , గుండ్ల జంగం గౌడ్ , అత్తపురం లావణ్య తదితరులు పాల్గొన్నారు

ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో పనిచేయని లిఫ్ట్

నవతెలంగాణ- ఎల్బీనగర్

ఎల్బీనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో కొంతకాలంగా లిఫ్ట్ పనిచేయడం లేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో విజిటర్స్, వద్దులు ఇబ్బందులు పడుతున్నారు. సర్కిల్ కార్యాలయం మూడు అంతస్తులతో నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో సరూర్ నగర్ సర్కిల్ కార్యాలయం, మొదటి అంతస్తులో ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయం, రెండో అంతస్తులో హయత్ నగర్ సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఒకే భవనంలో మూడు సర్కిల్ కార్యాలయాలు ఉండడంతో రోజూ అనేకమంది వివిధ పనుల కోసం వస్తారు. హయత్‌నగర్, ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయానికి వెళ్లాలంటే తప్పని పరిస్థితిలో లిఫ్టులో వెళ్లాల్సి వస్తుంది. లిఫ్ట్ పనిచేయకపోవడంతో వద్దులు మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల్లో వారం రోజులు లిఫ్టు పనిచేస్తుందని.. మిగతా రోజుల్లో లిఫ్ట్ పని చేయడం లేదని పలువురు వాపోతున్నారు. సర్కిల్ కార్యాలయానికి జనరేటర్ ఉన్నా సక్రమంగా పనిచేయడం లేదు. కరెంటు పోతే ఆటోమేటిక్‌గా జనరేటర్ గతంలో వాడేవారు. ఇప్పుడు దాన్ని వాడడం మానేశారు. లిఫ్ట్ చెడిపోతే రిపేర్ చేయడం లేదు. దాంతో ప్రజలు రెండు అంతస్తులు మెట్ల ఎక్కవలసి వస్తుంది. మెట్లు కూడా అపరిశుభ్రంగా ఉన్నాయి. మెట్ల గోడలకు ఉమ్మి వేసినా అధికారులకు పట్టింపు లేదని విమర్శలు వస్తున్నాయి. దశాబ్ద కాలం క్రితం సర్కిల్ కార్యాలయానికి రంగులు వేశారు. పలుచోట్ల టైల్స్ పగిలిపోయినా, మరుగుదొడ్లు కంపు కొడుతున్నా పట్టించుకోవడం లేదని పలువురు విమర్శి స్తున్నారు.దశాబ్ద కాలం క్రితం నిర్మించిన మరుగుదొడ్లనే వాడుతున్నారని... మోడరన్ టాయిలెట్స్ ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సర్కిల్ కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రజలకు మెరిగిన సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



కాంగ్రెస్ రంగారెడ్డి డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మందమల్లమ్మ చౌరస్తాలోని వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ చైర్ పర్సన్ తీగల అనిత రెడ్డి, నాయకులు చల్లా బాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సిద్ధాల దశరథ్, సురేందర్ రెడ్డి పైల శేఖర్ రెడ్డి, కీసరి యాదిరెడ్డి, మహిళా అధ్యక్షు రాలు కే పద్మ, మహిళా నాయకురాలు అరుణ, మంకాళి యాదయ్య, రాజ్ కుమార్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. -నవతెలంగాణ - మీర్ పేట్

ఆశా వర్కర్లకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలి



నవతెలంగాణ-కాప్రా

ఆశా వర్కర్లకు రూ.26వేల వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆశా వర్కర్ల సంఘం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రేవతి కల్యాణి డిమాండ్ చేశారు. జులై 10న దేశవ్యాప్తంగా నిర్వహించే కార్మికుల డిమాండ్ డే సందర్భంగా కుషాయిగూడ పీహెచ్‌సీ పనిచేస్తున్న ఆశా వర్కర్లు నిరసన తెలపనున్నట్టు సోమవారం ఉన్నతాధికారులకు మెమోరాండం అందజేశారు. అనంతరం రేవతి కల్యాణి మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. జూన్ నెల జీతం వెంటనే చెల్లించాలని కోరారు. 10వ తేదీన నిర్వహించే నిరసనలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ఆశా వర్కర్స్ నాయకురాలు లలిత, కవిత, శ్వేత, పలువురు ఆశా వర్కర్లు ఉన్నారు.

కీసర ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం

- ఫైలట్ శ్రీకరణ్‌రెడ్డి మృతి



నవతెలంగాణ-కీసర

మేడ్చల్ జిల్లా కీసర ఔటర్ రింగ్ రోడ్డుపై కారు అదుపు తప్పి శిక్షణలో ఉన్న ఫైలట్ మృతి చెందిన ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకరణ్‌రెడ్డి(26) సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు యాదగిరిగుట్టకు వెళ్తున్నానని ఇంటో చెప్పి కారులో బయలు దేరాడు. కీసర ఔటర్‌రింగ్‌రోడ్డుపై తన కారు అదుపుతప్పి బోల్తాపడడంతో అక్కడిక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న కీసర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డెడ్ బాడీని రికవరీ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి స్వస్థలం గజ్వేల్ కాగా అయన కుటుంబం నేరెడ్‌మెట్‌లో స్థిరపడింది. బ్యాంకాక్‌లో ఫైలట్ శిక్షణ పొందుతున్న శ్రీకరణ్‌రెడ్డి వారం రోజుల క్రితమే ఇంటికి వచ్చాడు.

మొక్కల పెంపకంతో పర్యావరణ రక్షణ



నవతెలంగాణ-కాప్రా

మొక్కల పెంపకంతో పర్యావ రణాన్ని రక్షించుకోవచ్చని లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం. శ్రీదేవి అన్నారు. సోమవారం పర్యావరణ వారోత్సవంలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా, ఏఎస్‌రావునగర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారం భించారు. ఈ సందర్భంగా కాప్రాలోని కాల్ పబ్లిక్ స్కూల్లో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం. శ్రీదేవి మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్లబ్ తరపున క్లబ్ సభ్యులు అనేక ప్రాంతాల్లో మొక్కలు నాటుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చనమోలు వరప్రసాద్, సభ్యులు ఆర్పీ సేథ్, సునీల్ కుమార్, డాక్టర్ దినేష్ పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాల కరపత్రాల పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

జన విజ్ఞాన వేదిక కాప్రా మం డల కమిటీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ క్రాస్ రోడ్డులో వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ పాటించాల్సిన సురక్షితమై న ఆరోగ్య నియమాల కరపత్రాల ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా కోశాధికారి జెన్ని హాజరై మాట్లాడుతూ.. వర్షాకాలంలో అధిక శాతం నీరు కలుషితం అవుతుందని, తద్వారా అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గాచారి, శివశంకర్ రెడ్డి, నాగరాజు, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సామూహిక భవనానికి స్థలం కేటాయించాలని ఈటలకు వినతి



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడలో ముదిరాజ్ సామూహిక భవనానికి, పెద్దమ్మ తల్లి గుడికి స్థలం కేటాయించాలని కుషాయిగూడ ముదిరాజ్ సంఘం సభ్యులు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజే శారు. సోమవారం ముదిరాజ్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పిట్టల నాగరాజు ముదిరాజ్, గడ్డల పాండు ముదిరాజ్‌లు ఈటలను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ స్థలాల వివరాలు తెలియజేస్తే అధికారులతో చర్చించి స్థలం కేటాయించేలా చూస్తానని ఈటల వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ముదిరాజ్ సంఘం సభ్యులు బొల్ల శ్రీనివాస్ ముదిరాజ్, దుంపల అమర్నాథ్ ముదిరాజ్, వారాల సతీష్ ముదిరాజ్, కొలిపాక కనకయ్య ముదిరాజ్, కూర యాదగిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ఎంపీ ఈటలకు సన్మానం



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి ఎంపీగా గెలిచాక మొదటిసారిగా మల్కాజిగిరికి వచ్చిన సందర్భంగా ఈటల రాజేందర్‌కు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఈటల మాట్లాడుతూ.. మల్కాజిగిరిలోని ప్రతి కాలనీకి, ప్రతి బస్తీకి తానే వస్తానని, ఒక కార్పొరేటర్ ఎలాగైతే కాలనీల్లో, బస్తీలలో తిరుగుతాడో అలాగే నేను కూడా మీ వద్దకు వస్తానని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ మల్లారెడ్డి, ఆర్యే శ్రీను, గోలి మధుసూదన్ రెడ్డి, వెంకటేష్, శ్రావణ్, రాజ్యలక్ష్మి, మహేష్, వాసంశెట్టి శ్రీనివాస్, శ్రీనివాస్ ముదిరాజ్, నరహరి తేజ, తదితరులున్నారు.

దివ్యా నగర్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తా



- నూతన అధ్యక్షుడు నల్ల మల్లారెడ్డి

నవతెలంగాణ-ఘట్కేసర్

దివ్యా నగర్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు నల్ల మల్లారెడ్డి అన్నారు. సోమవారం దివ్యా నగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్ల మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎంఏ. జమిల్, జనరల్ కార్యదర్శిగా ఎండీ. హైదర్, కార్యదర్శిగా సుదర్శన్, జాయింట్ సెక్రటరీగా నిశాంత్ రెడ్డి, కోశాధికారిగా సంపత్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా భూమయ్య, సురేందర్, ఉషాకాంత్, వెంకటరెడ్డి, శ్రీరామ్, సూర్యనారాయణలను ఎన్నుకున్నారు.

మధ్యాహ్న భోజనానికి నగదు బదిలీని రద్దు చేయాలి

- కార్మికులుగా గుర్తించి, కనీస వేతనమివ్వాలి
- 3 నెలల వేతనాలు, బిల్లులు చెల్లించాలి
- 10న దేశవ్యాప్త కార్మికుల కోర్కెల దినాన్ని జయప్రదం చేద్దాం
- తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మధ్యాహ్న భోజన పథకానికి నగదు బదిలీని రద్దు చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత, గడిచిన పదేండ్లుగా అవలంభించిన కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను దూకుడుగా అమలు చేస్తున్నదన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో నగదు బదిలీ, పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకిచ్చేందుకు కేంద్రం దూకుడు పెంచుతుందన్నారు. కేంద్ర బీజేపీ విధానాలను నివారించి కార్మిక హక్కులను కాపాడేందుకు దేశ వ్యాప్తంగా కార్మిక పోరాటాలను ఉధృతం చేయాలని సీఐటీయూ అఖిల భారత కమిటీ నిర్ణయించినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 10వ తేదీన కార్మికుల కోర్కెల దినం పాటించాలని పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఈ పిలుపులో భాగంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులందరూ జిల్లా, మండల కేంద్రాల్లో జరిగే ధర్నాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. దేశ జనాభాలో దాదాపు 35.5శాతం మంది పిల్లలు దీర్ఘకాలిక పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారని తెలిపారు. ఆహార లేమి, ఆకలితో తరగతి గదుల్లో అలమటించే పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం ఎంతో తోడ్పడుతున్నదని అనేక అధ్యయనాలు వెల్లడించాయని గుర్తు చేశారు. డ్రాపౌట్స్ తగ్గడానికి, పాఠశాలలో చదువుకునే వారి సంఖ్య పెంచడానికి, సామాజిక సమానత్వం కాపాడటానికి ఈ స్కీమ్ బాగా ఉపయోగపడుతున్నదనీ, ఇలాంటి స్కీంలను బలోపేతం చేయాలనీ, అధిక నిధులు కేటాయించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ పనిచేసే వారిలో 98 శాతం మంది మహిళలు సామాజికంగా వెనుకబడిన, అట్టడుగు వర్గాలకు చెందినవారే అనీ, వీరికి ఎలాంటి సాంఘిక భద్రత లేదనీ, ఇచ్చేదే గౌరవ వేతనం అనీ, అది కూడా 10 నెలలకు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. పదేండ్లుగా మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన నిధులను కేటాయించకుండా స్కీమ్ మొత్తాన్ని స్వచ్ఛంద సంస్థలకు కట్టబెట్టడానికి దొరికిన ప్రతి అవకాశాన్నీ కేంద్రం ఉపయోగించుకుంటుందన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పేదలకు అందే ఈ కొద్దిపాటి సౌకర్యాలను లేకుండా చేస్తుందన్నారు. స్కీంల రక్షణ, కనీస వేతనాలు రూ.26వేల అమలు, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నగదు బదిలీని తీసుకొచ్చి పిల్లలకు (వంట) భోజనానికి ఇచ్చే ఖర్చులు నేరుగా విద్యార్థుల ఖాతాలో జమ చేయాలని చూస్తున్నారనీ, ఈ నిర్ణయం అమలైతే దేశవ్యాప్తంగా పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికులకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. తెలంగాణలో 54,202 మంది మధ్యాహ్న భోజన కార్మికులకు ఉపాధి పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. బడుగు బలహీనవర్గాల విద్యార్థులు, కార్మికుల పొట్టలు కొట్టే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలనీ, మధ్యాహ్న భోజన నిర్వహణకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఎత్తేసి పేద పిల్లలను ఆకలిలోకి నెట్టే బీజేపీ ప్రభుత్వపు దుర్మార్గాలకు కళ్లెం వేయాలనీ, కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలనీ, ఉద్యోగ భద్రతను కాపాడుకోడానికి కార్మికుల డిమాండ్ డే సందర్భంగా మండల, జిల్లా కేంద్రాల్లో జరిగే ధర్నా కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కామ్రేడ్ జ్యోతి బసు సేవలు చిరస్మరణీయం

- సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి



నవతెలంగాణ-కాప్రా

ప్రజల కోసం కామ్రేడ్ జ్యోతి బసు చేసిన సేవలు చిరస్మరణీయమని సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి అన్నారు. సీపీఐ(ఎం) మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జ్యోతి బసు 110వ జయంతిని కమలానగర్ పార్టీ కార్యాల యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరవి జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన రికార్డు సొంతం చేసుకున్నారని తెలిపారు. జ్యోతిబసు జులై 8, 1914న కోల్‌కత్తాలో జన్మించారని చెప్పారు. 1977 నుంచి 2000 వరకు వరుసగా ఐదు సార్లు ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టారని పేర్కొన్నారు. 1967-69 కాలంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశార ని తెలిపారు. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో నిర్ణయంతో 1996లో ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చినా పార్టీకి ప్రాధాన్యత ఇచ్చి వద్దన్నారని గుర్తు చేశారు. 2000లో ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన జ్యోతిబసు జనవరి 17, 2010న 96 ఏండ్లకు మరణిం చారని వివరించారు. దేశంలో అత్యధిక కాలం పని చేసిన ముఖ్యమంత్రులు జాబితాలో రెండో స్థానంలో ఉన్నారని పేర్కొన్నారు. సీపీఐ(ఎం) తరపున అత్యధిక కాలం పని చేసిన ముఖ్యమంత్రిగా ఉన్నాడని చెప్పారు. జ్యోతిబసు 23ఏండ్ల 137 రోజులు పశ్చిమ బెంగాల్‌కు సీఎంగా పని చేశాడని తెలిపారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో స్ఫూర్తిదాయకమైన పాత్రను కామ్రేడ్ జ్యోతిబసు నిర్వహించారని, స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. ధనిక కుటుంబంలో పుట్టినా పేద ప్రజల ఉన్నతి కోసం పోరాడారన్నారని కొనియాడారు. ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో క్రియాశీలకంగా ఉన్నారని చెప్పారు. అఖిలభారత సీఐటీయూకు ఉపాధ్యక్షుడు కొనసాగారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ నాయకులు సంతోష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గణేష్, శ్రీనివాసరావు, గౌస్య, శోభ, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ లైట్లను మంజూరు చేయండి



- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీపాథరావుకు మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి వినతి

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీలో కొత్త కాలనీలు వెలుస్తునందున ఎల్ఈడీ లైట్లు, స్ట్రీట్ లైట్లు మంజూరు చేయాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీపాథరావుకు నాగారం మున్సిపాలిటీ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జి.రాజేందర్ కుమార్ వినతి పత్రం అందజేశారు. నాగారం మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతూ కొత్త కాలనీలు, కొత్త లే అవుట్‌లు, ఇండ్లు నిర్మించడంతో 3100 ఎల్ఈడీ లైట్లు ఇప్పించాలని డిప్యూటీ డైరెక్టర్‌ను చంద్రారెడ్డి కోరారు.

హరిత జవహర్ నగర్‌గా తీర్చిదిద్దుతాం

- మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి



నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్‌నగర్‌ను హరిత జవహర్ నగర్‌గా తీర్చిదిద్దడానికి ప్రజల సహకారం కావాలని మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాలలో శానిటేషన్ సిబ్బంది చేస్తున్న పనులను పర్యవేక్షించారు. అనంతరం పార్కులను సందర్శించి పలు జాగ్రత్తలను సిబ్బందికి సూచించారు. పార్కులలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలందరూ తమ చుట్టుపక్కల ఉన్న పరిసరాలను శు భ్రంగా ఉంచుకోని, పచ్చదనాన్ని పెంచాలని, ఆకుపచ్చ జవహర్ నగర్‌లో భాగస్వాములు కావాలని కోరారు.

ఉప్పల్ క్రికెట్ స్టేడియం వద్ద రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలి

- మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతారావు



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వద్ద మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ హనుమంతారావు అన్నారు. సోమవారం ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వద్ద విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే విగ్రహం ఏర్పాటు పనులను ప్రారంభించి రాజీవ్ గాంధీ జయంతి రోజున ఆవిష్కరించ నున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సిఏ కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి సి.జే.శ్రీనివాస్, సభ్యులు భాస్కర్, విగ్రహ రూపకర్త రాజు ఒడియార్, ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి, పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, తదితరులున్నారు.

సీలింగ్ భూములను పరిరక్షించాలి



కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

పర్వతాపూర్ వాసుల డిమాండ్

నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పర్వతాపూర్ రెవెన్యూ పరిధిలోని సీలింగ్ భూములను పరిరక్షించి ప్రజా వినియోగంలోకి తేవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేశగోని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం పర్వతాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పర్వతాపూర్ వాసులతో కలిసి మాట్లాడుతూ.. పర్వతాపూర్ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 1,10,11లో 38.19 ఎకరాల భూమి ఉందన్నారు. సీలింగ్ ల్యాండ్‌పై కన్నేసిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు పక్క సర్వే నెంబర్లను ఉపయోగించి కబ్జా చేశారని తెలిపారు. గతంలోనే ఈ సర్వే నెంబర్లల్లో ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేపట్టవద్దని సబ్ రిజిస్ట్రార్‌కు కలెక్టర్ నుంచి ఆదేశాలున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్, రెవెన్యూ యంత్రాం గం స్పందించి సీలింగ్ భూములను కాపాడి పర్వతాపూర్‌లో ఇండ్లు లేని పేదలకు, గ్రంథాలయాలకు, ఆస్పత్రి, ఆట స్థలం, కళాశాలకు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేశగోని రఘుపతి గౌడ్, మాజీ ఉపసర్పంచ్ మునుకుంట్ల సహదేవ్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు దుబ్బాక వెంకటేశ్ గౌడ్, మిట్ట నర్సయ్య గౌడ్, జైహింద్ గౌడ్ పాల్గొన్నారు.

సీలింగ్ భూముల్లో కూల్చివేతలకు ఆద్యుడు మేయర్..

- నాడు ఫెన్సింగ్ వేయించింది నిజం కాదా
- అగ్గువకు తన అనుయాయులకు భూములు అంటగట్టింది వాస్తవం కాదా!
- పీర్జాదీగూడ మేయర్ పై రెచ్చి పోయిన కాంగ్రెస్ కార్పొరేటర్లు



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ రెవెన్యూ సాలార్జంగ్ కంచె భూముల్లో సీలింగ్ భూములను తెరమీదకు తెచ్చిందే పీర్జాదిగూడ మేయర్ వెంకట్ రెడ్డి అని పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు ఆరోపించారు. సోమ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరే టర్లు పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతూ పీర్జాది గూడ పాలక వర్గం ఏర్పాటయ్యాక మేయర్ వెంకట్ రెడ్డి పర్వతాపూర్‌లో సీలింగ్ ల్యాండ్స్ ఉన్నాయని చెప్పి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి కౌన్సిల్‌లో తీర్మానం చేసి రూ.30 లక్షలు వెచ్చించి సీలింగ్ భూములకు ఫెన్సింగ్ వేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నాయనో భయానోకో వేరే వాళ్ల భూములను తన అనుయాయులకు కట్టపెట్టిన మాట వాస్తవం కాదా అని నిలదీశారు. నేడు ఆయన అవినీతి బయట పడుతుందనే భావనతో ఆందోళన డ్రామాలు చేస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి లేకపోతే నీకు మేయర్ పదవీ ఎక్కడిదని, రాజకీయంగా భిక్ష పెట్టిన సుధీర్ రెడ్డిని ఏకవచనంతో విమర్శలు చేసే స్థాయి నీకుందా అని దుయ్యబట్టారు.

మేయర్ విధానాలు నచ్చకనే పార్టీ మారినం

పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఏకపక్ష నిర్ణయాలు, అవినీతి అక్రమాలను సహించలేకనే తాము బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి వచ్చామని కార్పొరేటర్ అమర్ సింగ్ అన్నారు. నాడు సీలింగ్ భూమంటూ గగ్గోలు పెట్టిన మేయర్ నేడు సర్వే నెంబరు1లోని సీలింగ్ ల్యాండ్‌లో తన అనుచరుల నిర్మాణాలు కులుస్తుంటే ఆందోళన చేస్తున్నాడని విమర్శించారు. పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో అభివృద్ధి అంటూ ప్రచారం చేసిన మేయర్ అంతే స్థాయిలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కేటీఆర్, కవితా తన జేబులో ఉన్నారని తనను ఎవరూ ఏమీ చేయలేరని ఇష్టానుసారంగా వ్యవహరించే తీరు నచ్చకనే కార్పొరేటర్లు పార్టీ మారినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సుభాష్ నాయక్,నవీన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాశం బుచ్చియాదవ్,పప్పుల అంజిరెడ్డి,శ్రీకాంత్ గౌడ్, బొడిగే కృష్ణ, ఈశ్వర్ రెడ్డి, దర్గా సుధాకర్ రెడ్డి, చింతల నరసింహ రెడ్డి పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకలో డ్రగ్స్..13 మందిపై కేసు

నవతెలంగాణ- మేడ్చల్

ఓ వ్యక్తి జన్మదిన వేడుకల్లో డ్రగ్స్ సేవిస్తున్న 13 మందిపై కేసులు నమోదు చేసిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల తెలిపిన వివరాలు ప్రకారం మేడ్చల్ పట్టణంలో ఓ వ్యక్తి జన్మదిన వేడుకల్లో డ్రగ్స్ సేవిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు గత బుధవారం సాయంత్రం 7.45గంటల ప్రాంతంలో మేడ్చల్ పోలీసులు దాడులు నిర్వహించి 13మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో (ఏ1)గా ఇండియన్ ప్రొడక్ట్స్, (ఏ2) దినేష్, (ఏ3) విక్కారం గుజ్జర్ , (ఏ4)సుక్కా రామ్ చౌదరి, (ఏ5)చెన్నా రామ్, (ఏ6) జీవ్‌రాజ్ గుర్జర్, (ఏ7) సోహన్ లాల్, (ఏ8) శ్యామ్ సుందర్, (ఏ9) లక్కారామ్, (ఏ10) దినేష్ కుమార్, (ఏ11) నాథూరాం బహదూర్, (ఏ12) సోహన్ లాల్, (ఏ13) పున్నమ్ నాథ్, (ఏ14)గా మోహన్ లాల్ చౌదరిలపై 18 సీఆర్,రెడ్/విత్ 17(ఏ) 27,29 ఎన్ డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అద్దాని సత్యనారాయణ వెల్లడించారు. డ్రగ్స్ కొనుగోలు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ప్లాట్లను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రేయపురి కాలనీ ప్లాట్లను కబ్జా చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. సోమవారం వారు కీసరలో మాట్లాడుతూ.. కుందనపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 137లో 2015 సంవత్సరంలో శ్రేయపురి కాలనీ లే అవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేశామని తెలిపారు. ఇందులో పలువురు ఇండ్లు నిర్మించుకు న్నారని, మరి కొందరు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి ఎల్ఆర్ఎస్ అనుమతులు పొందారని పేర్కొన్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు మా ప్లాట్లలోకి చొరబడి కబ్జాకు యత్నిస్తున్నారని వాపోయారు. ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగి చంపుతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులను ఆశ్రయించిన ఫలితం లేకుండా పోయిందన్నారు.తమ ఆస్తులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ సమావేశంలో బాధితులు జి. రాజశేఖర్, కె.వెంకటేశ్వర్ రావు, సంజీవరెడ్డి, శంకర్, శ్రీకాంత్, ప్రవీణ్, ఆంజనే యులు, రామకృష్ణ ఉన్నారు.

ఘనంగా కామల్ల ఐలన్న జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-మల్కాజిగిరి

బీసీ కులాల ఐక్య వేదిక అధ్యక్షుడు కామల్ల ఐలన్న జన్మదిన వేడుకను భరత్ నగర్ చౌరస్తా పెద్దమ్మ గుడి ముందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలన్నకు నాయకులు, అభిమానులు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నర్సింహా గౌడ్, చంద్రశేఖర్ రావు, రమేష్ గౌడ్, గోపి, కార్యదర్శులు శ్రీనివాస్, నాగరాజు, రాంమోహన్, శ్రీను, భాస్కర్, నాగేష్, నవీన్ గౌడ్, బాపూజీ, సంతోష్ కుమార్, మల్కాజిగిరి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సాంబరాజు , కృష్ణ, భిక్షపతి, పరందాములు తదితరులున్నారు.

స్వీట్ షాప్‌ను ప్రారంభించిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిజాంపేట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ శ్యామ్ స్వీట్ షాప్‌ను సోమవారం డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం డిప్యూటీ మేయర్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్ రెడ్డి, యజమానులు వికాస్ పరిహార్ వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

15 వరకు మొదటి దశ పీహెచ్‌డీ అడ్మిషన్ల గడువు

నవతెలంగాణ-సిటీబ్యూరో

అమత విశ్వ విద్యాపీఠం యూనివర్సిటీ ఈ నెల 15వ తేదీతో మొదటి దశ పీహెచ్‌డీ అడ్మిషన్లని ముగిస్తున్నట్టు ప్రకటించింది. ఈ విశ్వవిద్యాలయం ఏటా 7 కోట్లకు పైగా స్కాలర్షిప్‌లను ప్రత్యేకంగా పీహెచ్‌డీ స్కాలర్స్, అసాధారణమైన ప్రతిభను పెంపొందించడం, అకాడమిక్ ఎక్సలెన్స్‌ను ప్రోత్సహించడం, మొదటి మూడేండ్లలో ఫుల్ టైం స్కాలర్స్‌కు నెలకు రూ.35వేల వరకు గ్యారంటీ స్కాలర్షిప్‌లతో సహా ప్రదానం చేస్తుంది. ఈ స్కాలర్షిప్ లతో పాటు, ప్రతిష్టాత్మక సమావేశాలకు హాజరు కావడానికి, పీర్-రివ్యూడ్ జర్నల్స్‌లో ప్రచురించడానికి స్కాలర్లు ఆర్థిక సహాయాన్ని పొందుతారు. అమత క్యాంపస్‌లలోని అన్ని రీసెర్చ్ ల్యాబ్‌లలో ఎలాంటి ఖర్చు లేకుండా ప్రయోగాల సౌకర్యాల నుంచి కూడా వారు ప్రయోజనం పొందుతారు.

వజ్రం కంటే విలువైనది పుస్తకం



- ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వజ్రం కంటే విలువైనది పుస్తకమని, గ్రంథాలయం మేధస్సును పెంచే భాండాగారమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి షిర్డీ హిల్స్ చౌరస్తా ప్రాంతంలోనూతంగా ఏర్పాటు చేసిన డా.బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ గ్రంథాలయ నిర్మాణ దాత, శ్రీ సాయి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంక్షేమ సంఘం అధ్యక్షులు చుండూరు దాసు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'గ్రంథాలయాన్ని' స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, సీపీఐ రాష్ట్ర నాయకులు కే.ఏసురత్నంలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మనిషి దైనందిక జీవితంలో మానసిక ప్రశాంతతను పొందేందుకు మంచి పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రంథాలయాలు లేకపోవడం వల్ల యువతతో పాటు విద్యార్థులు, చరవాణిలకు అలవాటు పడి మానసిక ఒత్తిడిలకు గురవుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఇటువంటి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, కార్పొరేటర్ కొలుకుల జగన్‌లు అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర దేవస్థానం చైర్మెన్ వేణు యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, యూత్ నాయకులు కొలుకుల జైహింద్, మహిళా అధ్యక్షురాలు బింగి ఇందిరా గౌడ్, నాయకులు ఎత్తారి మారయ్య, బ్రహ్మానంద చారి, చర్లపల్లి రాములు, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

లింకు రోడ్ల ద్వారా ట్రాఫిక్ సమస్య పరిష్కారం..

లింకు రోడ్ల ద్వారా ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ సూచించారు. సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి భూదేవి హిల్స్‌లో స్థానిక కార్పొరేటర్లు కొలుకుల జగన్ వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు భూదేవి హిల్స్ హై టెన్షన్ లైన్ మీదుగా నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. అదేవిధంగా భూదేవి హిల్స్, లెనిన్ నగర్‌లలో మిగిలి పోయిన అండర్ గ్రౌండ్ పనులు, విద్యుత్ లైన్ మరమ్మత్తు పనులను చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందించి మాట్లాడుతూ జగద్గిరిగుట్ట ప్రజలకు భూదేవి హిల్స్ మీదుగా నూతన రోడ్డు నిర్మాణం చేపడితే కూకట్‌పల్లికి వెళ్లే రహదారిపై ట్రాఫిక్ రద్దీని తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అధికారులు వెంటనే వ్యయ ప్రణాళికలు రూపొందించి వీలైనంత త్వరగా పనులను చేపట్టి ప్రజలకు వినియోగంలోకి తీసుకురవాలన్నారు. కాలనీలోనీ విద్యుత్ లైన్ మరమ్మత్తు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చైర్మెన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, యూత్ నాయకులు కొలుకుల జైహింద్, సీనియర్ నాయకులు ఎత్తరి మారయ్య, పెర్తి విఠల్ ముదిరాజ్, కృష్ణ, సోమయ్య,కె.వి.రాజు, అయోధ్య తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.



'లోజెన్ బేకరీ' ని ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ..

కుత్బుల్లాపూర్: 132 - జీడిమెట్ల డివిజన్ సుచిత్ర చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన 'లోజెన్ బేకరీ' ని కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సరికొత్త రుచులను వినియోగదారులకు అందిస్తూ.. వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి మధుసూదన్ రాజు, జ్ఞానేశ్వర్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, కాలే నాగేష్, విజయ్ హరీష్, కాలే గణేష్ తదితరులు పాల్గొన్నారు.



వర్షాకాలం దృష్ట్యా చర్యలు తీసుకోవాలి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వర్షాకాలం దృష్ట్యా ప్రజలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం బేగంపేట్ డివిజన్‌లోని తాతాచారి కాలనీ కమ్యూనిటీ హాల్, ఎరుకల బస్తీ కమ్యూనిటీ హాల్, అంబేద్కర్ నగర్ కమ్యూనిటీ హాల్స్‌లను కూకట్‌పల్లి ఎమ్మెల్యే, కార్పొరేటర్ మహేశ్వరీ శ్రీహరిలతో కలసి పరిశీలించారు. అనంతరం బేగంపేట్ డివిజన్‌లోని అసోసియేషన్స్, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదులపై ఎమ్మెల్యే స్పందించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్స్ పనులు పూర్తి కాలేదు అని, పనులన్నీ త్వరగా పూర్తీ చేయాలన్నారు. కమ్యూనిటీ హాల్స్ పనులు పూర్తి చేసి అసోసియేషన్స్ వారికి అధీనం చేయాలనీ జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆదేశించారు. మాతాజీనగర్‌లోని డ్రయినేజీ, రోడ్లు పనులు కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. శంకుస్థాపనలు చేసిన పనులను జాప్యం జరగకుండా సత్వరమే పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించడానికి కావాల్సిన నిధులను తీసుకొస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సురేష్ యాదవ్, జీహెచ్‌ఎంసీ అధికారులు వాటర్ వర్క్ అధికారులు ఎలక్ట్రికల్ అధికారులు, నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్ రావుకు విద్యార్థి నాయకులు వినతి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బీబీఏ (డాటా అనలిస్ట్) బీబీఏ (జనరల్) కోర్సులలో టాపర్గా నిలిచిన విద్యార్థులకు బంగారు పథకాలు ఇవ్వాలని సోమవారం జేఎన్‌టీయూహెచ్ విద్యార్థులు, జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ రావుని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్, చిలుకూరి శివ కృష్ణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసినటువంటి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్‌లో ప్రారంభించారు. బీబీఏ (డాటా అనలిస్ట్) బీబీఏ (జనరల్) కోర్సులలో మొదటి బ్యాచ్ రానున్న విద్యాసంవత్సరంతో పూర్తి అవుతుందని కావున విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఆ రెండు కోర్సుల్లోని టాపర్ విద్యార్థులకు, విశ్వవిద్యాలయ నియమ నిబధనలకు లోబడి బంగారు పతకాలు అందజేయాలన్నారు. వెంటనే అందుకు సంబంధించిన బంగారు పథకాల దాతల కోరకు, ప్రభుత్వ అనుమతుల కోరకు తగిన ఏర్పాట్లు ముందస్తుగానే చేయలన్నారు. అదే విధంగా బంగారు పతకాలను ఇచ్చి ప్రోత్సహిం చడం కారణంగా రానున్న విద్యాసంవత్సరంలో ప్రవేశం పొందే విద్యార్థులు సైతం బంగారు పతకాలను సాధించిన విద్యార్థులకు చూసి స్ఫూర్తిని పొందగలరని అన్నారు. సానుకూలంగా స్పందించిన రిజిస్ట్రార్ వెంకటే శ్వర్ రావు, ప్రిన్సిపాల్ సింధులు అందుకు సంబంధించిన దాతలకై ఏర్పాట్లు చేస్తున్నామని, తప్పకుండా బీబీఏ (డాటా అనలిస్ట్) బీబీఏ (జనరల్) కోర్సులలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలతో సత్కరిం చే ఏర్పాట్లు ముమ్మరం చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థి నాయకులు వంశీకిరణ్, చంద్ర శేఖర్, కళ్యాణ్, కిరణ్, జవ్వాజి దిలీప్ కిరణ్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలో దోపిడి అరికట్టాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.కార్తీక్,రాథోడ్ సంతోష్ డిమాండ్



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లిలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో సోమ వారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల దోపిడి దందాను ఆపా లన్నారు. ప్రభుత్వం కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయవసిన సీట్లు చేయకముందే ప్రయివేట్ ఇంజినీరింగ్ కళాశాలల 6 లక్షల నుంచి 15 లక్షల వరకు డొనేషన్ రూపంలో దోపిడీ చేస్తున్న ఇంజినీరింగ్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ ఆదేశాలు రాకుండా ఇంజినీరింగ్ కళాశాలలో మేనేజ్‌మెంట్ కోట పేరుతో సీట్లు భర్తీ చేస్తూ ఇంజినీరింగ్ విద్యను వ్యాపారంగా మార్చేశారన్నారు. డొనేషన్ల రూపం లో ఇంజినీరింగ్ కళాశాల యజమాన్యం పేద, బడుగు, బలహీన విద్యార్థుల దగ్గరనుండి లక్షలాది రూపాయలను దండుకుంటున్న జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీపై చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఇంజినీరింగ్ కళాశాలలో అనేక సమస్యలు వెలువెత్తుతున్నా యజమా న్యం మాత్రం విద్యార్థుల సమస్యల్ని పరిష్కరించకుండా డబ్బులు దండుకుంటు న్నాయని ఆరోపించారు. కళాశాలలో ల్యాబ్‌లు కూడా సరిగ్గా లేని కళాశాలలో అనేకంగా ఉన్నాయని పేరొన్నారు. పేద బడుగు బలహీన విద్యార్థుల సర్టిఫికెట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉంటే పూర్తి ఫీజులు కట్టి తీసుకోవాలనే నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. జేఎన్‌టీయూహెచ్ అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రయవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల సమస్యల్ని పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, రాథోడ్ సంతోష్‌లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సుబ్బు, రఘు, దినేష్, నితేష్, చందు, నిఖిల్, శివ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరినగర్ అంటే చిన్నచూపు ఎందుకు..!



- ముందుకు సాగని అభివృద్ధి పనులు
- గిరినగర్‌లోని విధిని పరిశీలించిన సీపీఐ నేతలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు ఉదాసీనత గిరినగర్ ప్రజల పాలిట శాపంగా మారింది. గ్రేటర్‌లో ఉన్నామా.. లేక గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నామా..అని ఆ ప్రాంతవాసులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో అభివృద్ధి ధ్యేయం, మీ సంక్షేమ లక్ష్యం అంటూ నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి వెళ్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్ బస్తీలో చెడిపోయిన రోడ్లు ప్రతిఒక్కరికి స్వాగతం పలుకుతున్నాయని అట్టి రోడ్ల స్థానంలో కొత్తవి వేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు, బస్తీ సీపీఐ నాయకులు వంగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో.. పార్టీ నేతలతో కలిసి సోమవారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్ నర్సింలుకు బస్తీ ప్రజలతో కలసి ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం గిరినగర్‌లోని పలు వీధులలో పర్యటించారు. భూగర్భ డ్రయినేజీ పైపులైను వేసి నెలలు గడుస్తున్న రోడ్లు వేయకపోవడం వలన గుంతలు ఏర్పడి పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ విషయమై ఎన్నోసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోలేదని డీసీకి తెలిపారు. వర్షాకాలంలో రోడ్లన్నీ మురికి నీటితో చెరువులను తలపిస్తున్నాయని సీజనల్ అంటువ్యాధులు, ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు. ప్రధాన రహదారి బురద మయంగా మారడంతో ఆ రోడ్డుపై పాదచారులు, వాహనదారులు పాఠశాలలకు వెళ్లే పిల్లలు నడవడానికి నరకయాతన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించని పక్షంలో జోనల్ కమిషనర్ కార్యాలయం ముందు సీపీఐ స్థానికులతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో సీనియర్ సీపీఐ నాయకులు డి.యాదగిరి, బాల నరసయ్య, స్థానికులు నరేందర్, శ్రీనివాస్, ఎల్లుబాయి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు బస్ పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలి



- డిపో మేనేజర్‌కు సీపీఐ కార్యదర్శి జి. కృష్ణ వినతి

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం మండల పరిధిలోని ప్రశాంత్ నగర్‌లో ప్రయాణ ప్రాంగణంలో వికలాంగులకు బస్ పాస్ కౌంటర్ లేకపోవడం వల్ల పలువురు వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారని కూకట్‌పల్లి సీపీఐ కమీటి కార్యదర్శి జి. కృష్ణ కూకట్‌పల్లి డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత్ నగర్ పరిధిలోని వికలాంగులు బస్సు పాసుల రెన్యూవల్ కోసం సికింద్రాబాద్, కోఠి వంటి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రధానంగా కూకట్‌పల్లి నుంచి తెలంగాణ పుణ్యక్షేత్రమైన యాదాద్రికి బస్ సర్వీసులను నడపాలని కోరారు. అదేవిధంగా జగద్గిరిగుట్ట, బోరబండ వంటి ఇతర ప్రాంతాల నుంచి నడుపుతున్న బస్ సర్వీసులను, ప్రశాంత్ నగర్‌కు సర్వీసులను కూకట్‌పల్లి డిపో వరకు నడపాలని సీపీఐ కమిటీ నాయకులు కృష్ణ కోరారు.

పురాతన కమిటీ హాల్ స్థానంలోనే.. నూతనంగా పునర్నిర్మించారు



- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్‌లో కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ సోమవారం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల ఆహ్వానం మేరకు గౌతమ్ నగర్‌లో సమస్యలపై పర్యటించారు. ఈ సందర్భంగా సతీష్ గౌడ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పురాతనంగా ఉన్న కమ్యూనిటీ హాల్‌ను దాని స్థానంలో నూతన కమిటీ హాల్ నిర్మించాలని, స్థానిక వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు కార్పొరేటర్‌ను కోరారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులను పిలిపించి, అంచనాలు తయారు చేయించి నిధులు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. అదేవిధంగా డివిజన్ పరిధిలోని బస్తీలు, కాలనీలలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని విధాలా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ దేవాలయ కమిటీ, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిసార్ ఆటపాట సజీవంగానే ఉంటాయి



- ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్
- ప్రజాకళలను ముందు తరాలకు అందించటమే నిసార్‌కు నిజమైన నివాళి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజా వాగ్గేయకారులు, ప్రముఖ కవి కీర్తిశేషులు నిసార్ ఆటపాట సజీవంగానే ఉంటాయని ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్ అన్నారు. సోమవారం నిసార్ 4 వ వర్ధంతి సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్, మగ్దూం నగర్‌లోని ఆరుట్ల రామ చంద్రారెడ్డి భవన్ సీపీఐ కార్యాలయంలో వేడుకలు ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఆకుబత్ని ప్రవీణ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రజానాట్యమండలి అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, శాంతి సంఘం నాయకులు కిషన్ రావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు బైరాగి మోహన్,రాష్ట్ర సీపీఐ నాయకులు కే.ఏసురత్నాం, సీపీఐ మండల కార్యదర్శి ఈ.ఉమా మహేష్, తెలంగాణ ఉద్యమ కళాకారుడు మాపల్లె శంకర్,లు స్థానిక నాయకులు సయ్యద్ రషీద్‌లు హాజరై నిసార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నిసార్ నేడు మన మధ్యలో లేక పోయినా వారి సాహిత్యం ఎల్లవేళలా మనకు దిక్సూచిలా వుంటుందని పునరుద్ఘాటించారు. నిసార్ ఒక నిస్వార్థ ప్రజాసమస్యలపై తన కలాన్ని ఎక్కుపెట్టిన కవి, సమాజంలో ప్రతి ఒక్క వృత్తిలో ఉన్న సమస్యలను తన కలం ద్వారా తెలిపిన ఒక సర్వసాధారణ మైన భాషలో ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే విధంగా పాడిన గొప్ప వాగ్గేయ కారుడు అని కొనియాడారు. నిసార్ తలచిన కులమత విద్వేషాలు లేని, దేశమిదొక దేశం యుద్ధం చేయని, ప్రజల ఆస్తులను రక్షణ ఉండాలని,ప్రపంచ శాంతికి నిరతంరం పయనించిన తన కాలానికి,గళానికి నిజమైన నివాళి ఇవ్వాలంటే వారి ఆశయాలను ముందు తరాలకు అందించటమే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదశి ప్రమీల, మండల కార్యదర్శి భాస్కర్, కృష్ణ, క్రాంతి కళా బృందం అధ్యక్షులు వెంకటాచారి, సీపీఐ నాయకులు చర్లపల్లి రాములు, బాబు, తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

సంక్షేమ సంఘాలు అభివృద్ధికి వారధులు

- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సంక్షేమ సంఘ సభ్యులు అభివృద్ధికి వారధులుగా నిలవాలని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్,గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి సూచించారు. చింతల్ డివిజన్ న్యూ లాల్ బహదూర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజల సహకారంతో అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. తన వంతు సహాయ సహకారాలు అందజేస్తారని చెప్పారు. కోర్ కమిటీ సభ్యులు బ్రహ్మం, నరసయ్య, జగన్ గౌడ్‌లు ఎన్నికైన సభ్యులచే స్థానికంగా ఉన్న ఎల్లమ్మ పోచమ్మ దేవాలయంలో సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షులుగా ఆకుల ప్రభాకర్ గుప్తా, ప్రధాన



కార్యదర్శిగా శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా బాలస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా జమ్ముల తులసి రామ్, ఉపాధ్యక్షులుగా జి. రమేష్, గడ్డమీది భరత్ కుమార్ కురువ, ఉమాశంకర్, అనిల్ కుమార్ షిండే, సంయుక్త కోశాధికారిగా పవన్ కుమార్ కార్యవర్గ సభ్యులుగా యాదవ రెడ్డి, నరసింహ, సుధాకర్ రెడ్డి సాయిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు పాల్గొన్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- ప్రజావాణికి 124 దరఖాస్తులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ మేరకు 124 దరఖాస్తులు వచ్చినట్టు కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా అధికారుల తో మాట్లాడుతూ జిల్లాలో వనమహోత్సవం కింద అధికారులు వారికి నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటడాన్ని పూర్తి చేయాలన్నారు. రూరల్, గ్రామపంచాయతీలలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటే కార్యక్రమం అధికారులు చేపట్టాలన్నారు. జిల్లా కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో బయోమెట్రిక్ విధానాన్ని త్వరలో అమలు చేస్తున్నామని తెలిపారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
మంగళవారం | జులై 09, 2024 | www.navatelangana.com

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

మారేడ్‌పల్లి మండలం పరిధిలోని లబ్దిదారులకు సోమవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ కల్యాణలక్ష్మి షాది ముబారక్ చెక్కులను మారేడ్‌పల్లి మండల్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం పేదల కోసం ఇంకా ఎన్నో సంక్షేమాలు తీసుకువచ్చే దిశగా ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తున్నదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంతోష్ యాదవ్, ఇన్‌చార్జ్ తాసిల్దార్ అశోక్ కుమార్, డిప్యూటీ తాసిల్దారు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు డిప్యూటీ మేయర్ నివాళ్లు



నవతెలంగాణ-ఓయూ

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజ శేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో వారి చిత్రపటానికి డిప్యూటి మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ నేత మోతె శోభన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వారు చేసిన విశిష్ఠ సేవలు స్మరించుకున్నారు.

వైఎస్ఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి నివాళ్లు



నవతెలంగాణ-బంజారా హిల్స్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్సార్ జయంతి సందర్భంగా సోమవారం పంజాగుట్ట సెంట్రల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీఎం రేవంత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీకి ప్రజలకూ వారు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీ లు, నాయకులు వైఎస్ఆర్ చేసిన సంక్షేమాన్ని గుర్తు చేసుకొని అమలు చేస్తున్నారని తెలిపారు. ఆరు గ్యారెంటీలకు స్ఫూర్తి వైఎస్ఆర్ ఆనాడు అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలే అన్నారు. మూసీ, మెట్రో రైల్, గోదావరి కృష్ణా జలాలు, హైదరాబాద్ లో పెట్టుబడులుకు కూడా వైఎస్సే స్ఫూర్తి అన్నారు. 2009 లో రెండోసారి సీఎం అయ్యాక రాహుల్ గాంధీని ప్రధాని చేయాలని వైఎస్ చెప్పిన మాటలు గుర్తున్నాయన్నారు. వైఎస్ స్ఫూర్తితో దేశంలో కాంగ్రెస్ కార్యకర్తలంతా కొట్లాడి రాహుల్‌ను ప్రధాని చేయాలన్నారు. వైఎస్ ఆనాడు చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు చేసిన పాదయాత్ర నే భారత్ జోడో యాత్రకు స్ఫూర్తి అన్నారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా రాణిస్తుంటే దేశ ప్రధాని పదవికి ఆయన ఒక అడుగు దూరంలో ఉన్నాడనిపిస్తోందన్నారు.

రాహుల్ ప్రధాని అయితేనే దేశం అభివృద్ధి చెందుతుందని.. వైఎస్ 75 వ జయంతి సందర్భంగా ఆయన అభిమానులు రాహుల్ ప్రధాని కావాలన్న ప్రతిజ్ఞ తీసుకోవాలన్నారు. దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కావాల్సిన అవసరం ప్రస్తుతం ఎంతో అవసరమని.. ప్రధాని చేయడానికి ఎవరైతే పూనుకుంటారో వారే నిజమైన వైఎస్ఆర్ అభిమానులన్నారు. వైఎస్ అభిమానులంతా కాంగ్రెస్ లోకి రావాలని పిలుపునిచ్చారు. 2021 జూలై 7 న పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్నానని మూడేండ్లలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని పార్టీని అధికారంలోకి తెచ్చుమన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి పనిచేసిన 35 మంది నాయకులకు నామినేటెడ్ పదవులు ఇచ్చామని తెలిపారు. ఎలాంటి పైరవీలు లేకుండా పార్టీ కోసం పని చేసిన, త్యాగం చేసిన వారికి పదవులు ఇస్తామని, కష్టపడిన కార్యకర్తలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. కార్యకర్తలను కాపాడుకున్నపుడే పార్టీ బలంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,పొన్నం ప్రభాకర్, ఖైరతాబాద్ ఎమ్మె ల్యే దానం నాగేందర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్లు వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, సీఎన్ రెడ్డి స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు 'హైదరాబాద్' వేదిక కావాలి

- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
- **ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై సమావేశం**



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన ఆవిష్కరణలకు హైదరాబాద్ జిల్లా వేదిక కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మీ ఆవిష్కరణ ప్రదర్శించే నూతన ఆవిష్కరణల కోసం ప్రతి ఒక్కరూ ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. విద్యాశాఖ అధికారులతో పాటు పలు శాఖల అధికారులు పాఠశాలలతో పాటు గ్రామాల్లో ఈ కార్యక్రమం పై విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రస్తుత సంవత్సరంలో జిల్లాలోని గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు ఆవిష్కరణలతో తమ ప్రతిభకు పదును పెట్టే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నదని... ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. గ్రామీణుల ఆవిష్కరణ, విద్యార్థుల ఆవిష్కరణ, వ్యవసాయ రంగ ఆవిష్కరణలు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఆవిష్కరణలతోపాటు తదితర ఆవిష్కరణలను ప్రదర్శిస్తారని తెలిపారు. ఆసక్తి గల వారు ఆవిష్కరణ పేరు, ప్రదర్శనకు గల రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫోటోలు, 100 పదాలతో రాసి తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబర్ 9100678543కు పంపాలని సూచించారు. పేరు, వయస్సు, ఫోటో,వృత్తి,గ్రామం పేరు, జిల్లా పేరుతో వివరాలతో ఆగస్టు 3వ తేదీ లోపు పంపించాలన్నారు. ఈ సందర్భంగా ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు) కదిరివన్, డీఈఓ రోహిణి , డీఎస్ఓ రమేష్,ఈ-డీఎం రజిత, డిపిఆర్ఓ ఎం.ఏ కలీం, ఇంటింటా ఇన్నోవేటర్ జిల్లా రిప్రెసెంటివ్ వినీత్ సిద్దార్థ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ దూరవిద్య పరీక్షలు వాయిదా

నవతెలంగాణ-ఓయూ

ఓయూ దూరవిద్య కేంద్రం పరిధిలో ఈ నెల 10 జరగాల్సిన పరీక్షలు వాయిదా వేసినట్లు డెరైక్టర్ ప్రో.జి.బి.రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎం.ఎ, ఎం.కాం , ఎం.ఎస్సి కోర్సుల్లో మొదటి ,చివరి సంవత్సరం పరీక్షలు వాయిదా వేసినట్లు చెప్పారు. ఇక పరీక్షల మళ్ళీ నిర్వహించనున్న తేదీలో త్వరలోనే ప్రకటించనున్నట్లు చెప్పారు.



తలసాని శంకర్‌కు హర్యానా గవర్నర్ నివాళ్లు

నవతెలంగాణ-బేగంపేట

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్‌కు హర్యానా గవర్నర్ దత్తాత్రేయ నివాళ్లర్పించారు. సోమవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని రాధికా కాలనీలో గల శంకర్ యాదవ్ నివాసానికి గవర్నర్ చేరుకొని శంకర్ యాదవ్ చిత్రపటం వద్ద పూలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. గవర్నర్ వెంట కార్పొరేటర్ దీపిక, బీజేపీ నాయకులు చీర శ్రీకాంత్, శంకర్ యాదవ్, సోదరులు నర్సింగ్ యాదవ్, మహేష్ యాదవ్, ధర్మేందర్ యాదవ్, స్కైలాబ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

రహమత్ నగర్‌లో సీపీఐ(ఎం) బస్తీబాట

- **వెలుగులోకి అనేక సమస్యలు..**



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

సీపీఐ(ఎం) బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా పార్టీ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ నాయకులు సోమవారం రహమత్ నగర్ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి. అంతర్గత సీసీ రోడ్లు, మంచినీరు, డ్రయినేజీ సమస్యలను స్థానిక ప్రజలు సీపీఐ(ఎం) నాయకులకు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రహమత్ నగర్ బస్తీలో హనుమాన్ టెంపుల్ నుంచి బంగారు మైసమ్మ గుడికి వెళ్లే ప్రధాన రహ దారిలో సీసీ రోడ్డు వెంటనే వేయాలని కోరారు. 15 సంవత్సరాల క్రితం వేసిన సీసీ రోడ్డులో ఇప్పుడు గుంతలు పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం డ్రయినేజీ లైన్ వేసి రోడ్డు వేయకుండా నిలిపివేశారన్నారు. బంగారు మైసమ్మ గుడి నుంచి రహమత్ నగర్ ప్రధాన రోడ్డుకు వచ్చే రహదారి లో రోడ్డు సరిగా లేక డ్రయినేజీ పొంగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున వెంటనే సీసీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు . మంచినీరు ప్రెషర్‌గా రావడం లేదని... ఒక కుటుంబంలో 10 బిందెలు కూడా పట్టుకోలేక పోతున్నారన్నారు. ప్రెషర్ పెంచి కనీసం ఒక గంట టైం ఇవ్వాలని వాటర్ వర్క్స్ అధికారులను కోరారు. రహమత్ నగర్ బస్తీలో మంచినీరు ,డ్రయినేజీ, సీసీ రోడ్లు వేయాలని, బస్తీలో అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, ఉచిత విద్యుత్ అమలు చేయాలని, రూ. 500 కే గ్యాస్ కనెక్షన్ సబ్సిడీ అందరికీ ఇవ్వాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇచ్చి వారి పిల్లల పేర్లు చేర్పించాలని, ఆర్టీసీ బస్సులను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్ ,ఎస్ పాపారావు, వెంకటరమణ, పి కృష్ణ ,రవి తదితరులు పాల్గొన్నారు.

బోనాల జాతరకు రూ. 25 కోట్లు మంజూరు చేయండి



- **లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్**

నవతెలంగాణ-బేగంపేట్

బోనాల జాతరకు రూ. 25 కోట్లు మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ కోరిన సంగతి తెలిసిందే. ఈ మేరకు అమ్మవారి ఆలయాలకు తెలంగాణ ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేసింది. లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు పవన్ కుమార్ గౌడ్ సోమవారం మంత్రిని వారి నివాసంలో కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. మిగితా రూ. 5 కోట్లు కూడా మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి సాదం బాలరాజ్ యాదవ్, ఉపాధ్యక్షులు శైలేందర్, సహాయ కార్యదర్శి జగదీష్ గౌడ్ శ్రీకాంత్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ ముదిరాజ్, జగ్గయ్య ఉన్నారు.

ఓయూలో హెచ్‌సీడీసీ శిక్షణ ప్రారంభం



నవతెలంగాణ-ఓయూ

ఇంజినీరింగ్ విభాగాల గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం "క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్" అనే అంశంపై ఓయూలోని 'హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ) ఐదు రోజుల ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఓయూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సహకారంతో జరుగుతున్న ఈ శిక్షణ సోమవారం నుంచి ఓయూ లోని కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం సెమినార్ హాల్(ఓయూసీఈ) లో నిర్వహిస్తున్నారు. జియోకాక్స్ టెక్నాలజీస్ ప్రయివేటు లిమిటెడ్ సీఈఓ సంజీవ్ శ్రీవాత్సవ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలు పూర్తి స్థాయి ప్యాకేజీలతో విద్యార్థులను సులభంగా రిక్రూట్ చేసుకోవడానికి తగిన బ్రాండింగ్‌ను తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం విద్యార్థులు తమ జీవితంలో వివిధ దశలవారీగా అభ్యసన సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఇది వారి జీవితాల్లో ఉన్నతస్థాయికి ఎదగడానికి, మొత్తం సమాజ అభివృద్ధికి ఉపయోగ పడుతుందన్నారు. ఈ లక్ష్యం సాధించడానికి విద్యార్థులు తమను తాము వ్యక్తిగతంగా, వృత్తిపరంగా నిరంతరం ఒక్కోమెట్టు పైకి ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. ఈ శ్రమ వారిని విజయ తీరాలకు చేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీడీసీ ఓయూ డైరెక్టర్ ప్రొఫెసర్ సి.వి. రంజని, హెచ్‌సీడీసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి. మురళీధర్ రెడ్డి, యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ పి.వి. సుధ, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ భారతి, ఇర్ఫాన్ పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మొదటిరోజు న్యూమరికల్ ఎబిలిటీ, ఎనలిటికల్ ఎబిలిటీపై జరిగిన సెషన్‌ను మిస్టర్ హిమాన్షు నిర్వహించారు.



వైభవంగా ఘటాల ఊరేగింపు

- **కటారి గౌరీ శంకర్ ఆధ్వర్యంలో బోనం సమర్పణ**

నవతెలంగాణ-బేగంపేట్

ఈ నెల 21, 22న శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర వైభవంగా జరగనుంది. ఈ నేపథ్యంలో అమ్మవారి ఘటాల ఊరేగింపు వైభవంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఏఐసీసీ సభ్యులు కటారి గౌరీ శంకర్, మహేష్ కుమార్ ల ఆధ్వర్యంలో ఫలహారం బండితో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి వైభవంగా బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కటారి మహేష్ కుమార్, రమణ రాజ్, ప్రవీణ్ యాదవ్, మురళీ మోహన్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విలీనం వల్ల కంటోన్మెంట్‌కు నష్టమే



- **కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె. రామకృష్ణ**

నవతెలంగాణ-కంటోన్మెంట్

జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనం వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువగా ఉందని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె. రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన బోర్డు సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు మూడు కారణాలవల్లే విలీనం అంశం తెరపైకి వచ్చిందని ఆయన గుర్తు చేశారు. కంటోన్మెంట్‌లో మిలిటరీ వారు రోడ్లు మూసివేయడం.. ఏండ్ల తరబడి మురికివాడలో ఉంటున్న ప్రజలకు పట్టాలు రాకపోవడం ప్రధాన కారణలని చెప్పారు. అయితే విలీనం అయితే కేవలం బిల్డింగ్ అనుమతులు తీసుకునే వారికి కొంత బెనిఫిట్ ఉంటుందని ఇంకా ఏ ఇతర విషయాలలో విలీనం వల్ల ప్రజలకు లాభం ఉండదని తెలిపారు విలీనం అనే అంశాన్ని కొంతమంది స్వార్థపరులు రాద్ధతం చేస్తున్నారని అన్నారు. నీళ్లు, నిధులు, అభివృద్ధి పనులు చేపట్టాల్సి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి కంటోన్మెంట్ విలీనం ప్రక్రియను చేపట్టేందుకు పావులు కలుపుతున్నారని చెప్పారు.. సమస్యలు తీర్చకపోగా కంటోన్మెంట్‌కు ఇంకా పెద్ద సమస్యలు రాబోతున్నాయని ఆరోపించారు. కంటోన్మెంట్ విలీనం ప్రస్తుతం ప్రజలకు అవసరం లేదని, 80 శాతం ప్రజలు ఈ నిర్ణయంపై వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఇలాంటి ప్రజావ్యతిరేక నిర్ణయాలు కేవలం సీఎం రేవంత్ రెడ్డి తెరపైకి తేవడం సరైంది కాదన్నారు. అభివద్ధి పనులు చేపట్టకుండా కంటోన్మెంట్ కు నీళ్లు ఇవ్వకుండా ఆ సమస్యలను పక్కదారి మళ్లించేందుకు, కంటోన్మెంట్ భూములను అమ్ముకోవటానికి ఈ నినాదం ఎంచుకున్నారని విమర్శించారు.

కొన్ని సర్వే సంస్థల ద్వారా తాము ప్రజాభిప్రాయ సేకరణ చేసి ఈ విధానానికి అనుగుణంగా ముందుకు పోతామన్నారు. ముఖ్యంగా తాము సమస్యలు తీర్చేందుకు నీళ్లు కనీస అవసరాలు తీర్చేందుకు కంటోన్మెంట్ పాలకమండలి పనిచేస్తుందన్నారు. జీహెచ్ఎంసి మీద ప్రజల్లో మంచి అభిప్రాయం లేదని తెలిపారు ఇప్పటికే కార్పొరేటర్లకు గాని, ఎమ్మెల్యేలకు గానీ అభివృద్ధి పనుల్లో నిధులు మంజూరు చేయక జీహెచ్ఎంసీ చాలా వెనుకబడి ఉందని దాంట్లో విలీనం చేస్తే సమస్యలు తోడవుతాయని అన్నారు. వీలన ఆలోచన విరమించుకోవాలని కోరారు.

ఓల్డ్ బోయిన్‌పల్లిలో వనమహోత్సవం



- **చెత్తను తొలగించి మొక్కలు నాటిన పారిశుధ్య కార్మికులు**

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లో వనమహోత్సవంలో భాగంగా పారిశుధ్య కార్మికులు సోమవారం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు ఎస్.ఎఫ్.ఎ. ఎస్పీ సంపత్ కుమార్, ఎస్.మల్లేష్, జి.రాము, పారిశుధ్య కార్మికులు సమతా నగర్, హస్మత్ పేట చెరువు కట్టపై చెత్తాచెదారాలు తొలగించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమతా నగర్, హస్మత్ పేట చెరువు తదితర ప్రాంతంలో చెత్తను వేసి మురికి కూపంగా మార్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు కావాల్సి వస్తున్నదని చెప్పారు. డెంగ్యూ మలేరియా, తదితర విషజ్వరాలు బారినపడే అవకాశాలు ఉన్నాయని.. కావున చెత్త అక్కడ వేయడంఒ మానుకోవాలని చెప్పారు. కాగా తాము తగిన చర్యలు గతంలో తీసుకున్నామని ఎస్ఎఫ్ఎ సంపత్ కుమార్ తెలిపారు. అయినా ప్రజలు మారక పోవడంతో ఆయా ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని మొక్కలు నాటామని సంపత్ కుమార్, మల్లేష్,రాము తెలిపారు. ప్రజలు చెత్త వేయడానికి వారి ఇంటి వద్దకు వచ్చే ఆటో టిప్పర్స్ ట్రాలీలను ఉపయోగించు కోవాలని విజ్ఞప్తి చేశారు. చెత్త ఎక్కడ పడితే అక్కడ వేసి అనారోగ్యం పాలు కావద్దని,డెంగు, మలేరియా తదితర విషజ్వరాలకు గురికావద్దన్నారు. తాము తమ సిబ్బంది ఎంతో కష్టపడి పరిశుభ్రంగా ఉంచుతున్నామని అందుకు ప్రజలు కూడా సహకరించాలని వారు కోరారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి



కంటోన్మెంట్‌లో వైఎస్ఆర్‌కు నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

దివంగత మాజీ సీఎం వైఎస్సాఆర్ జయంతిని పరిష్కరించుకొని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సోమవారం నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించారు ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలో అలంకరించి, కంటోన్మెంట్‌కు ఆయన చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కంటోన్మెంట్‌లో మహిళలకు రుణాలు ఇప్పించారని, కంటోన్మెంట్ ప్రాంతానికి పావలా వడ్డీ రుణాన్ని పరిచయం చేసింది ఆయనేనన్నారు. పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

ఓయూలో..

ఓయూ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతినిఓయూ రీసెర్చ్ స్కాలర్, కాంగ్రెస్ నాయకులు వలిగొండ నరసింహ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వలిగొండ నరసింహ మాట్లాడుతూ. ముఖ్యమంత్రిగా తన పరిపాలన కాలంలో రైతు రుణమాఫీ, 108 అంబులెన్స్, ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబ ర్స్మెంట్, ఆసరా పింఛన్లు ,ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలతో సంక్షేమ ప్రదాతగా ప్రజలలో చిరస్థాయి మిగిలిపోయారని, వైఎస్సార్ ఆశయమైన రాహుల్ గాంధీ ని ప్రధాని చేసినప్పుడే వైఎస్సార్ ఆత్మకు శాంతి కలుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు పులిగంటి వేణుగోపాల్, పార్థు, కుమార్, అర్జున్, రమణ ,కళ్యాణ్, సుధాకర్, మల్లయ్య సుబ్బారావు పాల్గొన్నారు.

'వైఎస్ఆర్‌కు కంటోన్మెంట్‌తో మంచి సంబంధాలు'

కంటోన్మెంట్ : దివంగత మాజీ సీఎం వై ఎస్ రాజశేఖర్ రెడ్డికి కంటోన్మెంట్ ప్రజలతో ప్రత్యేక అనుబంధం ఉందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు.



పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు అందజేస్తున్న జంపన ప్రతాప్

వై.ఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా సోమవారం బాపూజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కాంగ్రెస్ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్లు, బిస్కెట్‌లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్షణ మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు పరిధిలో మహిళా సంఘాలు ఏర్పాటు, పావలా వడ్డీ రుణాలు వైఎస్సార్ అందజేశారన్నారు. నియోజ కాభివృద్ధికి నిధులు విడుదల చేసారని తెలిపారు. ప్రజల నాయ కుడిగా పేరొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ సిరాజ్, అజిత్ కళ్యాణ్, శ్రీకాంత్, వరప్రసాద్, పాఠశాల హెచ్ ఎం ఆశీర్వాదం, ఉపాధ్యాయులు షెడ్రెక్ తదితరులు



ఓయూలో వైఎస్ఆర్‌కు నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జూలో యానిమల్ కీపర్‌పై సింహం దాడి

- వెంటనే అప్రమత్తమైన సాటి కీపర్..
- చాకచక్యంగా సింహాన్ని అదుపులోకి..



నవతెలంగాణ - ధూల్ పేట్

నెహ్రూ జూలాజికల్ పార్క్ లోని సమ్మర్ హౌస్ ను శుభ్రపరిచే సమయంలో జరిగిన పొరపాటుతో యానిమల్ కీపర్ సింహం చేతిలో గాయపడ్డాడు. ఈ సంఘటన నెహ్రూ జూలాజికల్ పార్కులో సోమవారం చోటుచేసుకుంది. సమ్మర్ హౌస్ లోని జంతువులను వేరే గేజ్ లోకి తరలించి అన్ని జాగ్రత్తలు తీసుకొని ఎంక్లోజర్‌ను శుభ్రం చేయాలి. కానీ ఇక్కడ ఏమరపాటుగా ఉండడంతో ఎంక్లోజర్‌ను శుభ్రం చేస్తున్న యానిమల్ కీపర్ వద్దకు సింహం ఒక్కసారిగా రావడంతో భయంతో పరుగులు తీశాడు. దాంతో సింహం దాడి చేయడంతో అతనికి స్వల్ప గాయాలయ్యాయి, వెంటనే ఇతర యానిమల్ కీపర్లు అప్రమత్తమై సింహాన్ని చాక్యచౌక్యంగా వేరే గేజ్ లోకి తరలించారు. సోమవారం జూ పార్కు సెలవు ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. గాయపడ్డ యానిమల్ కీపర్ ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించామని జూ పార్కు క్యూరేటర్ డాక్టర్ ఎస్ సునీల్ హీరే మత్ తెలిపారు.

గతంలో చింపాంజీ దాడి..

గతంలో నెహ్రూ జులాజికల్ పార్క్ లోని చింపాంజీ ఎంక్లోజర్‌ను శుభ్రపరిచే క్రమంలో వేరే గేజ్ లోకి చింపాంజీని తరలించి గడియ పెట్టకపోవడంతో చింపాంజీ యానిమల్ కీపర్ పై దాడి చేసింది, ఇతర యానిమల్ కీపర్‌లు వెంటనే అప్రమత్తమై అరవడంతో కొంతసేపు తర్వాత చింపాంజీని ఎంక్లోజర్‌కు గడియాపెట్టి యానిమల్ కీపర్ ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు

'స్కిల్ యూనివర్సిటీ' పై సీఎం సమీక్ష

- గచ్చిబౌలిలోని ఇఎస్‌సీఐని సందర్శించిన రాష్ట్ర ముఖ్యమంత్రి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇఎస్‌సీఐలో అందిస్తున్న వివిధ కోర్సులు విద్యార్థుల భవిష్యత్తులో ఎంతో ప్రయోజకరంగా ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం గచ్చిబౌలీలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఇఎస్‌సీఐ)ని ఆయన సందర్శించారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయ తలపెట్టిన స్కిల్ యూనివర్సిటీ అంశం పై పారిశ్రామిక ప్రముఖులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఇఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ జీ. రామేశ్వ రరావు నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ ను పరిశీలించారు. కాలేజీలో అందిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ తోపాటు వివిధ కోర్సుల ను పరిశీలించారు. కాలేజీ ఆవర ణాన్ని పరిశీలించి రాబోవు రోజుల్లో మరిన్ని కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు నైపుణ్యతతోపాటు, ఉపాధి అవకాశాలు లభించే విధంగా కోర్సులను అందించాలన్నారు. ఈ





కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, జేయేష్ రంజన్, బూర వెంకటేశంతోపాటు ఆ కాలేజీ డైరెక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





యుద్ధ ప్రాతిపదికన ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రజావాణిలో 145 దరఖాస్తులు స్వీకరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి, ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను యుద్ధ ప్రాతిపాదికన పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 145 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి, ప్రజా దర్బార్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 145అర్జీలు రాగా గృహ నిర్మాణ శాఖకు 93,హైదరాబాద్ పెన్షన్ 11 , ఇతర శాఖలకు సంబంధించినవి 41దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు ఆర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కదిరివన్, అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటా చారి, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, జిల్లా అధికారులు,తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌పై దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాలి

- హెచ్‌యూజే

నవతెలంగాణ-సిటీబ్యూరో

వి6 వెలుగు స్పోర్ట్స్ రిపోర్టర్ కృష్ణారెడ్డిపై జరిగిన దాడిని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్) తీవ్రంగా ఖండించింది. మద్యం తాగి వాహనం నడుపుతూ, అన్యాయంగా కృష్ణారెడ్డి పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని హెచ్‌యూజే ప్రెసిడెంట్ అరుణ్‌కుమార్, సెక్రటరీ బి.జగదీశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్న కృష్ణారెడ్డిపై, కంటోన్మెంట్ బీజేపీ లీడర్ బానుక నర్మద మల్లికార్జున్ కొడుకు సూరజ్, అతని స్నేహితుడు దాడి చేశారని తెలిపారు. సైడ్ ఇవ్వలేదన్న సాకుతో కృష్ణారెడ్డిపై దాడి చేశారని, ఆ సమయంలో దుండగులు మద్యం సేవించి ఉన్నారని చెప్పారు. ఈ విషయంపై శనివారం ఉదయం 11 గంటలకు స్టేషన్‌లో కృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారని వారు వివరించారు. నిందితుడికి రాజకీయ నేపథ్యం ఉండడంతో, ఇప్పటివరకూ వారిపై పోలీసులు కేసు(ఎఫ్ఐఆర్) బుక్ చేయలేదన్నారు. కనీసం స్టేషన్‌కు పిలిపించి మాట్లాడలేదని.. నిందితులపై వెంటనే అటెంప్ట్ టు మర్డర్ కేసు, తాగి వాహనం నడిపినందుకు సంబంధిత సెక్షన్ల కింద మరో కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ బుక్ చేయాలని డిమాండ్ చేశారు

మ్యూజిక్‌పై యువత మక్కువ

- ప్రముఖ దర్శక నిర్మాత మారుతి..

నవతెలంగాణ-బంజారా హిల్స్



ప్రస్తుతం యువత మ్యూజిక్ మక్కువ చూపుతున్నారని ప్రముఖ దర్శక నిర్మాత మారుతి అన్నారు. బంజారా హిల్స్ లోని ప్రసాద్ ల్యాబ్ లో జామ్ జంక్షన్ పక్కా రీజనల్ కార్యక్రమం పోస్టర్ ను ఆయన సినీ నిర్మాత ఎస్ కె ఎన్‌తో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. నగరంలో ప్రసిద్ధిగాంచిన మ్యూజికల్ బ్యాండ్స్‌ను ప్రోత్సహించేందుకు ఓ జామ్ జంక్షన్ పక్కా రీజనల్ పేరుతో ఓ ఉత్సాహభరిత పోటీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారుతి టీం ఆర్ట్స్ శ్రీ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. నగరం లో ప్రస్తుతం మ్యూజికల్ బ్యాండ్ ట్రెండ్ కొనసాగుతుందని ఈ కార్యక్రమంలో ఏ మ్యూజికల్ బ్యాండ్ జరుగుతుందో తెలుసుకొని చాలామంది అక్కడికి వెళుతున్నారని తెలిపారు. అలాంటివారిని మరింత ప్రోత్సహించేందుకు ఓ మంచి పోటీ పెడితే బాగుంటుందని ఆలోచనతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం సెప్టెంబర్ 6వ తేదీన హైటెక్స్ లో జరగనుందని చెప్పారు. ఈ పోటీలో నగరంలోని ప్రధాన బ్యాండ్‌లు పాల్గొంటారని వెల్లడించారు. ఇండియాలోని తొలిసారిగా రీజినల్ మ్యూజికల్ బ్యాండ్ పోటీలు స్థానిక భాషల్లో నిర్వహిస్తున్నామని త్వరలోనే ఇతర భాషల్లో కూడా వీటిని నిర్వహిస్తామన్నారు. కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేసేందుకు ఇది మంచి వేదికని అన్నారు. దర్శకుడు అనిల్ కుమార్, శ్రీ ఈవెంట్ ఫౌండర్ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
మంగళవారం | జూలై 09, 2024 | www.navatelangana.com

బోనాల సంబరం..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ ప్రాంత కమిటీ ఆధ్వర్యంలో పీఎస్ఎం ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో ఆషాడ మాస బోనాల సంబరాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి మహిళలు పూజలు చేశారు. ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ అరుణ, డాక్టర్ కీర్తన, భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ ప్రాంత సీనియర్ సభ్యులు అశ్విని సుబ్బారావు, సీహెచ్.హనుమంతరావు, కేఎస్ విఆర్ ప్రసాద్, సృజన ,ప్రభా, నరేంద్ర కృష్ణ, రాజేశ్వరరావు, ప్రాంత అధ్యక్షులు సతీష్ గౌడ్, కార్యదర్శి డి.నాగరాజు, కల్పన, సదాశివారెడ్డి సుమతి మాధవి, అంబిక వెన్నెల లలిత తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు మహేష్ యాదవ్ తదితర నాయకులు నవతెలంగాణ-అంబర్‌పేట

మొక్కలు నాటుదాం, పర్యావరణాన్ని కాపాడుదాం

● హృదయం ఫౌండేషన్ చైర్మెన్ అమ్ముల మధుకర్ యాదవ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదామని హృదయం ఫౌండేషన్ చైర్మెన్ అమ్ముల మధుకర్ యాదవ్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని కేబీఆర్ జాతీయ ఉద్యానవనం పార్క్‌లో ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో ఫౌండర్ చైర్మెన్ అమ్ముల మధుకర్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్క పౌరుడు తెలంగాణ రాష్ట్రంలో సామాజిక బాధ్యత సామాజిక స్పృహతో బ్రతకాలన్నారు. హృదయం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత ఐదు సంవత్సరాలుగా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ హృదయం ఫౌండేషన్ తెలుగు రాష్ట్రాలలో ఈ వర్షాకాలంలో వివిధ రకాల ఔషధ మొక్కలను పండ్ల మొక్కలను నాటడం మూలంగా రోజురోజుకు పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలకు ముఖ్యంగా కాలుష్యానికి విరుగుడు మొక్కలు నాటడం ఒకటే సరైన పరిష్కారం మార్గం. హృదయం ఫౌండేషన్ ప్రకృతి పరిరక్షణ కోసం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రకృతి హృదయం తోటే ప్రతి ఒక్కరిని భాగస్వామ లను చేస్తూ వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్ర మంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముఖ్యంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు పర్యావరణ ప్రేమికుడు పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడుతున్న వారు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హృదయం ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు సాయిచరణ్ తేజ రెడ్డి, సృజన్ తేజ, అనుదీప్, ప్రీథ్వీ, సాయి చంద్ర, సిద్ధూ, తేజ పాల్గొని మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు.

జాబితా రెడీ..





● ఈ నెల చివరికల్లా...
1500 మందికి పైగా బదిలీకి ఛాన్స్
● దీర్ఘకాలికంగా పనిచేస్తున్న అధికారులకు స్థానచలనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అధికారుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జలమండలిలో బదిలీలకు రంగం సిద్ధమైనట్టు తెలిసింది. మున్సిపల్ శాఖలో కీలకమైన జలమండలిలో ఈ నెల చివరికల్లా సివరేజ్, వాటర్ సప్లయింగ్, ఫీల్డ్ వర్క్ అన్ని విభాగాలల్లో 40శాతం మంది ఉద్యోగులు బదిలీ కానున్నారు. ముఖ్యంగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితోపాటు నాలుగేండ్లకు పైబడిన వారిని బదిలీ చేయనున్నారు. ఇప్పటికే బదిలీల జాబితాను తయారు చేసిన జలమండలి అడ్మిన్ విభాగం ఆ జాబితాను ఏండీకి పంపించినట్టు తెలిసింది. ఏండీ నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే 15, 20రోజులల్లో బదిలీలు కానున్నాయి.

1500 మందికి పైగా ఉద్యోగుల బదిలీ

జలమండలిలో అకౌంట్స్, ఫైనాన్స్, ఫీల్డ్ స్టాఫ్, సివరేజ్, ఇంజనీరింగ్, క్లర్కల్‌తోపాటు వివిధ విభాగాలల్లో 3,800 మందికిపైగా రెగ్యులర్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారితోపాటు దాదాపు 4,500 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగుల్లో 40శాతం బదిలీకానున్నాయి. ఈ క్రమంలో దాదాపు 1500 మందికిపైగా ఉద్యోగులు బదిలీకానున్నారు. ఇదిలావుండగా ఉద్యోగుల్లో దీర్ఘకాలిక వ్యాధులు, రోగాలతో బాధపడుతున్న వారికి మాత్రం మినహాయింపు లభించనుంది. ముఖ్యంగా హార్ట్, న్యూరో, కిడ్నీ సమస్యలతోపాటు టీబీ, డయాలసిస్ పేషెంట్లతోపాటు దీర్ఘకాలిక వాధ్యులు, ఇతర సమస్యలున్న వారికి బదిలీల నుంచి మినహాయింపు లభించనుంది.

వాళ్లే అధికం..

గత కొన్నేండ్లుగా జలమండలిలో పూర్తి స్థాయిలో బదిలీలు లేకపోవడంతోపాటు కొందరికి రాజకీయ నాయకుల, జలమండలి అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో ఒకే చోట దాదాపు 10, 15 ఏండ్లకుపైగా పాతుకుపోయారు. వీరిలో మేనేజర్లు, డీజీఎంలు, జీఎంలు, సీజీఎంలున్నారు. వీరిలో కొందరికి గత ప్రభుత్వంలో అనుకూలంగా ఉండే వారికే కీలక పదవులు దక్కాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. అలాంటి వారిల్లో అధిక సంఖ్యలో ప్రధాన పోస్టులో కొనసాగుతున్నారు. ఏండ్లుగా తిష్ఠవేసిన అధికారుల పెత్తనంతో అవినీతి సైతం పెరుగుతోంది. ఇప్పటికే కొంత మంది అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా ఉందని ఆరోపణలు ఉన్నాయి. అలాంటి వారిపై ఎన్ని ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినప్పటికీ సీట్లు వదలడం లేదు. ఇదిలావుండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో తాగు నీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయన్న విమర్శలను జలమండలి మూటగట్టుకున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా కొంత మంది అధికారులు భారాసకు సహరించారన్న అపవాదు రావడంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. తాగు నీటి సమస్యలు వచ్చినా, లో ప్రెజర్‌తో నీటిని సరఫరా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని ఏండీ హెచ్చరించే వరకు వెళ్లింది.

బదిలీలను అడ్డుకుంటున్న కొందరు యూనియన్ నాయకులు !

జలమండలిలో ఈ నెల చివరికల్లా బదిలీలు జరగనున్న నేపథ్యంలో కొందరు యూనియన్ నాయకులు బదిలీలను అడ్డుకుంటున్నట్టు తెలిసింది. జలమండలిలో కొద్ది నెలల్లోనే యూనియన్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జలమండలిలోని సివరేజ్, వాటర్ సప్లయింగ్, ఫీల్డ్ వర్క్ అన్ని విభాగాలల్లో ఉద్యోగుల బదిలీలు జరిగితే కొందరు ఉద్యోగులకు నచ్చని ప్రాంతంలో, ఇష్టం లేని చోట పోస్టింగ్ రావచ్చు. దానికి తోడు ఏండ్లకు ఏండ్లు పాతుకుపోయిన వారుసైతం బదిలీ అవుతుండడంతో వారిలో కొందరు యూనియన్ నాయకులకు వ్యతిరేకంగా మారే అవకాశముంది. దాంతో బదిలీలను ఆపి ఉద్యోగుల్లో మంచిపేరు సంపాదించడంతోపాటు వారికి అనుకూలంగా మల్చుకునే విధంగా కొందరు యూనియన్ నాయకులు ప్రయత్నిస్తున్నారని తెలిసింది. ఈ క్రమంలోనే జలమండలిలో బదిలీల ప్రక్రియను నిలిపివేయాలని ఉన్నతాధికారులపై యూనియన్ నాయకులు ఒత్తిడి తీసుకొస్తున్నట్టు తెలిసింది.

వేగవంతంగా పరిష్కరించాలి

● అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన విజ్ఞప్తులను వేగవంతంగా పరిష్క రించాలని అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతి అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి నగరం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అడిషనల్ కమిషనర్ శ్రీవాత్సవ, సీసీపీ రాజేంద్ర ప్రసాద్ నాయక్‌తో కలిసి నళిని పద్మావతి సత్య నారాయణ విజ్ఞప్తులను స్వీకరించారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 9 విన్నపాలు రాగా సంబంధిత అధికారులకు పంపించారు. అందులో టౌన్ ప్లానింగ్, డ్రైన్, ఇతర అంశాల పై ఫిర్యాదులు వచ్చాయి. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 30 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ 15, ట్రాన్స్ పోర్ట్ 1, రెవెన్యూ 5, సి.ఇ మెయింటెనెన్స్ 2, ఎఫ్.ఏ 2, ఎలక్షన్స్ 2, అడ్మినిస్ట్రేషన్ 2, లేక్స్ విభాగానికి ఒక 1 విన్నపం వచ్చాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 147 అర్జీలు వచ్చాయి. చార్మినార్ జోన్ లో 4 రాగా, సికింద్రాబాద్ జోన్ లో 18, కూకట్ పల్లి జోన్ లో 61, శేరిలింగంపల్లి జోన్ 51, ఖైరతాబాద్ జోన్ లో 1, ఎల్బీనగర్ జోన్ లో 12 విజ్ఞప్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, ఎస్.ఎన్. డీ.పీ.సి ఈ కోటేశ్వర రావు, సీ.ఎం.అండ్ హెచ్‌ఓ డాక్టర్ డాక్టర్ పద్మజ, చీఫ్ ఎంటమాలజీ డా. రాంబాబు, చీఫ్ వెటర్నరి డాక్టర్ అబ్దుల్ వకీల్, టాక్స్ వాల్యుయేషన్ ఆఫీసర్ మహేష్ కులకర్ణి, డిప్యూటీ సీఈకే.ఎస్‌రెడ్డి, ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని అధికారులు కూడా సమన్వయంతో కలిసి పని చేస్తే ప్రజలకు ఎటువంటి సమస్యలు రావని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సోమవారం బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని పోచమ్మ బస్తీ, కురుమ బస్తీలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కార్పొరేటర్ పద్మ వెంకట్ రెడ్డి తో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్డు గురించి ప్రధానంగా చర్చించి ఎక్కడిక్కడ ప్యాచ్ వర్క్ అవసరం ఉంటుందో అక్కడ పని పూర్తి చేసి, రోడ్డు ఎస్టిమేషన్ వర్క్ కూడా చేయాలని అధికారులకు తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు ప్రతిరోజూ ప్రజలకు అందించాలని వాటర్ వర్క్స్ బోర్డ్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అలాగే వీధిలో వీధి దీపాలను పరిశీలించి ఎక్కడెక్కడ మరమ్మతులు అవసరమో అక్కడ మరమ్మతులు చేయించి, వీధి దీపాలు లేనిచోట కొత్త వాటిని బిగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు ఇబ్బందులు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ హేమలత, ఎలక్ట్రిసిటీ స్ట్రీట్ లైట్ ఏఈ సౌమ్య , జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్ , వాటర్ వర్క్స్ అధికారి మజీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ స్వీరెజ్ సూపర్వైజర్ లక్ష్మణ్ డివిజన్ ప్రెసిడెంట్ చంద్రమోహన్, బీఆర్ఎస్ నాయకులు రమేష్ నాయక్, మిరియాల శ్రీనివాస్, తదితర నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

● పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పి.మహేష్

నవతెలంగాణ-ముషీరాబాద్

డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయ ముట్టడికి యత్నించిన అభ్యర్థుల అరెస్టును ఖండిస్తున్నామని పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పి.మహేష్ సోమవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. అరెస్టులతో, నిర్బంధాలతో సమస్యలు పరిష్కారం కాదనేది ప్రభుత్వం గుర్తించాలని వరుసగా కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ఉండడం వల్ల తగినంత సమయం ఉండాలని నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారు. వాళ్ల న్యాయమైన డిమాండ్‌ను పరిగణలోకి చేసుకోని సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ విద్యార్థి, యువజన నాయకులతో కాకుండా నేరుగా డీఎస్సీ అభ్యర్థులతో చర్చించి సమస్యను పరిష్కరించాలన్నారు. పరీక్షను వెంటనే 45 రోజులపాటు వాయిదా వేయాలని కోరారు.

'ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు'



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని కిసాన్ మోర్చా నాయకులు అన్నారు. సోమవారం కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి పిలుపు మేరకు గోల్కొండ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిలు ముక్క కృష్ణ గుప్తా, శ్రీధర్ యాదవ్ ఆధ్వర్యంలో నాంపల్లి మండల నాయబ్ తహసిల్దార్ డి.హారికకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని రైతులను అరిగోస పెడుతున్న ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.15వేలు, కౌలు రైతులకు రూ.12వేలు, 2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ అసెంబ్లీ కన్వీనర్ అనంత్, కార్వాన్ అసెంబ్లీ కన్వీనర్ గోదా లక్ష్మీకాంత్ యాదవ్, పత్తర్ గట్టిఅధ్యక్షులు కట్ట ఆదిత్య, జియాగూడ డివిజన్ అధ్యక్షులు రాంలింగ్, కిసాన్ మోర్చా పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రజక, నాయిల ఉచిత విద్యుత్ బకాయిలు చెల్లించాలి



● తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్

రజక, నాయిల ఉచిత విద్యుత్ బకాయిలు వెంటనే ప్రభుత్వం చెల్లించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ నగర అధ్యక్షులు సిహెచ్ వెంకటస్వామి అధ్యక్షతన గోల్కొండ చౌరస్తా సీఐటీయు కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్యహాజరై మాట్లాడుతూ.. రజక, నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వ ఇస్తున్న ఉచిత విద్యుత్ 250 యూనిట్ల పథకం సంబంధించిన 100 కోట్ల పాత బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించి వృత్తిదారులకు ఉపాధి కల్పిస్తున్న ఉచిత విద్యుత్ పథకం ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులు అనేక జిల్లాలలో వృత్తిదారులన్ని బిల్లులు కట్టాలని వేధింపులు గురి చేస్తున్నారని, కొన్నిచోట్ల కనెక్షన్స్ కట్ చేసేస్తున్నారని వృత్తిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ముందు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఇచ్చిన హామీ మేరకు మొత్తం బకాయిలన్నీ చెల్లిస్తామని తెలిపిన హామీని అమలు చేయాలని కోరారు. రజక ఫెడరేషనుకు వెంటనే ప్రభుత్వం చైర్మెన్ డైరెక్టర్ నియమించాలని వృత్తిదారుల సొసైటీ లన్నింటికీ రుణాలు అందించడానికి బడ్జెట్ రిలీజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కార్యదర్శి మరియాల గోపాల్ మాట్లాడుతూ.. జిల్లా కమిటీ ప్రతి సభ్యుడు సభ్యత్వాలను చేర్పించాలని జిల్లా కమిటీలో నిర్ణయించామని తెలిపారు. జిల్లా అధ్యక్షులు, చారగొండ వెంకటస్వామి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ప్రభుత్వం రజకుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లొంక సోమయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు, రాపర్తి ప్రభాకర్, అల్వాల్ బాబు సోషల్ మీడియా కన్వీనర్ సిహెచ్ నగేష్, కోశాధికారి, పీ. భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు వి.రాజు ఈ. లక్ష్మయ్య, పి.రాజు, ఆర్.తిరుపతి, సిహెచ్‌అశోక్ ,వి రమేష్, సిహెచ్ నరేష్, సి.కేశవులు, కే.గోపి ఏ.స్వప్న, స్వామి, రమేష్ తదిరులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనియన్ ప్రచార కార్యదర్శిగా అరుణేందర్ ప్రసాద్



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ఆర్టీఏ యూనిట్ అధ్యక్షులుగా సేవలందిస్తున్న అరుణేందర్ ప్రసాద్‌ను సెంట్రల్ యూనియన్ ప్రచార కార్యదర్శిగా అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) నియమించారు. ఈ మేరకు శనివారం వారి చేతుల మీదుగా నియామక పత్రం తీసుకున్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ యూనియన్, హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులకు, వివిధ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులకు, ప్రత్యేకంగా సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్)కి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుంటే
రాష్ట్ర వ్యాప్తంగా నిరంతర ఆందోళనలు

తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

సుదీర్ఘ కాలం పాటు పెండింగ్ లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చుతామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా ప్రకటన చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరంతర ఆందోళనలు చేపట్టి, ఆటోలతో రహదారులను దిగ్బంధనం చేస్తామని తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం హెచ్చరించారు. న్యాయమైన ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని, కాంగ్రెస్ ఎన్నికల మ్యాని ఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం హిమాయత్ నగర్ 'వై' జంక్షన్ వద్ద వందలాది మంది ఆటో డ్రైవర్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎర్ర జెండాలు చేతబట్టి పెద్దఎత్తున నినాదాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2013 సంవత్సరం నుండి నేటి వరకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వంద శాతం పెరిగాయని, కానీ అప్పటి నుండి నేటి వరకు ప్రభుత్వాలు ఒక్కసారి కూడా ఆటో మీటర్ ఛార్జీలు పెంచలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం లేదని విమర్శించారు. పాలకులు మారుతున్న ఆటో డ్రైవర్ల తలరాతలు మారడం లేదని, ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారుల వేధింపులు, జరిమానాలు, పెట్రో మంటలు, మరమ్మతులు, ఫైనాన్స్ వ్యాపారుల ఒత్తిళ్లు, కుటుంబంతో సతమతమవుతూ జీవితాలు వెళ్లదీస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో మీటర్ ఛార్జీలు పెంచి, వారి సంక్షేమానికి ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలన్నారు. అనంతరం ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి మాట్లాడుతూ వాహన రంగ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని, ఆటో మోటర్ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ప్రదర్శనలో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కొంరెల్లి బాబు, ప్రధాన కార్యదర్శి సిహెచ్. జంగయ్య, నేతలు ఎ.బిక్షపతి యాదవ్, ఎండి. ఉమర్ ఖాన్, ఎస్.కె.లతీఫ్, జి.మల్లేష్, అశోక్, భాస్కర్, రవి, ఘనీ బాబు, నర్సిరెడ్డి, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ అందించాలి



● వికలాంగుల సంక్షేమం సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు బిక్షపతి యాదవ్

నవతెలంగాణ-ముషీరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేసి రూ.6 వేల పెన్షన్ అందించాలని వికలాంగుల సంక్షేమం సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు బిక్షపతి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద వికలాంగుల మహా ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు బిక్షపతి యాదవ్ హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా వికలాంగులకు పెన్షన్ పెంచలేదన్నారు. ఎన్నికల హామీ ప్రకారం రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఇచ్చిన ఉచిత ప్రయాణం మాదిరిగా ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులకు పూర్తిగా ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వికలాంగుల 2016 ఆక్ట్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో తమకు కూడా ఐదు శాతం ఉద్యోగాలను కల్పించాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించి ఒకటవ తేదీ నుంచి 5వ తేదీ లోపు పెన్షన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో పలువురు వికలాంగులు పాల్గొన్నారు.



మన జాతికి మంచి రోజులు వచ్చాయి...

అక్కడ ఆదివాసీల ఆడబిడ్డ ద్రౌపది
ముర్ము గారు
ఇక్కడ మన జాతి రత్నం సీతక్క
గారు
మన స్త్రీ జాతికి గర్వకారణం
జై సీతక్క గారు
జైజై ముర్ము గారు
మనం కలివిడిగా
వడి వడిగా
మూకుమ్మడిగా
అభివద్ధి వైపు అడుగులు వేసి
గిరిజన మహిళల
ఆదివాసీ ఐక్యతగా
మనకు మన జాతికి
మేలు జరిగేలా
మేలు కొలిపేలా
ఉన్నత శిఖరాలకు చేరేలా
కలిసి కట్టుగా
చేయి చేయి కలిపి
వారి ననుసరించి నడుద్దాం
జాతిని నడిపిద్దాం
ఐకమత్యంతో నినదిద్దాం
వారికి నీరాజనా లిచ్చి
ఆ కాంతిలో
జాతి అభివృద్ధిని చూద్దాం
జై ఆదివాసీ మహిళా
జైజై ఆదివాసీ మహిళా
చైతన్య శక్తి.

- డాక్టర్ పద్మజా,
జీహెచ్ఎం సీఎంవోహెచ్,
ఆదివాసీ మహిళా చైతన్య శక్తి.

పురుషుల ప్రపంచంలో ఆమె విజయకేతనం

సృజనాత్మక కళలంటే ఆమెకు ఎంతో మక్కువ. చిన్నతనం నుండి ఆర్కిటెక్చర్, డిజైనింగ్ అంటే ఎంతో ఆసక్తి. పాఠశాల విద్య పూర్తి చేసే నాటికే ఇందులోనే తన కెరీర్ కొనసాగాలని బలంగా నిర్ణయించుకుంది. అయితే అప్పటికి అది పురుషాధిక్యత రాజ్యమేలుతున్న రంగమని అవగాహన పెద్దగా లేదు. ఒక్క సారి ప్రవేశించిన తర్వాత ఎన్ని సవాళ్లు ఎదురైనా ముందుకే పోవాలని భావించింది. ఆ ధైర్యంతోనే 1989లో స్థపతి పేరుతో తన సొంత ఆర్కిటెక్చర్ సంస్థను ప్రారంభించింది. ఆమే ప్రముఖ ఆర్కిటెక్చర్ విపుల్ బి వర్ష్నేయ. ఇప్పుడు విద్యా సంస్థలు, ఎయిర్‌పోర్ట్ టెర్మినల్స్, ప్రజా రవాణా వంటి నిర్మాణాలలో తన మార్క్‌ను చూపిస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...







విపుల్ తండ్రి టౌన్ ప్లానర్. చిన్న పిల్లగా ఉన్నప్పటి నుండి సృజన్మాతక కళలంటే ఆమెకెంతో ఇష్టం. ఆర్కిటెక్చర్, డిజైన్‌పై మక్కువ చూపేది. ఈ ఆసక్తిని అలాగే కొనసాగించింది. పాఠశాల పూర్తి చేసే సమయానికి ఆర్కిటెక్చర్‌లో వృత్తిని కొనసాగించాలని బలంగా అనుకుంది. హైస్కూల్లో సైన్స్, గణితంలో మంచి మార్కులు సాధించేది. ఆమె ఆర్కిటెక్చర్‌లోకి రావాలనే నిర్ణయానికి తండ్రి మద్దతునిచ్చాడు. ఈ నిర్ణయమే ఆమె 1989లో తన సొంత కంపెనీ అయిన స్థపతిని ప్రారంభించేలా చేసింది. ఇప్పుడు ఆమె తన భర్త అనుజ్ వర్ష్నేయతో కలిసి లక్నో ప్రధాన కార్యాలయంగా ఆర్కిటెక్చరల్ కంపెనీని నడుపుతోంది.

స్పష్టమైన ఆలోచనతో...

పెద్ద పెద్ద పట్టణాల్లో ఎయిర్‌పోర్ట్ టెర్మినల్స్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కోసం ఆమె సంస్థ వ్యక్తిగత నివాసాలను నిర్మించింది. ఇది వారసత్వ పరిరక్షణ ప్రయత్నాలకు కూడా ప్రసిద్ధి చెందింది. విపుల్ తన సొంత కంపెనీని ప్రారంభించాలని మొదటి నుండి చాలా స్పష్టంగా ఉంది. ఆమె భర్త, సంస్థ సహ వ్యవస్థాపకుడైన అనుజ్ ఐఐటీ రూర్కీ నుండి స్ట్రక్చరల్ ఇంజనీర్ చేశారు. ఈ అనుభవంతోనే అతను విపుల్‌కు సహకరించారు. 'నేను ప్రణాళికను సిద్ధం చేసాను. వ్యాపారం ప్రారంభించాలనే స్పష్టమైన ఆలోచన నాలో కళాశాల నుండే ఉంది. మా కంపెనీ అన్ని రకాల ప్రాజెక్టలను చేస్తున్నప్పటికీ, ఇటీవల మేము విమానయానం, విద్యా భవనాలు, రావాణా వ్యవస్థ వైపు ఎక్కువ మొగ్గు చూపుతున్నాం.

ఆమె ప్రయాణం

లక్నోలోని ఖుర్రామ్‌నగర్‌లో ఒక కుటుంబానికి ఇల్లు నిర్మించడం ద్వారా విపుల్ తన ప్రయాణాన్ని ప్రారంభించారు. అప్పటి నుండి వారు భారతదేశంతో పాటు ఇతర దేశాల్లో కూడా సుమారు వెయ్యి నిర్మాణాలను రూపొందించారు. స్థపతి రూపొందించిన ప్రాజెక్టులలో భుజ్ పునరావాసం, లేహ్ విమానాశ్రయం చాలా ప్రత్యేకమైనవని ఆమె అంటున్నారు. 2001లో భుజ్‌లో సంభవించిన భారీ భూకంపం ఆసుపత్రుల వంటి మౌలిక సదుపాయాలతో సహా 90శాతం భవనాలను ధ్వంసం చేసింది. ఈ విపత్తు దాదాపు ఆరులక్షల మందిని నిరాశ్రయులను చేసింది. గుజరాత్ రాష్ట్రంలో 14 ఏండ్ల కంటే తక్కువ వయసున్న దాదాపు మూడు మిలియన్ల మంది పిల్లలను ప్రభావితం చేసింది. 'డిజైనింగ్ చేస్తున్నప్పుడు నేను స్థలాకృతి, వాతావరణం, విపత్తులను తట్టుకునే శక్తి వంటి వాటికి అధిక ప్రాధాన్యం ఇస్తాను. అవసరమైన విస్తృతమైన పునరాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నివాసితులకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని సృష్టించడంపై మా దృష్టి కేంద్రీకరించబడి వుంటుంది' ఆమె చెప్పారు.

ఇది గొప్ప విజయం

రెండేండ్లలో సంస్థ భుజ్ పునరావాస ప్రాజెక్ట్‌ను పూర్తి చేసింది. దాదాపు 1,000 ఇళ్లను నిర్మించి బాధిత కుటుంబాలకు అందించింది. లేహ్ విమానాశ్రయం కూడా అనేక సవాళ్లతో వచ్చిందని విపుల్ అంటున్నారు. ఈ ప్రదేశం అసమాన స్థలాకృతి, కఠినమైన వాతావరణమే దీనికి కారణం 'ఇతర చలి ప్రాంతాలలోని విమానాశ్రయాలను అధ్యయనం చేసి, వాటి నుండి ప్రేరణ పొందాము. ముఖ్యంగా రష్యాలో మేము ఈ ప్రాంత ప్రత్యేక పరిస్థితులను అవసరమైన వినూత్న పద్ధతులను రూపొందించగలిగాం. దీని నిర్మాణ సమయంలో భూఉష్ణ శక్తిని ఉత్పత్తి చేయడానికి ఘనీభవించిన నీటిని ఉపయోగించడం ఒక కీలకమైన పురోగతిగా మాకు అనిపించింది. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం వల్ల కార్బన్ న్యూట్రాలిటీని సాధించే అద్భుతమైన ఫీట్‌ని సాధించగలిగాం. భారతదేశంలో ఇది గొప్ప విజయం. స్థపతి న్యూ ఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా పునరాభివృద్ధిని కూడా చేపట్టింది. ఇది ఒక ఎగ్జిబిషన్ సెంటర్. ఢిల్లీ రూపకల్పనలో కూడా పాలుపంచుకుంది. లీజర్ పార్క్, నోయిడా, అయోధ్యలోని మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం కూడా మా సంస్థే నిర్మించింది

సవాళ్లు తప్పవు

చాలా మంది మహిళా పారిశ్రామికవేత్తల మాదిరిగానే విపుల్ కూడా తన వ్యాపార ప్రయాణంలో అనేక సవాళ్లు ఎదుర్కొన్నారు. ప్రారంభంలో సంస్థ అనేక క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంది. ఆ సమయంలో సిబ్బందిని చాలా వరకు తగ్గించవలసి వచ్చిందని ఆమె గుర్తుచేసుకున్నారు. వ్యాపారాన్ని నిలబెట్టుకోవడానికి చిన్న ప్రాజెక్టులు, ఇంటీరియర్ డిజైన్ పనులను కూడా చేపట్టింది. 'మేము సాధారణ ప్రభుత్వ పనులతో పాటు చిన్న, ప్రైవేట్ ప్రాజెక్టులను కూడా ఉపయోగించాం. ఇలాంటి మా స్థిరమైన ప్రయత్నాల వల్ల సంస్థ ఫలించింది' అని ఆమె జతచేస్తున్నారు. అదే పంథాలో ఆర్కిటెక్చర్ రంగంలో మహిళగా ఉండటం కూడా ఆమెకు ఓ సవాల్‌గా మారింది. భర్తతో కలిసి వ్యాపారం ప్రారంభించినప్పుడు చాలా మంది మొదట అతన్ని మాత్రమే సంస్థకు బాస్‌గా భావించారు. 'లింగ వివక్ష చాలా సూక్ష్మ పద్ధతిలో ఉంటుంది. కంటికి కనబడదు. కానీ అది చివరికి ఆవిరైపోయింది' ఆమె జతచేస్తుంది. ఇటువంటి సవాళ్లను న్యాయంగా ఎదుర్కొంటూ, కష్టాలు అనివార్యమే కానీ తాత్కాలికమైనవని ఇతర మహిళా పారిశ్రామికవేత్తలు అర్థం చేసుకుంటారని విపుల్ ఆశిస్తున్నారు. 'మీపై మీకు నమ్మకం ఉండాలి. ఏ ప్రయాణమైనా సాఫీగా సాగదు. కానీ మీరు మీ లక్ష్యాన్ని చేరుకోవడానికి రోడ్‌బ్లాక్‌లకు కూడా సిద్ధంగా ఉండాల్సిందే' ఆమె చెప్పారు.



పుచ్చకాయ గింజలు అస్సలు పడేయకండి

పుచ్చకాయ గింజల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. వీటిలో కేలరీలు చాలా తక్కువ. మరోవైపు, శరీరానికి అవసరమైన రాగి, జింక్, పొటాషియం, మెగ్నీషియం , ఐరన్ వంటి ఖనిజాలు, పోషకాలు ఉన్నాయి. దీంతో శరీరంలో రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది.



అధిక స్థాయి మెగ్నీషియం రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యం కూడా కాపాడబడుతుంది.

దీని ఖనిజ పోషక శక్తి ఎముకలను కూడా బలపరుస్తుంది. శరీర పెరుగుదల, మార్పులనూ నియంత్రిస్తుంది. మధుమేహం ఉన్నవారికి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో చాలా బాగా ఉపయోగపడుతుంది.

పుచ్చకాయ గింజలను ఎండబెట్టి ఫ్రై చేసుకొని తినవచ్చు . పుచ్చకాయ గింజలతో బర్ఫీలను తయారు చేయవచ్చు. బెల్లం వేసి లడ్డూలూ చేసుకోవచ్చు. పుచ్చకాయ గింజల షేక్, పుచ్చకాయ సీడ్ వెన్న తయారు చేయవచ్చు.

పుచ్చకాయ గింజలు ఆరోగ్యాన్ని కాపాడడమే కాదు.. చర్మాన్ని సంరక్షిస్తుంది. ఇది జుట్టు ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. పుచ్చకాయ గింజల నూనె అమ్ముతారు. దీన్ని చర్మంపై రుద్ది మసాజ్ చేసుకోవచ్చు. దీన్ని తల మూలాల్లో రుద్దితే జుట్టు పెరుగుతుంది. ఎన్నో ఉపయోగాలున్న పుచ్చగింజలను మన రెగ్యులర్ ఆహారంలో చేర్చుకోవటం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుందాం.

మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా 17 నుంచి 25 వరకు రాష్ట్రవ్యాప్త సదస్సులు

(మొదటిపేజీ తరువాయి)

ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఓట్లు-సీట్లు పెరిగిన నేపథ్యంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లకు సంబంధించిన సంస్థలు మైనార్టీల మీద దాడులను మరింత విస్తృతంగా చేస్తున్నాయని విమర్శించారు. మెదక్ పట్టణంలో నాలుగు గంటలపాటు ఆస్తుల విధ్వంసం చేయడంతోపాటు, బక్రీద్ సందర్భంగా ఆదిలాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, జనగామ తదితర ప్రాంతాల్లో గోరక్షణ పేరుతో దాడులు చేశాయని తెలిపారు. ప్రజల్లో మతపరమైన భావోద్వేగాలు, ఘర్షణలను పెంచే వాతావరణం సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం శాంతియుతంగా ఉన్న వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మరల్చుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడం, మోడీ మళ్లీ ప్రధాని కావడంతో దేశవ్యాప్తంగా ఇలాంటి ఘర్షణలను సంఘ్‌పరివార్ శక్తులు సృష్టిస్తున్నాయని తెలిపారు. తెలంగాణలోనే కాకుండా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌ఘడ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో మైనార్టీల మీద దాడులకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఈ క్రమంలో సమస్యల పరిష్కారం కోసం పేదలు ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఇందుకు భిన్నంగా పేదల మధ్య మతంపేరుతో చిచ్చుపెట్టడం ప్రజా ప్రయోజనాలకు నష్టమని తెలిపారు. అందుకే రాష్ట్రంలో మత సామరస్యాన్ని కాపాడుకోవాలని కోరారు. రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని వాడుకునే ప్రయత్నాలను వ్యతిరేకించాలని పేర్కొన్నారు. ఇందుకోసం తెలంగాణ ప్రజానీకాన్ని చైతన్యపరిచేందుకు వామపక్ష పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా క్యాంపెయిన్ చేయాలని నిర్ణయించాయని తెలిపారు. అందులో భాగంగానే ఈనెల 17 నుంచి 25 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో సదస్సులు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

జనంలో రాహుల్

సిల్చార్ : మణిపూర్‌లో ఏడాదికి పైగా కొనసాగుతున్న హింసాకాండ కారణంగా నిరాశ్రయులుగా మారి పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న బాధితుల్ని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సోమవారం పరామర్శించారు. మణిపూర్‌లోని జిరిబామ్, చురచాంద్‌పూర్ జిల్లాలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించిన రాహుల్‌గాంధీ అక్కడ ఉన్న బాధితులతో మమేకమయ్యారు. కొన్ని నెలల నుంచి ఈ కేంద్రాల్లోనే వీరు ఉంటున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులతో ఇక్కడకు వచ్చిన రాహుల్ గాంధీ నిరాశ్రయులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సోమవారం ముందుగా అస్సాంలోని సిల్చార్‌కు వాయుమార్గం ద్వారా రాహుల్‌గాంధీ చేరుకున్నారు. సిల్చార్‌లోని కుంభిర్‌గ్రామ్ ఎయిర్‌పోర్టులో అసోం పీసీసీ అధ్యక్షులు భూపేన్ బోర్హా, ఇతర సీనియర్ నాయకులు, జిల్లా నాయకులు రాహుల్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ తరువాత అసోంలో వరదబాధితుల్ని రాహుల్‌గాంధీ పరామర్శించారు. ఈ సందర్భంగా భూపేన్ బోర్హా రాహుల్ గాంధీకి ఒక మెమోరాండం సమర్పించారు. భారీ వరదలకు తీవ్రంగా నష్టపోయిన అస్సాంకు తగిన ఉపశమనం, నష్టపరిహారం లభించేవిధంగా కేంద్ర ప్రభుత్వంతో ప్రత్యేకంగా చర్చించాలని ఈ మెమోరాండంలో భూపేన్ బోర్హా కోరారు. విధ్వంసకర వరదల పరిస్థితిని పరిష్కరించడానికి అస్సాంకు ఒక ప్రత్యేక ప్యాకేజీని అందించాలని కూడా బోర్హా కోరారు. అలాగే కేంద్రం నుంచి తగిన నిధులను పొందడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఇది డబుల్ ఇంజిన్ ప్రభుత్వం యొక్క రెండింత వైఫల్యంగా బోర్హా విమర్శించారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా మణిపూర్‌లో జిరిబామ్‌కు రాహుల్ గాంధీ చేరుకున్నారు. అక్కడ మణిపూర్ పిసిసి అధ్యక్షులు కెయిశం మేఘ చంద్ర, సీఎల్‌పీ నేత ఓ ఇబోబి సింగ్ ఇతర నాయకులతో కలిసి పునరావాస కేంద్రాలను రాహుల్ సందర్శించారు. 'ప్రజలకు మద్దతు అందించడం, క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేయడం లక్ష్యంగా రాహుల్ గాంధీ పర్యటన సాగింది. హింసాకాండలో బాధితుల ఆందోళనలను పరిష్కరించడానికి కాంగ్రెస్ నిబద్ధతను రాహుల్ గాంధీ పర్యటన ప్రతిబింబిస్తుంది' అని విలేకరులతో మాట్లాడుతూ మేఘచంద్ర తెలిపారు.

టీచర్ పోస్టులు పెంచాలి

నవతెలంగాణ-హిమాయత్ నగర్

డీఎస్సీ కింద 25 వేల టీచర్ పోస్టులను పెంచి భర్తీ చేయాలని, డీఎస్సీకి మూడు నెలల సమయం కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన నిరుద్యోగులు, జేఏసీ నేతలు సోమవారం తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మెన్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సైఫాబాద్‌లోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ క్రమంలో పోలీసులకు నిరుద్యోగుల మధ్య తీవ్ర వాగ్వాదం, ఉద్రిక్తత జరిగింది. అనంతరం పలువురు జేఏసీ నేతలు, నిరుద్యోగులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఈడీ చేసిన నిరుద్యోగులు 4 లక్షల మందికిపైగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్సీ రిపోర్టు ప్రకారం రిటైర్మెంట్ వల్ల ఏర్పడిన 25 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 4,900 పోస్టులు భర్తీ చేయాలని కోరారు. 25 ఏండ్లుగా ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్ పోస్టులను భర్తీ చేయడం లేదని, 90 శాతం ఖాళీలు ఏండ్ల తరబడి పెండింగ్ ఉంటున్నాయని అన్నారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 10 వేల పీఈటీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ జీఓ ప్రకారం ప్రతి పాఠశాలకూ ఒక పీఈటీ టీచర్ ఉండాలని తెలిపారు. 20 ఏండ్లుగా ఖాళీగా ఉన్న 5 వేల ఆర్ట్-క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అలాగే, 4 వేల మంది కంప్యూటర్ టీచర్లను నియమించాలని, ప్రతి పాఠశాలకూ ఒక జూనియర్ అసిస్టెంట్ ఉండాలని అన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే సర్క్యులర్స్, ఇతర కరస్పాండెంటు చేయడానికి, విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడానికి, విద్యార్థుల హాజరు తదితర వివరాలు ఎప్పటికప్పుడూ తల్లిదండ్రులకు తెలుపడానికి ప్రతి పాఠశాలకు జూనియర్ అసిస్టెంట్ పోస్టు అవసరమని చెప్పారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 15 వేల అటెండర్, స్వీపర్ పోస్టులనూ వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని కేటగిరీల పోస్టులను భర్తీ చేసి పాఠశాల విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగ యువతతో నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ యువజన సంఘం నాయకులు పగిళ్ళ సతీష్, నిఖిల్, రాందేవ్, ప్రీతం, శివరాం, శ్రీనివాస్, స్వాతి, శశి, నిరుద్యోగులు పాల్గొన్నారు.

లీకేజీ ఎలా జరిగింది?

(మొదటిపేజీ తరువాయి)

ఈ పరీక్షను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని ఆదేశించారు. లీక్ అయిన సమయానికి, పరీక్ష జరిగిన సమయానికి మధ్య గల తేడా ఎంత అనేది కూడా వెల్లడించాలన్నారు. ఈ లీక్‌వల్ల పరీక్ష పవిత్రత దెబ్బతిందంటూ కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల పవిత్రతకు హామీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. బహుళ విభాగాలక చెందిన నిపుణులతో ఒక బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడం అవసరమని పేర్కొంది. ఒకవేళ కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసి వుంటే పూర్తి వివరాలను కోర్టుకు అందచేయాలని కోరింది. ఆ కమిటీ తన కార్యకలాపాలతో ముందుకు సాగాలా లేక కమిటీలో మార్పులు ఏమైనా చేయాలా అనేది తామ సూచిస్తామని చంద్రచూడ్ తన ఉత్తర్వులో పేర్కొనాన్రు.

పేపర్ లీక్ అయిన నగరాలు, కేంద్రాలను ఎన్‌టిఎ గుర్తించాలని ఆదేశించారు. ఇప్పటివరకు దీనివల్ల ఎవరు, ఎంతమంది లబ్ది పొందారో గుర్తించడానికి తీసుకున్న చర్యలు వెల్లడించాలన్నారు. ఒకవేళ పేపర్ లీక్ వల్ల మొత్తంగా ఈ ప్రక్రియ ప్రభావితమైతే మళ్లీ పరీక్ష నిర్వహించడం అవసరపడవచ్చని చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. పేపర్ లీక్‌కు సంబంధించి నమోదైన ఎఫ్‌ఐఆర్‌లను వివరంగా పరిశీలించాల్సి వుందన్నారు. ఈ లీక్ కూడా వ్యవస్థాగతంగా జరిగిందా లేదా అని నిర్ధారించుకోవడానికి ప్రభుత్వం వద్ద ఏదైనా విశ్లేషణాత్మక డేటా వుందా లేదా అని ప్రశ్నించారు. గత నాలుగేళ్లలో కేవలం ఏడుగురు అభ్యర్థులు పూర్తి స్కోర్ సాధించారు, కానీ ఈ ఏడాది ఏకంగా 67 అభ్యర్థులు వంద శాతమూ మార్కులు సాధించారన్నారు. పేపర్ లీక్, ఓఎంఆర్ షీట్‌లో అవకతవకలు, ఒకరిక బదులుగా వేరొకరు పరీక్ష రాయడం, మోసం చేయడం వంటి అనేక అక్రమాలు జరిగినందున పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాదాపుగా 30 పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జె.బి.పర్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన బెంచ్ సోమవారం విచారించింది. అయితే పరీక్షను రద్దు చేయడం వల్ల ప్రతికూల ఫలితాలు ఏర్పడతాయని కేంద్రం, ఎన్‌టిఎ కోర్టుకు తెలియచేశాయి. పెద్దఎత్తున పరీక్ష విశ్వసనీయత దెబ్బతిందని నిరూపించడానికి ఎలాంటి సాక్ష్యాధారాలు లేనందున నిజాయితీగా పరీక్ష రాసిన లక్షలాదిమంది అభ్యర్థుల ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బ తింటాయని పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్, ఇతర సంబంధిత కోర్సుల ప్రవేశానికి ఎన్‌టీఏ నీట్ యూజీని నిర్వహించింది.

మునిగిన ముంబయి

(మొదటిపేజీ తరువాయి)

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం ప్రకటించింది. మరో రెండు, మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. సోమవారం పలు ప్రాంతాల్లో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షం కారణంగా ముంబయిలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. రోడ్లపైకి నీరు చేరింది. థానేలో నీట మునిగి రిసార్ట్ నుంచి 49 మంది ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు రక్షించాయి. పాల్ఘర్‌లో వరదలో చిక్కుకున్న 26 మందిని గ్రామస్థులు రక్షించారు. భారీ వర్షాలతో విమానాశ్రాయ కార్యాకలాపాలకు కూడా అంతరాయం కలిగాయి. సుమారు 50 విమాన సర్వీసులను రద్దు చేశారు. ముంబయి, రత్నగిరి, సింధుదుర్గ్ జిల్లాల్లో అన్ని విద్యాసంస్థలకు రాష్ట్రప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఇక వర్షాల కారణంగా పలువురు సభ్యులు, అధికారులు విధాన్ భవన్‌కు రాకపోవడంతో మహారాష్ట్ర శాసనసభ ఉభయ సభలు వాయిదా పడ్డాయి. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కంట్రోల్ రూమ్‌ను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ముంబయి, చుట్టుప్రక్కల ప్రాంతాల్లో 30కు పైగా జంతువులను రక్షించారు. మంబయిలోని పోవై సరస్సు భారీ వర్షాలకు పొంగిపొర్లుతుందని అధికారులు తెలిపారు. ఈ సరస్సును కేవలం పారిశ్రామిక అవసరాలకు మాత్రమే వినియోగిస్తారు. భారీ వర్షాలలకు రాయ్‌గఢ్ కోటను ఈ నెల 31 వరకూ మూసివేయనున్నారు. కొంకణ్ ప్రాంతంలోని రాయగఢ్ జిల్లాలో గత 24 గంటల్లో భారీ వర్షాలు కురిసాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను ముందు జాగ్రత్త చర్యగా మోహరించారు.

విశ్వాస పరీక్షలో నెగ్గాడు

రాంచీ : జార్ఖండ్ అసెంబీల్లో సోమవారం నిర్వహించిన విశ్వాస పరీక్షలో హేమంత్ సోరెన్ ప్రభుత్వం విజయం సాధించింది. జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నేతృత్వంలోని 45 మంది ఎమ్మెల్యేలు విశ్వాస పరీక్షకు అనుకూలంగా ఓటు వేశారు. వ్యతిరేకంగా ఒక్కరూ ఓటు వేయలేదు. ఈ ఓటింగ్ జరగడానికి ముందే ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. విశ్వాస తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టిన సోరెన్ తరువాత చర్చ నిర్వహించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తుందని చర్చలో మాట్లాడుతూ సోరెన్ విమర్శించారు. సోరెన్ ప్రసంగం ప్రారంభించగానే బీజేపీ సభ్యులు అతనికి వ్యతిరేకంగా నినాదాలు ప్రారంభించారు. వెల్‌లోకి దూసుకొచ్చి ప్రసంగానికి అంతరాయం కలిగించడం ప్రారంభించారు.

'ఇప్పుడు నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యేల్లో సగం మంది కూడా వచ్చే అసెంబ్లీలో ఉండరు' అని సోరెన్ విమర్శించారు. ఈ చర్చలో మాజీ సీఎం చంపాయ్ సోరెన్ కూడా ప్రసంగించారు. ప్రతిపక్ష నేత అమర్ కుమార్ బౌరీ కూడా చర్చలో ప్రసంగించారు. సోరెన్, కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. చర్చ తరువాత ఓటింగ్ నిర్వహించారు. విశ్వాస పరీక్షలో హేమంత్ సోరెన్ ప్రభుత్వం విజయం సాధించిందని స్పీకర్ రబీంద్ర నాథ్ మహతో అధికారికంగా ప్రకటించారు. సోరెన్ సర్కారులో క్యాబినెట్ మంత్రిగా చంపన్ సోరెన్ ప్రమాణస్వీకారం చేయంచారు.

ఆరోగ్య పరీక్షల పేరిట దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

అందులో ఇప్పటికే 11 లక్షల మందికి పరీక్షలు నిర్వహించారన్నారు. ఇప్పుడు కుటుంబ సభ్యులకూ కూడా పరీక్షలు చేయించాలనీ, చేయించుకోకపోతే కార్డులు రద్దవుతాయని కార్మికులను సీఎస్‌సీ సంస్థ బెదిరించడమేంటని ప్రశ్నించారు. వందల సంఖ్యలో ఆరోగ్య క్యాంపులు నిర్వహిస్తున్నట్టు, కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్నట్టు లెక్కలు చూపడం దారుణమన్నారు. బ్లడ్ శాంపిల్స్ తీసుకుని గుండె పరీక్షలు కూడా చేశామని రిపోర్టులు ఎలా ఇస్తారని నిలదీశారు. రిపోర్టులకు సంబంధించిన పలు ఆధారాలను కూడా మీడియాకు చూపెట్టారు. ఎవరైనా కార్మికుడు అనారోగ్యం పాలైతే ఆ రోగానికి సంబంధించిన టెస్టులు చేయిస్తే బాగుంటుందిగానీ అవసరం లేకున్నా ఈ పరీక్షలు ఏంటని ప్రశ్నించారు. బీఓసీడబ్ల్యూ గతేడాది ఆరోగ్య పరీక్షల కోసం రూ.124 ఖర్చుచేసిందనీ, ఈ ఏడాది కూడా భారీ ఖర్చుగా పెడుతున్నారని గణాంకాలతో వివరించారు. కార్మిక శాఖ అధికారులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కయి నిధులను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షల పేరిట జరుగుతున్న దోపిడీకి అడ్డుకట్ట వేయాలనీ, సీఎస్‌సీ హెల్త్‌కేర్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఆరోగ్య పరీక్షలు అవసరమైతే ఉచితంగా నిర్వహించేలా ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎస్‌సీతో ఒప్పందంపై సమగ్ర విచారణ జరిపించాలనీ, బాధ్యులైన అధికారులు, రాజకీయ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, మహేందర్, భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా కార్యదర్శి బి.మధు, తదితరులు పాల్గొన్నారు.

మాస్కోలో మోడీ

మాస్కో : తన మిత్రుడు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో పూర్తి స్థాయిలో ద్వైపాక్షిక సహకారానికి సంబంధించిన అన్ని అంశాలపై చర్చిస్తానని ప్రధాని మోడీ తెలిపారు. రష్యాతో భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రత్యేకమైనదని వ్యాఖ్యానించారు. 22వ వార్షిక సదస్సు కోసం రెండు రోజుల పర్యటనకై మోడీ సోమవారం వెళ్లారు. ప్రధానంగా ఇంధనం, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, ఆరోగ్యం, విద్య, సంస్కృతి. పర్యాటకం, ప్రజల మధ్య సంబంధాలువంటి అంశాలపై దృష్టి కేంద్రీకరించనున్నట్లు చెప్పారు. ఉక్రెయిన్‌లో యుద్ధం, భవిష్యత్ శాంతి ప్రక్రియ కూడా వీరి ఎజెండాలో వున్నట్లు తెలుస్తోంది. వివిధ ప్రాంతీయ, అంతర్జాతీయఅంశాలపై అభిప్రాయాలు పంచుకుంటామన్నారు. ఈ ప్రాంతం శాంతియుతంగా, సుస్థిరంగా అభివృద్ధి చెందడానికి మద్దతునిచ్చే పాత్ర పోషించాలని భారత్ భావిస్తోందని చెప్పారు. మాస్కో విమానాశ్రయంలో మోడీకి సాదర స్వాగతం లభించింది. ఉజ్బెకిస్తాన్‌లో ఎస్‌సీఓ సమావేశాల సందర్భంగా 2022లో భేటీ అయిన తర్వాత మొదటిసారిగా ఇరువురు నేతలు మళ్లీ ఇప్పుడే సమావేశమవుతున్నారు. ఇది యుద్ధాల శకం కాదని ఆనాడు వ్యాఖ్యానించిన మోడీ తాజాగా ఉక్రెయిన్‌పై ఏ విధమైన సందేశం ఇస్తారా అని అందరూ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. గత నెల్లో జీ-7 సదస్సు సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో కూడా మోడీ భేటీ అయ్యారు. భారత్-రష్యా సంబంధాల భవిష్యత్‌పై కార్యాచరణను నిర్దేశించిలా సంయుక్త దార్శనికతా ప్రకటన వెలువడే అవకాశముందని భావిస్తున్నారు.

స్కిల్ వర్సిటీకి ఏర్పాట్లు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

శ్రీధర్‌బాబుతో చర్చించాలని చెప్పారు. నిర్ణీత గడువు పెట్టుకొని ప్రతిపాదనలు సిద్ధం చేయాలనీ, కేవలం 15 రోజుల వ్యవధే ఉన్నందున ప్రతి ఐదు రోజులకోసారి సమావేశం కావాలంటూ వారికి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యంతో ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలా? లేక ప్రభుత్వమే ఈ బాధ్యతలను చేపట్టాలా? మరేదైనా విధానం అనుసరించాలా? అనే విషయాలను కూడా పరిశీలించాలని చెప్పారు. యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు, ప్రాజెక్టు రిపోర్టులన్నీ తయారు చేసేందుకు ఆ రంగంలో నిపుణులైన ఒక కన్సల్టెంట్‌ను నియమించుకోవాలనీ, దీనికి పరిశ్రమల శాఖ నోడల్ డిపార్టుమెంట్‌గా వ్యవహరిస్తుందని తెలిపారు. సమావేశంలో ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్‌రెడ్డి, ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ రెడ్డిస్ ల్యాబ్ చైర్మెన్ సతీష్‌రెడ్డి, భారత్ బయోటెక్ హరిప్రసాద్, క్రెడాయ్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి, ఐ ల్యాబ్స్ శ్రీనిరాజు తదితరలు పాల్గొన్నారు.

బాలల హక్కులకు భంగం

సోషల్ మీడియాలో చిన్నారుల సమాచారం, చిత్రాలు

- గోప్యత హక్కుకు విఘాతం కలిగిస్తున్న తల్లిదండ్రులు
- వాణిజ్య పరంగానూ దోపిడీ



న్యూఢిల్లీ : తల్లిదండ్రులు తమ పిల్లల సమాచారాన్ని తరచూ సామాజిక మాధ్యమాలలో షేర్ చేస్తుంటారు. పాఠశాలలో బహుమతులు వచ్చినా, ప్రోత్సాహక సర్టిఫికెట్లు ఇచ్చినా, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నా వాటిని వీడియోల రూపంలో సామాజిక మాధ్యమాలలో బంధువులు, స్నేహితులతో పంచుకుంటారు. అయితే ఇది గోప్యతకు సంబంధించి చిన్నారులకు ఉన్న హక్కును ఉల్లంఘించడమే అవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి షేరింగుల ద్వారా చిన్నారుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లుతోందని యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ది రైట్స్ ఆఫ్ ఎ చైల్డ్ (యూఎన్‌సీఆర్‌సీ) తెలిపింది.

తల్లిదండ్రులు తమ పిల్లల అనుమతి లేకుండా వారి దైనందిక జీవితానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని, ఇబ్బందికరమైన చిత్రాలను లేదా ఇతర వివరాలను బహిర్గతం చేయడం వారి ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే అవుతుంది. ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్‌చాట్ వంటి సామాజిక మీడియా వేదికలలో పిల్లల కార్యకలాపాలను షేర్ చేయడం సర్వసాధారణమై పోయింది. దురదృష్టకరమైన విషయమేమంటే గోప్యతకు సంబంధించిన ఆందోళనను, భవిష్యత్తులో ఎదురయ్యే పరిణామాలను తల్లిదండ్రులు పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో పిల్లల సమాచారం, చిత్రాలను బహిర్గతం చేస్తే ఎదురయ్యే సమస్యలను గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

షేర్ చేసే ముందు...

పిల్లల అంగీకారం లేకుండానే వారి సమాచారం, చిత్రాలు, ఇతర వివరాలు సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతుంటాయి. తల్లిదండ్రులేమో తమ సంతానానికి మంచి పేరు వస్తుందని ఆనుకుంటారు. కానీ అదే సమయంలో పిల్లల స్వీయ నిర్ణయాధికారాన్ని గుర్తించడానికి ప్రయత్నించరు. ఏదేమైనా తల్లిదండ్రులు తమ పిల్లల సమాచారాన్ని, చిత్రాలను సామాజిక మాధ్యమాలలో షేర్ చేసేటప్పుడు అన్ని విషయాలను కూలంకషంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవడం మంచిది.

ఎల్డెన్ కేసు ఓ హెచ్చరికే

ఎదిగే కొద్దీ పిల్లలు తమ వ్యక్తిగత సమాచారాన్ని తల్లిదండ్రులు షేర్ చేయడాన్ని ఇష్టపడరు. నిర్వాణకు చెందిన నెవర్‌మైండ్ ఆల్బల్‌లో స్పెన్సర్ ఎల్డెన్ నగ్న బాలుడుగా కన్పించిన ఘటనకు సంబంధించిన కేసు ప్రస్తుత డిజిటల్ యుగంలో తల్లిదండ్రులకు ఓ హెచ్చరికగా నిలుస్తుంది. ఇప్పుడు ఎల్డెన్ వయసు 31 సంవత్సరాలు. ఆల్బమ్‌ను రూపొందించిన వారిపై అతను కేసు వేశాడు. తనను నగ్నంగా చూపడంతో శారీరకంగా, భావోద్వేగపరంగా నష్టపోయానని తెలిపాడు. తాను లైంగిక వేధింపులకు గురయ్యానని వాపోయాడు. ఆ చిత్రం 'బాలల లైంగిక దోపిడీ'కి సంబంధించినది తెలిసి కూడా దానిని రూపొందించి ప్రచారం చేశారని వాదించాడు. ఈ కేసు ఇప్పటికీ అమెరికా అప్పీళ్ల కోర్టులో పెండింగులో ఉంది.

ప్రమేయం లేకపోయినా...

పిల్లల హక్కులు, వారి గోప్యతకు సంబంధించిన విషయాలలో ఎవరూ జోక్యం చేసుకోకుండా యూఎన్‌సీఆర్‌సీ రక్షణ కల్పిస్తుంది. సాధారణంగా తల్లిదండ్రులు షేర్ చేసే సమాచారం లేదా చిత్రాలకు సంబంధించి పిల్లల ప్రమేయం ఏమీ ఉండదు.

వాణిజ్య పరంగా దోపిడీ

సామాజిక మాధ్యమ వేదికలలో సమాచార వ్యాప్తి అత్యంత వేగంగా జరిగిపోతుంది. తల్లిదండ్రులు తమ పిల్లల సమాచారాన్ని, చిత్రాలను వాటిలో పంచుకుంటే చిన్నారుల భవిష్యత్తు, ఆత్మగౌరవంపై ప్రభావం పడుతుంది. అలాంటి పరిస్థితులలో పిల్లలు తమ స్వంత ఇమేజ్‌ని, గుర్తింపును ఎలా పెంచుకుంటారు? ఇక్కడ మరో విషయాన్ని కూడా గమనించాలి. పిల్లల సమాచారం, చిత్రాలు షేర్ చేసినప్పుడు వారు వాణిజ్యపరమైన దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉంది. సోషల్ మీడియాను ప్రభావితం చేసే వారు, బ్లాగర్లు ఆ సమాచారాన్ని, చిత్రాలను వాణిజ్యపరంగా వాడుకొని డబ్బులు దండుకుంటారు. తల్లిదండ్రులు దీనిని ఆదాయ వనరుగా భావించవచ్చు. కానీ తమ పిల్లల ఇమేజ్‌ని వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుకోవడం అనర్థదాయకమే అవుతుంది.

అయితే ఈ సమాచారాన్ని, ఫొటోలను కొన్ని విద్యాసంస్థలు, యజమానులు, రొమాంటిక్ భాగస్వాములు వాడుకునే ప్రమాదం ఉంది. ఇది వివక్షకు, అవమానానికి దారితీస్తుంది. పిల్లల భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రభావం పడుతుంది. పిల్లలు ఎదిగే కొద్దీ తమ డిజిటల్ గుర్తింపును కాపాడుకుంటారు. కానీ వారి సమాచారాన్ని, చిత్రాలను షేర్ చేయడం వల్ల ఇబ్బందులు పడతారు.

రూర్కీలో 'కాళేశ్వరం' మోడల్ స్టడీస్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన డిటెయిల్డ్ ఎవల్యూషన్ మోడల్‌ను అధ్యయనం చేసేందుకు రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ ఈఎన్సీలు బి అనిల్‌కుమార్, నాగేందర్‌రావుల నేతృత్వంలోని ఇంజినీర్ల బందం ఉత్తరాఖండ్‌లోని రూర్కీ ఇన్‌స్టిట్యూట్‌కు తరలివెళ్లింది. ప్రధానంగా మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన పూర్తి నిర్మాణాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అధ్యయనం చేస్తున్నది. బ్యారేజీలో 20వ పిల్లర్ కుంగుబాటు వల్ల కలిగే నష్టాలు, ఇతర బ్లాక్‌లపై దాని ప్రభావం ఎలా ఉండబోతున్నది? వరదలతో అదనంగా ఏమైనా దెబ్బతినే అవకాశముందా? తదితర అంశాలపై కూలంకషంగా తెలుసుకుంటున్నది. కంప్యూటర్ ఆధారిత బ్యారేజీ నమూనాలను సైతం అధికారులు పరిశీలిస్తున్నారు.



ఈ పర్యటన శుక్రవారం కూడా కొనసాగనుందని ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. అనిల్‌కుమార్ 'నవతెలంగాణ'కు తెలిపారు.

గాఫ్ మరో'సారీ'

నాలుగో రౌండ్‌లో ఓటమి
రెండో సీడ్‌కు షాకిచ్చిన నావారో



లండన్ : ప్రతిష్టాత్మక వింబుల్డన్ మహిళల విభాగంలో సంచలనాలపై సంచనాలు చోటుచేసుకుంటున్నాయి. మొన్న డిఫెండింగ్ చాంపియన్ ఒండ్రుసోవా, నిన్న టాప్ సీడ్ స్వియటెక్ తిరుముఖంపడితే..ఈసారి రెండో సీడ్ కొకొ గాఫ్ వంతైంది. ఇక పురుషుల్లో తొమ్మిదో సీడ్ డిమినార్, 25వ సీడ్ ముసేటి క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో అమెరికాకే చెందిన 19వ సీడ్ ఎమ్మా నవారో వరుస సెట్లలో 6-4, 6-3తో టైటిల్ రేసులో హాట్ ఫేవరెట్ కొకొ గాఫ్‌కు షాకిచ్చింది. దాంతో ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో గాఫ్ మరోసారి నాలుగో రౌండ్ గండాన్ని దాటలేకపోయింది. గతంలో రెండుసార్లు (2019, 2021)లోనూ ఆమె నాలుగో రౌండ్‌లోనే పరాజయం చవిచూడటం గమనార్హం. గాఫ్ ఓటమి దరిమిలా ఇక మహిళల సింగిల్స్‌లో టాప్-10 క్రీడాకారిణుల్లో ఇద్దరే బరిలో మిగిలారు. నాలుగో సీడ్ రిబకినా, ఏడో సీడ్ పోలిని మాత్రమే పోటీలో ఉన్నారు. పోలిని ఇప్పటికే ప్రీక్వార్టర్స్ చేరగా..ప్రత్యర్థి కలినస్కయా వాకోవర్ ఇవ్వడంతో నాలుగో సీడ్ రిబకినా క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. మేజర్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లో తొలిసారి అడుగుపెట్టిన నవారినో..ఏడో సీడ్ పోలినితో అమీతుమీ తేల్చుకోనుంది. మహిళల సింగిల్స్ ఇతర రౌండ్-16 మ్యాచుల్లో సునేలుస్ (న్యూజిలాండ్) 6-2, 5-7, 6-2తో స్థానిక్ స్టార్, యూఎస్ ఓపెన మాజీ చాంపియన్ ఎమ్మా రదుకానును ఓడించింది. వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్ చేరిన తొలి న్యూజిలాండ్ క్రీడాకారిణిగా సునేలుస్ రికార్డు సష్టించింది. పురుషుల సింగిల్స్ నాలుగో రౌండ్‌లో డిమినార్ 6-2, 6-4, 4-6, 6-3తో ఆర్థర్ ఫిల్స్‌పై, ముసేటి 4-6, 6-3, 6-3, 6-2తో పెరీకార్డ్‌పై విజయంతో ముందంజ వేశారు.

అతడితో ఐదేండ్లుగా మంధాన డేటింగ్ !



బెంగళూరు : టీమిండియా స్టార్ బ్యాటర్ స్మృతి మంధానాకు సంబంధించిన ఓ అనూహ్య విషయం బయటకు వచ్చింది. మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్‌తో ఆమె ఐదేళ్లనుంచి రిలేషనషిప్ కొనసాగిస్తోంది. ఈ విషయాన్ని ముచ్చల్ స్వయంగా వెల్లడించాడు. తమ అనుబంధానికి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఫొటోను అతడు ఇనస్టాలో పోస్ట్ చేశాడు. ఈ చిత్రానికి 'మూడు హదయాల' ఎమోజీతో స్పందిస్తూ తమ రిలేషనషిప్‌ను టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి ధ్రువీకరించింది. 'మై క్యూటీస్' అంటూ పలాష్ సోదరి పాలక్ ఆ ఫొటోపై వ్యాఖ్యానించింది. పలాష్, మంధాన డేటింగ్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలను వారు తొలిసారి ధ్రువీకరించారు.

ఎవరీ పలాష్ ముచ్చల్

29 ఏళ్ల పలాష్ మ్యూజిక్ కంపోజర్, నటుడు. అశుతోష్ గోవారికర్ దర్శకత్వంలో వచ్చిన 'ఖేలే హమ్ జీ జాన్ సే' అనే చిత్రంలో అభిషేక్ బచ్చన్, దీపికా పదుకోనతో కలిసి నటించాడు.

రిక్షా, అర్ధ్ అనే వెబ్ సిరీస్‌లను పలాష్ డైరెక్ట్ చేశాడు. పలాష్ అక్క పాలక్ ముచ్చల్ బాలీవుడ్ గాయని.

గెలిచి తీరాల్సిందే..

- సిరీస్ సమంపై టీమిండియా
- జోష్‌లో దక్షిణాఫ్రికా
- నేడు మూడో టీ20



చెన్నై: దక్షిణాఫ్రికాతో వన్డే, టెస్టు సిరీస్‌ల్లో పూర్తిగా ఆధిపత్యం ప్రదర్శించిన భారత్ మహిళల జట్టు టీ20ల్లో మాత్రం వెనుకబడింది. ఇప్పటికే తొలి మ్యాచ్‌ను కోల్పోగా.. కీలక రెండో మ్యాచ్ వర్షార్పణమైంది. సఫారీల ఇన్నింగ్స్ సజావుగానే సాగినా.. భారత్ జట్టు మాత్రం బరిలోకి దిగలేకపోయింది. అందుకే నేడు జరిగే ఆఖరి మ్యాచ్ హర్మన్‌ప్రీత్ కౌర్ బృందానికి చావోరేవో లాంటిదే. ఈ మ్యాచ్ గెలిస్తేనే సిరీస్‌ను సమం చేసుకుని, ఓటమి లేకుండా మూడు ఫార్మాట్లనూ ముగించినట్టవుతుంది. ఇది జరగాలంటే వాతావరణం సహకరించడమే కాదు.. జట్టు బౌలింగ్ తీరు కూడా మారాల్సి ఉంది. తొలి రెండు మ్యాచుల్లో బౌలింగ్ పేలవ ప్రదర్శనతో ప్రత్యర్థి 189, 177 పరుగులు చేసింది. పూజా వస్త్రాకర్, దీప్తి శర్మ మినహా అంతా తేలిపోయారు. శ్రేయాంక, రాధా యాదవ్ తలా వికెట్ తీసినా పరుగులు నియంత్రించలేకపోయారు. ఈనేపథ్యంలో సిరీస్ ప్రమాదంలో ఉంది కాబట్టి బౌలర్లు రాణించక తప్పదు. అటు బ్యాటింగ్‌లో ఓపెనర్ స్మృతి మంధాన, జెమీమా, హర్మన్ కీలకంగా మారారు. అయితే, యువ ఓపెనర్ షఫాలీ ఆశించిన మేర ఆకట్టుకోలేక పోయింది. మరోవైపు దక్షిణాఫ్రికా తరఫున ఓపెనర్ బ్రిట్స్ రెండు హాఫ్ సెంచరీలతో ఫామ్‌లో ఉంది. వోల్వార్ట్, కాప్, బోష్ తమ వంతుగా పరుగులు సాధిస్తున్నారు. ఇదిలావుండగా మంగళవారం వర్షం కురిసే అవకాశం 40 శాతంగా ఉండటంతో మ్యాచ్‌కు కాస్త ఆటంకం కలిగే అవకాశం లేకపోలేదు.

జగజ్జేతలకు మాల్దీవులు ఆహ్వానం

మాలె: టీ20 వరల్డ్‌కప్ విజేతగా నిలిచిన భారత్‌కు మాల్దీవులు రెడ్‌కార్పెట్ పరిచింది. పొట్టికప్ విజయోత్సవ సంబరాలను తనదేశంలో నిర్వహించుకోవాల్సిందిగా ఆహ్వానం పంపింది. టీమిండియాకు ఆతిథ్యం ఇవ్వడం గౌరవంగా భావిస్తున్నామని మాల్దీవుల పర్యాటక శాఖ తెలిపింది. గత నెల 29న బార్బడోస్‌లో జరిగిన ఫైనల్లో సౌతాఫ్రికాను ఓడించిన భారత్ విశ్వవిజేతగా నిలిచింది. కాగా, ప్రధాని నరేంద్ర మోదీని పరుషంగా విమర్శించడంతో.. ఆ దేశ పర్యాటకాన్ని నిషేధించాలనే పిలుపు బలంగా వినిపించింది. దీంతో అక్కడకు వెళ్లే భారత టూరిస్టుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. మళ్లీ పర్యాటకులను ఆకర్షించాలనే ఎత్తుగడతోనే టీమిండియాకు ఆహ్వానం పలికారని నెటిజన్లు విమర్శిస్తున్నారు. మరి దీనికి బీసీసీఐ ఏవిధంగా స్పందిస్తుందో చూడాలి.

గ్లోబల్ చెస్ లీగ్ జట్టును కొనుగోలు చేసిన అశ్విన్



న్యూఢిల్లీ: భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ క్రీడా వ్యాపారంలోకి వచ్చాడు. టెక్ మహీంద్ర, ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ చెస్ లీగ్‌లో అమెరికన్ గాంబిట్స్ అనే జట్టును కొనుగోలు చేశాడు. ఈ జట్టుకు మరికొందరితో కలిసి అశ్విన్ సహ యజమానిగా ఉండనున్నాడు. లండన్ వేదికగా అక్టోబర్ 3 నుంచి 12 వరకు జరిగే ఈ లీగ్ లో ఆరు జట్లు పోటీ పడనున్నాయి. గతంలో ఉన్న చింగారి గల్ఫ్ టైటాన్స్ స్థానంలో అమెరికన్ గాంబిట్స్ జట్టు బరిలోకి దిగనుంది.



ప్రజల గురించి మాట్లాడే సినిమా

కమల్ హాసన్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో అగ్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్‌తో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు 2'.
ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈనెల 12న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్‌ఎల్‌పి, సీడెడ్ హక్కులను శ్రీలక్ష్మి మూవీస్ సంస్థలు దక్కించుకున్నాయి. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు.
కమల్ హాసన్ మాట్లాడుతూ.. 'మూడు తరాలు నన్ను ప్రేమిస్తూ, ప్రోత్సహిస్తూ ఇక్కడి వరకు తీసుకొచ్చారు. భారతీయుడు రిలీజ్ అయినప్పుడు ఈ సీక్వెల్ గురించి ఆలోచించలేదు. భారతీయుడు భారీ హిట్ అయింది. డబ్బులు వస్తాయా? అని అందరూ అన్నారు. కానీ ఇప్పుడు ఒక షెడ్యూల్‌కి పెట్టే ఖర్చే చాలా ఎక్కువగా ఉంది. శంకర్ విజన్ చాలా అద్భుతంగా ఉంటుంది. ఇప్పుడు ఇండియాలో తెలుగు సినిమాకు గొప్ప స్థానం ఉంది. నా జీవితంలోనూ తెలుగుకి గొప్ప స్థానం ఉంది. 'ఇండియన్ 2' ఇప్పటి తరానికి రిలవెంట్‌గా ఉంటుంది. జనాల గురించే ఈ చిత్రం మాట్లాడుతుంది. ఇది ప్రజల సినిమా. 28 ఏళ్ల తరువాత మళ్లీ అదే దర్శకుడు, అదే పాత్ర నాకు రావడం అదృష్టం. మంచి క్వాలిటీతో సినిమాను తీశాం. అందరూ చూడండి. ఏసియన్ సురేష్, శ్రీలక్ష్మీ మూవీస్ మా సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈనెల 12 కోసం నేను ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను' అని అన్నారు.
"భారతీయుడు' అయిన తరువాత చాలా సినిమాలు తీశాం. లంచం తీసుకునే వార్తలు చూస్తూనే ఉంటున్నాను. ఆ వార్తలు చూసినప్పుడల్లా నాకు సేనాపతి గుర్తుకు వస్తుంటాడు. 'భారతీయుడు 2' సినిమా సెట్‌లోకి సేనాపతిగా కమల్ హాసన్‌ని చూసి నాకు ఒక గూస్‌బంప్స్ వచ్చాయి. ఆడియెన్స్‌కి కూడా అలాంటి ఫీలింగే వస్తుంది. నేను రాసిన దాని కంటే.. ఆయన నటించిన తరువాత సీన్ స్థాయి పదింతలు పెరుగుతుంది. అలాంటి నటులు దొరకడం అదృష్టం. 'బాయ్స్' సినిమాతో సిద్దార్థ్‌ను నేను పరిచయం చేశాను. ఈ చిత్రంలో అద్భుతంగా నటించారు. రకుల్ ప్రతీ సీన్‌ను తెలుసుకుని, అర్థం చేసుకుని నటించారు. ఎస్ జే సూర్య ఎంత చేసినా సంతృప్తి అవ్వరు. బాబీ సింహా ప్రాణం పెట్టి నటించారు. సముద్రఖని వాయిస్ నాకు చాలా ఇష్టం. ఆయనలో ఓ డిగ్నిటీ కనిపిస్తుంటుంది. నేను బ్రహ్మానందంకి అభిమానిని. ఇందులో కేమియో రోల్‌లో కనిపిస్తారు. కాజల్ పార్ట్3లో కనిపిస్తారు. అనిరుధ్ సంగీతం, రవి వర్మన్ కెమెరా వర్క్ బాగుంటుంది. ముత్తు గారు అద్భుతమైన సెట్స్ వేశారు. శ్రీకర్ ప్రసాద్ సీన్‌లోని ఆత్మ పోకుండా కట్ చేశారు. యాక్షన్ సీక్వెన్స్‌లు అద్భుతంగా వచ్చాయి. తెలుగులో పాటలు అనుకున్నదాని కంటే బాగా ఇచ్చారు. నేను అనుకున్నది అనుకున్నట్టుగా తీసేలా సహకారం అందించిన లైకా సుభాస్కరణ్, రెడ్ జెయింట్‌లకు థ్యాంక్స్' అని డైరెక్టర్ శంకర్ చెప్పారు. గీత రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ, 'శంకర్ సినిమాలో మెసెజ్ ఎంతో గొప్పగా ఉంటుంది. నేను రాసిన పాట మూడో పార్టులో ఉంటుంది. ఈ రెండో పార్ట్ పెద్ద హిట్ అవుతుంది' అని చెప్పారు.

నవచిత్రం

మట్కా కోసం రిస్కీ ఫైట్స్


వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ నటిస్తున్న పాన్-ఇండియా మూవీ 'మట్కా'. ఈ చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించడానికి రెడీ అవుతున్నారు. కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీని వైర ఎంటర్టైన్మెంట్స్ డా. విజయేందర్ రెడ్డి తీగల, ఎస్ఆర్‌టీ ఎంటర్టైన్మెంట్స్ రజనీ తాళ్లూరితో కలిసి నిర్మిస్తున్నారు. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ గ్రాండ్ స్కేల్‌లో రూపొందుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. సినిమా కోసం నిర్మించిన మ్యాసీవ్ సెట్‌లో ఓ భారీ ఫైట్ సీక్వెన్స్‌ని షూట్ చేస్తున్నారు. సినిమాలో చాలా కీలకంగా ఉండే ఈ ఫైట్ సీక్వెన్స్ విజయ్ మాస్టర్ సూపర్ విజన్‌లో చిత్రీకరిస్తున్నారు. ఈ ఫైట్ సీక్వెన్స్ కోసం వరుణ్ తేజ్ చాలా రిస్కీ స్టంట్స్ పెర్ఫార్మ్ చేస్తున్నారు. ఈ హైవోల్టేజ్ ఫైట్ సీక్వెన్స్ సినిమాలో ఒక మేజర్ ఎట్రాక్షన్‌గా ఉండబోతోంది. దేశాన్ని కదిలించిన యదార్థ సంఘటనల ఆధారంగా దర్శకుడు కరుణ కుమార్ ఈ స్క్రిప్ట్‌ను రూపొందించారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటి నోరా ఫతేహి కీలక పాత్రలో కనిపించనుంది. వరుణ్ తేజ్ కెరీర్‌లో 'మట్కా' ఒక మైల్ స్టోన్ మూవీ కాబోతోంది. విభిన్నమైన చిత్రాలు చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్న డైరెక్టర్ కరుణ కుమార్ ఈ సినిమాని చాలా అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తూ ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో 'మట్కా' ఓ మెమరబుల్ మూవీగా నిలువనుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.



అమ్మలాలో రామ్ భజన..

ఎన్నో సక్సెస్‌ఫుల్ చిత్రాలను అందించిన ప్రతిష్టాత్మక సంస్థ జీఏ2 పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతున్న చిత్రం 'ఆయ్'. నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటిస్తున్నారు. అంజి కె.మణిపుత్ర ఈ చిత్రంతో దర్శకుడిగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. బన్నీ, విద్యా కొప్పినీడి ఈ ఫన్ ఎంటర్‌టైనర్‌ను నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పాటలు సూపర్బ్ రెస్పాన్స్‌ను రాబట్టుకున్నాయి. సోషల్ మీడియాలో రీల్స్, షార్ట్స్ రూపంలో తెగ వైరల్ అయ్యాయి. దీంతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 15న విడుదల చేస్తున్నారు.
తాజాగా ఈ సినిమా నుంచి 'అమ్మ లాలో రామ్ భజన..' అనే పాటను మేకర్స్ విడుదల చేశారు. 'పేరు లేదు ఊరు లేదు ప్రేమించేసిందండోయ్ ఆహా.. అమ్మ లాలో రామ్ భజన.. మాట లేదు.. మనువు లేదు.. మనసిచ్చేసిందండోయ్ అమ్మ లాలో రామ్ భజన..' అంటూ అమ్మాయి మనసులో ప్రేమను తెలియజేసేలా ఈ సినిమా నుంచి ఈ పాటను మేకర్స్ విడుదల చేశారు. శ్రీనివాసుడు, పద్మావతి అమ్మవారి మధ్య ప్రేమను తెలియజేసేలా సాగుతోన్న ఈ పాటను మన బుర్రకథ పంథాలో చిత్రీకరించటం వైవిధ్యంగా అనిపిస్తోంది. మన గొప్ప సంప్రదాయం, సంస్కృతికి హృదయపూర్వక నివాళిగా నిలుస్తుంది. అది పాటలో స్పష్టంగా చిత్రీకరించబడింది. అజయ్ అరసాడ సంగీతం అందించిన ఈ పాటను దర్శకుడు అంజి కె.మణిపుత్ర చాలా చక్కగా రాశారు. పెంచల్ దాస్ పాటను పాడిన తీరు చాలా సహజ సిద్ధంగా ఉంది.
గోదావరి బ్యాక్‌డ్రాప్‌తో ఈ సినిమా రూపొందింది. ఈ ఫన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో నార్నే నితిన్ ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. అల్లు అరవింద్ సమర్పణలో రూపొందుతోన్న ఈ సినిమాకు కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్‌గా, సమీర్ కళ్యాణి సినిమాటోగ్రాఫర్‌గా, రామ్ మిర్యాల సంగీత దర్శకుడిగా వర్క్ చేశారు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు - భాను ప్రతాప్, రియాజ్ చౌదరి, ఎడిటర్ - కోదాటి పవన్ కళ్యాణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - అజయ్ గద్దె, కాస్ట్యూమ్స్ - సుష్మిత, శిల్ప.

నవ్వించే చతుర్, వితుర్


శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర

ఆర్ వీ రెడ్డి సమర్పణలో ఆర్వీ సినిమాస్ పతాకంపై శ్రీనివాస్ రామిరెడ్డి, డా.తిమ్మప్ప నాయుడు పురిమెట్ల. శేషు మారంరెడ్డి నిర్మిస్తున్న సినిమా 'అరి'.
'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. వినోద్ వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్, శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.
'పేపర్ బాయ్' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న జయశంకర్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది.
త్వరలోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.
సోమవారం ఈ సినిమా నుంచి చతుర్, వితుర్‌గా శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర క్యారెక్టర్స్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ రివీల్ చేశారు. వీరిద్దరు పండితుల వేషధారణలో సంభాషిస్తున్న స్టిల్‌ను పోస్టర్‌గా విడుదల చేశారు. చతుర్, వితుర్ అనే పేర్లలోనే నవ్వు ధ్వనిస్తోంది. శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర ఈ పాత్రల్లో వినోదాన్ని అందించబోతున్నారని వేరే చెప్పక్కర్లేదు.
ఈ మూవీలో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ భాగస్వామి కానుంది.
రిలీజ్ డేట్‌ను అఫీషియల్‌గా మూవీ టీమ్ అనౌన్స్ చేయనుంది. ఈ చిత్రానికి మ్యూజిక్ : అనుప్ రూబెన్స్, ఎడిటర్ : జి. అవినాష్, లిరిక్స్ : కాసర్ల శ్యాం, వనమాలి, కళ్యాణ్ చక్రవర్తి.

అమాయక పోలీస్..


ప్రియాంక అరుల్ మోహన్

పాన్ ఇండియా అడ్రినలిన్ ఫిల్డ్ యాక్షన్-అడ్వెంచర్ 'సరిపోదా శనివారం'లో హీరో నాని సరసన ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తోంది. 'గ్యాంగ్ లీడర్' తర్వాత నానితో ఆమెకిది రెండో సినిమా. తాజాగా ప్రియాంక మోహన్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు.
ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ప్రియాంక మోహన్ చారులత అనే ఇన్నోసెంట్ పోలీసుగా కనిపించింది. ఖాకీ దుస్తులు ధరించి, భుజంపై బ్యాగ్‌తో నడుస్తూ అందమైన నవ్వుతో అందరినీ అలరిస్తోంది. సినిమాలో ప్రియాంక పాత్ర చాలా కీలకంగా ఉండబోతుంది.
వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డివివి ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, టాప్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తున్నారు.
ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ పాన్ ఇండియా చిత్రం ఆగస్టు 29న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. 'ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. ఇందులో నాని పాత్రతోపాటు ప్రియాంక అరుల్ మోహన్ పాత్ర సైతం చాలా భిన్నంగా ఉంటుంది. ఈ పాత్రలు కథలోని డెప్త్‌ని తెలియజేస్తూ అందర్నీ కచ్చితంగా అలరిస్తాయి' అని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, డీవోపీ: మురళి జి, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్, ఫైట్స్: రామ్-లక్ష్మణ్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

సామ్‌సంగ్‌లో కార్మికుల భారీ సమ్మె

- వేతనాల పెంపునకు ఆందోళన



సియోల్ : గ్లోబల్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్‌లో కార్మికులు భారీ సమ్మెకు దిగారు. మెరుగైన వేతనం కోసం సోమవారం మూడు రోజుల సమ్మెను ప్రారంభించారు. సామ్‌సంగ్ ప్రధాన కార్యాలయం సమీపంలో వర్షంలోనూ 3,000 మంది పైగా సిబ్బంది ర్యాలీకి హాజరయ్యారు. ఉద్యోగుల వేతన పెంపు, బోనసుల విధానంలో మార్పులు, సెలవుల విషయంలో ఆ కంపెనీలోని అతిపెద్ద యూనియన్ గత కొన్ని వారాలుగా ఆందోళనలు చేస్తోంది. కాగా.. సామ్‌సంగ్ 55 ఏళ్ల చరిత్రలోనే తొలిసారిగా గత నెల జూన్‌లో ఒక్క రోజు సమ్మె జరిగింది. దక్షిణ కొరియాలోని సియోల్‌కు 38 కిలోమీటర్ల దూరంలోని హ్వాసియోంగ్ లోని సామ్‌సంగ్ సెమీకండక్టర్ ప్లాంట్‌ల వెలుపల తాజాగా వేలాది మంది కార్మికులు నిరసనలో పాల్గొన్నారు. ఆ కంపెనీ యూనియన్లలో దాదాపు 30వేల మందికి పైగా కార్మికులతో నేషనల్ సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ యూనియన్ అతిపెద్దది.

భారీ సమ్మెతో కంపెనీకి చెందిన అత్యాధునిక చిప్ ప్లాంట్లలో ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఉత్పత్తికి అంతరాయం కలిగించడం ద్వారా యాజమాన్యానికి తమ డిమాండ్‌లను చేర్చడానికి ఈ వాకౌట్‌ను చేపట్టామని యూనియన్ ప్రెసిడెంట్ సన్ వూ మోక్ తెలిపారు. సంస్థలోని మొత్తం ఉద్యోగులకు మూల వేతనంలో 3 శాతం పెంపు, అదనపు సెలవులు కోరుతున్నామన్నారు. బోనస్ విధానంలో తాము సమానత్వాన్ని కోరుకుంటున్నామన్నారు. సంఘటిత కార్మికులకు వార్షిక సెలవులతో పాటు బోనస్ విధానంలోనూ మార్పులు తేవాలని డిమాండ్ చేస్తున్నారు. జులై 10 వరకు ఆందోళనలు కొనసాగించనున్నట్లు యూనియన్ వైస్ ప్రెసిడెంట్ లీ హ్యూన్ తెలిపారు. సామ్‌సంగ్ యాజమాన్యం తమ ప్రతిపాదనలను పరిష్కరించకపోతే మరిన్ని సమ్మెలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

హెచ్‌సిఎల్‌టెక్ బాస్ రోష్నీకి ఫ్రాన్స్ అత్యున్నత పురస్కారం



బెంగళూరు : ఐటి సేవల సంస్థ హెచ్‌సిఎల్‌టెక్ ఛైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రాకు ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారం దక్కింది. సోమవారం "చెవలియర్ డి లా లెజియన్ "హాన్నూర్" (నైట్ ఆఫ్ ది లెజియన్ ఆఫ్ హానర్)ను ఆమెకు ప్రదానం చేశారు. ఈ అవార్డును ఢిల్లీలో ఫ్రెంచ్ రిపబ్లిక్ అధ్యక్షుడి తరపున భారత ఫ్రాన్స్ రాయబారి థియరీ మాథౌ అందజేశారు. "ఈ గౌరవాన్ని అందుకోవడం నా అదృష్టం. ఇది భారత్, ఫ్రాన్స్‌ల మధ్య వ్యూహాత్మక సంబంధాన్ని నొక్కి చెబుతుంది. హెచ్‌సిఎల్‌టెక్ ఫ్రాన్స్‌లో దీర్ఘకాల ఉనికిని కలిగి ఉంది. ఫ్రెంచ్ వ్యాపారాల డిజిటల్ పరివర్తనకు మద్దతు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నాము" అని రోష్ని నాడార్ పేర్కొన్నారు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రుణాలు ప్రియం

- వడ్డీ రేట్ల పెంపు

న్యూఢిల్లీ : దిగ్గజ ప్రయివేటు రంగ విత్త సంస్థ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తమ రుణగ్రహీతలపై భారం మోపింది. రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్ (ఎంసిఎల్ఆర్) బెంచ్‌మార్క్‌ను 10 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో ఇది వరకు 9.05 శాతం నుంచి 9.40శాతం మధ్య ఉన్న వడ్డీ రేట్లు తాజాగా మరో 0.10 శాతం పెరగనున్నాయి. సవరించిన కొత్త వడ్డీ రేట్లు జులై 8 నుంచి అమల్లోకి వచ్చాయని వెల్లడించింది. దీంతో గృహ, వాహన, రిటైల్ రుణ వాయిదాల చెల్లింపులు భారం కానున్నాయి.

ఐటిసి ఆశిర్వాద్ నుంచి స్వాస్తి నెయ్యి

హైదరాబాద్ : ప్రముఖ ఎఫ్ఎంసిజి బ్రాండ్ ఐటిసి తక్కువ కొలెస్ట్రాల్‌తో కొత్తగా ఆశీర్వాద్ స్వాస్తి నెయ్యిని విడుదల చేసినట్లు తెలిపింది. మంచి సువాసన, రుచితో పాటు సాధారణ అవు నెయ్యి కంటే 90 శాతం తక్కువ కొలెస్ట్రాల్‌తో ఇది లభిస్తుందని ఆ కంపెనీ మార్కెటింగ్ హెడ్ అభిషేక్ మెహరోత్ర తెలిపారు. ఆరోగ్యానికి సంబంధించిన కొలెస్ట్రాల్ ఆందోళనలు కలిగిన వినియోగదారులు తమకు ఇష్టమైన వంటకాల్లోనూ దీన్ని ఉపయోగించవచ్చన్నారు. కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి ఆధునిక ప్రక్రియను వినియోగించామన్నారు.

వన్ పాయింట్ వన్ సొల్యూషన్స్‌కు మరో కొత్త క్లయింట్

న్యూఢిల్లీ : టెక్నాలజీ ఆధారిత బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ సేవల ప్రొవైడర్ అయిన వన్ పాయింట్ వన్ సొల్యూషన్స్ లిమిటెడ్ తమకు మరో కొత్త క్లయింట్ విజయం దక్కిందని తెలిపింది. ఆ క్లయింట్ దేశంలోని అతిపెద్ద విద్యుత్ కంపెనీలతో ఒక్కటని స్టాక్ ఎక్స్చేంజీలకు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది. సోలార్ రూఫ్‌టాప్, వాల్యూ యాడెడ్ సర్వీసెస్‌తో సహా వాల్యూ చైన్‌లోని ప్రతీ ఇంధన రంగాన్ని నడిపించడంలో తమ బ్రాండ్ ఘనత పొందిందని పేర్కొంది.

ఎన్ఎస్ఇఎఫ్ఐతో సర్వోటెక్ పవర్ జట్టు

న్యూఢిల్లీ : నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఇఎఫ్ఐ)తో సర్వోటెక్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్ జట్టు కట్టింది. ఇందులో భాగంగా ఢిల్లీలో తొలి గ్రిడ్ కనెక్ట్ చేయబడిన సోలార్ పవర్డ్ ఇవి ఛార్జింగ్ కార్‌పోర్ట్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. పైలట్ ప్రాజెక్ట్‌గా హౌజ్ ఖాస్ విలేజ్ పార్కింగ్ స్టేషన్‌లో దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. సర్వోటెక్ పవర్ సిస్టమ్స్ వ్యవస్థాపకులు రామన్ భాటియా, ఎండి అమర్జీత్ సింగ్ దీన్ని ప్రారంభించారు. కార్‌పోర్ట్‌ను స్థాపించడానికి ఉపయోగించే సోలార్ ప్యానెల్‌లు, ఇవి ఛార్జర్‌లను సర్వోటెక్ తయారు చేసింది.

జెరోదాలో మళ్లీ సాంకేతిక సమస్య

న్యూఢిల్లీ : ప్రముఖ స్టాక్ బ్రోకరేజ్ యాప్ జెరోదాలో మళ్లీ సాంకేతిక సమస్య చోటు చేసుకుంది. సోమవారం ఉదయం ఆ యాప్‌లో పెట్టిన స్టాక్ ఆర్డర్లు ఎగ్జిక్యూట్ కాలేదని ఖాతాదారులు ఫిర్యాదు చేశారు. తిరిగి కనీసం రద్దు చేసుకోవాలని ప్రయత్నించినప్పటికీ డబ్బు వాపస్ తీసుకోవడానికీ వీలు లేకుండా పోయిందని వాపోయారు. ఆర్డర్ ప్రాసెసింగ్‌లో ఉన్నందున డబ్బు ఉపసంహరించుకోలేరని యాప్‌లో సమాచారం రావడంతో ఖాతాదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వినియోగదారులు వారి అసహనాన్ని స్క్రీన్ షాట్లతో సోషల్ మీడియాలో పోస్టింగ్ చేశారు.

ప్రభుత్వోద్యోగులకు మీడియా సంబంధాలపై శిక్షణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వోద్యోగులకు మీడియా, ప్రజా సంబంధాలపై మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డాక్టర్ రావులపాటి మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు సర్క్యులర్ పంపినట్టు పేర్కొన్నారు. ఈనెల18 నుంచి 20 వరకు నిర్వహించనున్న ఈ శిక్షణలో పాల్గొనేవారు తమ శాఖ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 12 వరకు ధరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు.

"చదువుకుంటాం.. టీచర్లు కావాలి"

విద్యార్థుల ధర్నా



నవతెలంగాణ-జగదేవపూర్

"మేము చదువుకుంటాం, మాకు ఉపాధ్యాయులు కావాలి" అంటూ విద్యార్థులు ధర్నా చేపట్టిన సంఘటన సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవపూర్ మండలం బిజీ వెంకటాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరు. దీంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి మండల వనరుల కేంద్రంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు ఎంపీటీసీ కిరణ్ గౌడ్, సర్పంచ్ మంజుల రమేష్ మాట్లాడారు. పాఠశాలలో 32 మంది విదార్థులు ఉన్నారని, అందులో ఒకే ఉపాధ్యాయుడు విద్యను బోధించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. విద్యార్థులు లేని దగ్గర ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి మండల విద్యాధికారికి విన్నవించినా శాశ్వత పరిష్కారం చూపలేదని తెలిపారు.

వేరే పాఠశాలల నుంచి తాత్కాలికంగా మాత్రమే ఒక ఉపాధ్యాయుడిని పంపారని, వాళ్ళు ఇప్పుడు బదిలీల పేరుతో వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము తమ సొంత డబ్బులతో విద్యా వాలంటీర్‌ను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలను కాపాడుతామని చెబుతున్న ప్రభుత్వం.. తక్షణమే మరో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను పంపి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు మండల వనరుల కేంద్రంలో ఐఆర్‌పీ గోవర్ధన్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

- మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రాథమిక విద్యను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని, మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. పాఠశాలల నిర్వహణ గాలికి వదిలేయడం వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, మధ్యాహ్న భోజన సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాలల సమస్యలను లేఖ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే, సమస్యలే లేవని విద్యాశాఖ ప్రకటించిందని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించకుండా, వాస్తవాలను పక్కనబెట్టడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తాను స్వయంగా సిద్దిపేట నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంలో అనేక సమస్యలు గుర్తించానని పేర్కొన్నారు.

ఐదు నెలలుగా కుక్, హెల్పర్లకు జీతాలు అందలేదనీ, మధ్యాహ్న భోజనానికి సంబంధించి నాలుగు నెలల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. పేద విద్యార్థుల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ ఆగిపోయిందని పేర్కొన్నారు. వీటితో పాటు క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలను గుర్తించినట్టు హరీశ్‌రావు తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రదాడి

- నలుగురు సైనికులు మృతి
- ఆరుగురికి తీవ్రగాయాలు

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని కతువా జిల్లాలో సోమవారం జరిగిన ఉగ్రదాడిలో నలుగురు సైనికులు మృతి చెందగా, మరో ఆరుగురు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో బద్నోటా గ్రామం సమీపానికి వచ్చిన ఆర్మీ పెట్రోలింగ్ వాహనాలపై ఉగ్రవాదులు ఆకస్మాత్తుగా దాడికి దిగారు. రహదారికి ఇరు వైపుల నుంచి కూడా ఉగ్రవాదులు కాల్పులకు దిగినట్లు ప్రాథమిక సమాచారం ప్రకారం తెలుస్తోంది. సైన్యానికి చెందిన 9 కార్ప్స్ (రైజింగ్ స్టార్ కార్ప్స్) వాహనాలు పెట్రోలింగ్‌కు వచ్చిన సమయంలో ఈ దాడి జరిగింది. ఒకవైపు కొండ, మరోవైపు ఏటవాలు ఉన్న ప్రదేశంలో ఈ దాడి జరగడంతో ఉగ్రవాదుల ఉనికిని వెంటనే గుర్తించలేకపోయారు. ఉగ్రవాదుల కాల్పుల్లో ఒక ట్రక్కు తీవ్రంగా దెబ్బతింది. ఉగ్రవాదుల కాల్పులకు వెంటనే స్పందించిన ఆర్మీ కూడా వెంటనే ఎదురు కాల్పులు ప్రారంభించింది. అలాగే ఘటనా స్థలం నుంచి ఉగ్రవాదులు పారిపోకుండా ఆ ప్రదేశానికి అదనపు బలగాలను తరలించారు. ఎలైట్ పారా ట్రూపర్లను స్థలానికి పంపారు. గాయపడిన సైనికులను కథువా ఆసుపత్రికి తరలించారు. 2016 జులై 8న దక్షిణ కాశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమైన హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ బుర్హాన్ వనీ వర్ధంతి నేపథ్యంలో ఈ ఉగ్రదాడి జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు.

కాగా, జమ్ముకాశ్మీర్‌లో గత 48 గంటల్లో ఇది నాల్గవ ఉగ్రవాద సంబంధిత ఘటన. జులై 6,7 తేదీల్లో దక్షిణ కాశ్మీర్‌లోనే జరిగిన రెండు వేరువేరు ఎన్‌కౌంటర్లల్లో ఆరుగురి ఉగ్రవాదులు, ఇద్దరు సైనికులు హతమయ్యారు. శనివారం రాజౌరిలో జరిగిన ఉగ్రదాడిలో ఒక సైనికుడు తీవ్రంగా గాయపడ్డారు. జూన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లల్లో మొత్తంగా ఐదుగురు ఉగ్రవాదులు మరణించగా, ఒక భద్రత మృతిచెందాడు. ప్రయాణీకుల బస్సుపై గత నెల 9న జరిగిన ఉగ్రదాడిలో తొమ్మిది మంది సాధారణ పౌరులు మరణించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఎంజేపీ సెక్రటరీ బడుగు సైదులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి వాలీబాల్ విభాగంలో ఎంపికైన మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యార్థి బి బంతిలాల్‌ను ఎంజేపీ సొసైటీ సెక్రటరీ బడుగు సైదులు అభినందించారు. నిజామాబాద్ జిల్లా ధర్మవరం మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల జూనియర్ కాలేజీలో ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్న బంతిలాల్ ఈ నెల మూడున సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలో పాల్గొని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో సోమవారం తనను కలిసిన బంతిలాల్‌ను కార్యదర్శి శాలువతో సత్కరించారు. ఎంజేపీ గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలనీ, వారికి కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని సైదులు ఈ సందర్భంగా తెలిపారు.

అసమర్థ పాలనతోనే పంచాయతీలకు నిధుల కొరత

- ఎన్నికల ఫండ్ కింద ఎస్‌డీఎఫ్ ఫండ్ రూ.1,200 కోట్లు వాడుకున్నట్టు అనుమానం : బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనతో రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు నిధుల కొరత ఏర్పడిందని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నాలుగైదు నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించలేదని చెప్పారు. పారిశుధ్య పనుల నిర్వహణకు కూడా నిధుల్లేని పరిస్థితి దాపురించిందన్నారు. ఆరు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ. 36 వేల కోట్ల అప్పులు చేసిందనీ, కనీసం 40 శాతం మ్యాచింగ్ గ్రాంట్ కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో బేరసారాలు ఆడటం తప్ప ప్రజా సమస్యలు రేవంత్‌రెడ్డికి పట్టడం లేదన్నారు.

కేకేతో రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయించుకుని పార్టీలో చేర్చుకున్నారనీ, ఎమ్మెల్యేల విషయంలో అలా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఎస్‌డీఎఫ్ కింద నియోజకవర్గానికి పది కోట్ల రూపాయల నిధులిస్తామన్న సీఎం హామీ ఏమైందని నిలదీశారు. రూ.1,200 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులను కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల ఫండ్ కింద ఇచ్చారేమో అనుమానం కలుగుతున్నదని ఆరోపించారు. సీఎం, డిప్యూటీ సీఎం నియోజకవర్గాల్లో తప్ప ఎక్కడా అభివృద్ధి పనులు చేయడం లేదని విమర్శించారు.

బదిలీలు పారదర్శకంగా ఉండాలి

- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగుల సాధారణ బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని ఆ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారుల్ని ఆదేశించారు. సోమవారంనాడాయన బదిలీల అంశంపై ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన జీవో నెంబర్ 80 నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించారు. వర్కింగ్ క్యాడర్ స్ట్రెంత్‌లో 40శాతం ఉద్యోగుల బదిలీలకు అవకాశం ఉన్నదని చెప్పారు. ఏఎన్ఎంల నుంచి ప్రొఫెసర్ల స్థాయి వరకు బదిలీల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తు, ఆయుష్ కమిషనర్ ప్రశాంతి, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్వీ కర్ణన్, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, ఐపీఎం డైరెక్టర్ శివలీల పాల్గొన్నారు.

ఉస్మానియా ఆస్పత్రికి సీఎస్ఆర్ నిధులివ్వండి

- ఫార్మాకంపెనీలకు మంత్రి విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పన కోసం ఫార్మా కంపెనీలు పెద్ద మొత్తంలో సీఎస్ఆర్ నిధులు ఇవ్వాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు. సోమవారంనాడాయన ఫార్మా కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో పేషంట్ కేర్, శానిటేషన్, డైట్, బయో - మెడికల్ వేస్టేజ్, డ్రింకింగ్ వాటర్ సప్లయ్‌తో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సహకారం అందించాలని కోరారు. దీనిపై ఫార్మాకంపెనీల ప్రతినిధులు తమ ప్రతిస్పందన తెలుపుతూ ఈ వారంలో ఆయా ఆస్పత్రుల్లో క్షేత్రస్థాయి పరిశీలనలు చేసి, ప్రభుత్వానికి ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావుతో పాటు ప్రధానమైన 12 ఫార్మాకంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో కొనసాగుతున్న కులవివక్ష

- ఏసీపీ, ఆర్డీఓలు మూడు సార్లు సందర్శించినా మారని వైనం
- మాదిగల కులవృత్తిని మూయించిన అగ్రవర్ణాలు
- ఏసీపీ కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు



నవతెలంగాణ-జగదేవపూర్

సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో కుల వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉంది. దీంతో సోమవారం కులపెద్దలు, ఎంఆర్‌పీఎస్ నాయకులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఏసీపీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుల పెద్దలు, ఎంఆర్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ.. గతంలో హనుమాన్ గుడికి వచ్చినా, మంగలి వారు మాదిగలకు చెట్ల కింద కటింగ్ చేసినా ఊరిలో పలుమార్లు ఘర్షణలు జరిగాయని తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని.. గ్రామంలో జరిగే ఎలాంటి కార్యక్రమానికైనా మాదిగ వాళ్లను డప్పులు కొట్టడానికి రావద్దని అగ్రకులస్తులు ఎస్సీ, ఎస్టీ కుల పెద్దలకు హుకుం జారీ చేశారని చెప్పారు. అందులో భాగంగానే ఊరిలో చావులకు, పెండ్లిండ్లకు తమను రానివ్వడం లేదని అన్నారు. ఊరిలోని పెద్దమనుషులు అందరం కలిసి ఉందామని చెప్పాల్సింది పోయి, మాదిగల ను కులం పేరుతో తిడుతూ అన్ని కులాల్లో ఉన్న యువత ను రెచ్చగొడుతున్నారని వాపోయారు. గ్రామంలో ఎలాంటి గొడవలకు దారి తీయకముందే పోలీసులు, అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఏసీపీ కార్యాలయంలో విన్నవించినట్టు తెలిపారు.

కాగా, వీరికి ఎమ్మార్పీఎస్ నాయకులు మైస రాములు సంపూర్ణ మద్దతు ప్రకటించా రు.ఈ కార్యక్రమంలో కులం పెద్దమనిషి పోసాన్ పల్లి కనకయ్య, మైసయ్య, రమేష్, కనకయ్య, కిష్టయ్య, నవీన్, స్వామి, ఉప్పలయ్య, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభవన్‌లో వైఎస్ఆర్ జయంతి

- నివాళులర్పించిన మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతిని సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత కరెంటు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను అందించిన మహనీయుడని కొనియాడారు. తెలుగు రాష్ట్రాల ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి ఆయన ఎనలేని కృషి చేశారని ప్రశంసించారు. ఆయన పేదల జీవితాల్లో ఎల్లప్పుడూ ఉంటారని చెప్పారు.

సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోండి

- అధికారులకు దానకిషోర్ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు సీజనల్ వ్యాధులు, డెంగ్యూ జ్వరాల భారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఆరోగ్య విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులను పూర్తి స్థాయిలో అరికట్టడం, దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్స్ నిర్వహిం చడం, స్థానికంగా ఉన్న చెరువులు, కుంటలు, నాలాలలో స్ప్రే ఆపరేషన్స్ చేపట్టడం, స్థానిక ప్రజా ప్రతినిధులు, మీడియా సహకారంతో డెంగ్యూ జ్వరాలపై అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. శానిటేషన్‌తో పాటు ప్రతి కాలనీలలో వాలంటీర్స్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని ప్రజలలో అవగాహన పెంచాలన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 268 బస్తీ దవాఖానాలను ప్రతి రోజు డిప్యూటీ కమిషనర్లు, సహాయ మెడికల్ అధికారులు సందర్శించి రోజు వారీగా నమోదవుతున్న డెంగ్యూ జ్వరాల వివరాలను సేకరించాలని సూచించారు. వాటి తీవ్రత పెరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు.

ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్-2 ఫలితాలు విడుదల

- టీజీపీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, మెడికల్ ఎడ్యుకేషన్‌లో ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులకు సంబంధించి ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాత్కాలికంగా (ప్రొవిజినల్) ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేశామని తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలు www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. 200 ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి 2017, డిసెంబర్ 18న నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే.

మొదటి రోజు 8,823 వెబ్‌ఆప్షన్ల నమోదు

- ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో 95,655 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరానికిగాను 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో సోమవారం నుంచి వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటిరోజు 567 మంది 8,823 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. ఈనెల 12 వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు. సోమవారం 16,633 మంది అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించారని తెలిపారు. ఇప్పటి వరకు 95.655 మంది అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించారని వివరించారు.ఈనెల 13 వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందనీ, 15 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు. ఈనెల 19న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు.అభ్యర్థులు ఇతర వివరాల కోసం www.://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. 173 ఇంజినీరింగ్ కాలేజీల్లో 98,296 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో కన్వీనర్ కోటా ద్వారా విద్యార్థులు చేరేందుకు 70,307 సీట్లున్నాయి.

రేపు డీసెట్

- 17,655 మంది దరఖాస్తు
- 39 కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో 2024-26 బ్యాచ్ ప్రవేశాల కోసం డీసెట్-2024 ప్రవేశ పరీక్ష బుధవారం ఆన్‌లైన్‌లో జరగనుంది. ఈ మేరకు డీసెట్ కన్వీనర్ ఎస్ శ్రీనివాసాచారి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 17,655 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఈ పరీక్ష నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 39 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. బుధవారం రెండు విడతల్లో రాతపరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి విడతలో తెలుగు మాధ్యమం అభ్యర్థులకు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తామని పేర్కొన్నారు. ఉదయం 9.45 గంటల వరకే అభ్యర్థులను అనుమతిస్తామనీ, ఆ తర్వాత గేట్లు మూసే స్తామని తెలిపారు. రెండో విడతలో ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమం అభ్యర్థులకు మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని వివరించారు. మధ్యాహ్నం 2.45 గంటల వరకే అభ్యర్థులను అనుమతిస్తామనీ, ఆ తర్వాత గేట్లు మూసేస్తామని తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు http://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

'గురుకులం'లో బిల్డింగ్ పైనుంచి కిందపడి..

- విద్యార్థిని వెన్నెముకకు, కాలుకు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-రాయికోడ్

గురుకుల పాఠశాల బిల్డింగ్ రెండో అంతస్తు పైనుంచి ఓ విద్యార్థిని ప్రమాదవశాత్తు కింద పడింది. ఈ ప్రమాదంలో ఆమె వెన్నెముక, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. దాంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం అల్లాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం జరిగింది. బాధిత విద్యార్థిని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయికోడ్ మండలం యూసూపర్ గ్రామానికి చెందిన మల్లేశ్వరి అల్లాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నది. అయితే సోమవారం ఆరో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని రెండో అంతస్తులోని తన రూమ్‌లోని పెట్టెలో డబ్బులున్నాయని.. వాటిని తెచ్చేందుకు తోడుగా రమ్మని మల్లేశ్వరిని అడిగింది. దాంతో వారిద్దరూ కలిసి రెండో అంతస్తుపైకి వెళ్లారు. డబ్బులు తీసుకోవడానికి ఆ అమ్మాయి రూమ్‌లోకి వెళ్ళగా.. మల్లేశ్వరి మాత్రం ప్రహరీ గోడ పక్కన బకెట్‌పై నిల్చొని బయటకు చూస్తోంది. ఈ క్రమంలో అక్కడినుంచి ప్రమాదవశాత్తు కిందపడింది. అయితే ఎవరో గుర్తు తెలియని వారు తనను కిందికి తోసేసినట్టు బాధిత విద్యార్థిని చెబుతోంది.

16 వరకు అఫిడవిట్లు దాఖలు చేయండి

- కాళేశ్వరం న్యాయ కమిషన్ ఆదేశం
- 14 మంది పంపుహౌజ్ ఇంజినీర్ల విచారణ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మూడు బ్యారేజీలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తదుపరి కార్యాచరణకు సమాయత్తమవుతున్నది. సాగునీటి పారుదల, అభివృద్ధి శాఖ ఇంజినీర్లతోపాటు నిర్మాణ సంస్థల ప్రతినిధుల నుంచి ఇప్పటికే వచ్చిన అఫిడవిట్లను అధ్యయనం చేసే పనిలో కమిషన్ నిమగ్న మైంది. అనంతరం అందులోని ఆయా అంశాల ఆధారంగా నోటీసులు జారీచేసి సాక్ష్యాలు నమోదు చేయనున్నారు. ఆ తర్వాతే బహిరంగ విచారణ ప్రక్రియకు శ్రీకారం చుడతారు. విచారణ ప్రక్రియలో భాగంగా సోమవారం పీసీ ఘోష్ కమిషన్ ముందు పంపుహౌజ్ నిర్మాణ సంస్థలకు చెందిన 14 మంది ఇంజినీర్లు, అధికారులు హాజరయ్యారు. సంబంధీకుల నుంచి అవసరమైన వివరాలు, సమాచారం అడిగి తీసుకున్నారు. వారిని కూడా అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. అఫిడవిట్ల దాఖలుకు ఈనెల 16వ తేదీ వరకు గడువిచ్చారు. పంపుహౌజుల నిర్మాణ సంస్థల ప్రతినిధులు కూడా కమిషన్ ముందుకు వచ్చారు. ఇదిలావుండగా కాళేశ్వరం ప్రాజెక్టుపై గతంలో ఇచ్చిన నివేదికను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) ఈ కమిషన్‌కు అధికారికంగా సమర్పించింది. నివేదికను పరిశీలించిన తర్వాత కాగ్ అధికారులను పిలిచి పూర్తి వివరాలను విచారించే ఆలోచనలో ఘోష్ కమిషన్ ఉన్నట్టు సమాచారం. కమిషన్‌కు సహాయకారిగా ఉండేందుకు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ కూడా మూడు బ్యారేజీలకు సంబంధించి తమ అధ్యయన నివేదికను కమిషన్‌కు అందజేసింది. తుది నివేదిక ఇవ్వాలని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ, విజిలెన్స్ విభాగాన్ని కమిషన్ మరోసారి ఆదేశించింది. కాళేశ్వరం బ్యారేజీలకు సంబంధించిన అంశాలపై అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా కమిషన్ ఆదేశించిన సంగతి తెలిసిందే. సర్కారు దగ్గర ఉన్న సమాచారంతోపాటు ఇతర అంశాలకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని కమిషన్ సర్కారును కోరింది. పంపుహౌజ్ ఇంజినీర్లతో సుదీర్ఘంగా విచారించినట్టు తెలిసింది. పంపుహౌజుల మునక, కారణాలు, పునరుద్ధరణ, ప్రస్తుత పరిస్థితి, అయిన ఖర్చు తదితర అంశాల పై స్పష్టత కోరినట్టు తెలిసింది. ఈమేరకు అందరూ ఈనెల 16లోగా అఫిడవిట్లు సమర్పించాలని ఆదేశించింది.

సినిమాల్లో వైకల్యాన్ని అవహేళన చేయొద్దు

- దీనివల్ల వివక్ష మరింత పెరుగుతుందని సుప్రీం వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : సినిమాల్లో, విజువల్ మీడియాలో వికలాంగులను మూస పద్ధతిలో చిత్రీకరించడం వివక్షను శాశ్వతం చేస్తోందని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. వికలాంగులను ఇలా అపహాస్యం చేయడం లేదా అపోహలకు గురిచేసేలా వ్యవహరించడం కన్నా వారి వైకల్యాలకు సంబంధించిన ప్రాతినిధ్యాన్ని మరింత కచ్చితమైన రీతిలో తెరపై చూపించాలని సూచించింది. వికలాంగులకు ఒక ముద్ర వేసేటువంటి పదజాలాన్ని ఉపయోగించవద్దని జస్టిస్ జె.బి.పర్దివాలా సూచించారు. సోనీ పిక్చర్స్ తీసిన 'ఆనఖ్ మిచోలి' చిత్రంలో వికలాంగులను చూపించిన తీరును సవాలు చేస్తూ సామాజిక కార్యకర్త నిపున్ మల్హోత్రా పిటిషన్ వేశారు. దానిపై సుప్రీం సోమవారం విచారణ జరిపి, తీర్పు వెలువరించింది. వికలాంగుల పట్ల ఈ రీతిలో వివక్షను ప్రదర్శించడం వల్ల వారి గౌరవ, మర్యాదలకు భంగం వాటిల్లుతుందని కోర్టు అభిప్రాయపడింది. చారిత్రకంగా కూడా వికలాంగులపై ఈ అణచివేత ధోరణి కొనసాగుతూనే వుందని పేర్కొంది. సినిమాల్లో కామెడీని పండించడానికి వీరిని వాడుకుంటున్నారంటూ సుప్రీం బెంచ్ తన తీర్పులో ఆందోళన వ్యక్తం చేసింది.


ఢిల్లీ పోలీసుల ఎఫ్ఐఆర్‌పై తీవ్రంగా స్పందించిన మహువా మొయిత్రా

న్యూఢిల్లీ : తనపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై టిఎంసి ఎంపి మహువా మొయిత్రా తీవ్రంగా స్పందించారు. జాతీయ మహిళా కమిషన్ (ఎన్సిడబ్ల్యు) చైర్‌పర్సన్ రేఖాశర్మ గతంలో సోషల్ మీడియాలో చేసిన పోస్టులను గుర్తు చేస్తూ 'కొత్త చట్టాల ప్రకారం మరొక సీరియల్ క్రిమినల్‌పై దయచేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయండి' అని ఢిల్లీ పోలీసుల్ని కోరారు. తక్షణమే తనను అరెస్టు చేయాలనుకుంటే వచ్చే మూడు రోజులు తాను నాడియాలోనే ఉంటానని కూడా పోలీసులకు వెల్లడించారు. లాలూ ప్రసాద్ యాదవ్‌ను మూగవాడని, సోనియా గాంధీ – లాలూ ప్రసాద్ 'పర్‌ఫెక్ట్ కపుల్' అని రేఖాశర్మ చేసిన పోస్టులను, కేజ్రీవాల్, ఆయన భార్యకు వ్యతిరేకంగా చేసిన పోస్టులను స్క్రీన్ షాట్ చేశారు. ఎన్సిడబ్ల్యు చైర్‌పర్సన్ రేఖాశర్మపై అవమానకరమైన వ్యాఖ్యలు చేశారనే అభియోగాలతో మహువా మొయిత్రాపై ఢిల్లీ పోలీసులు ఆదివారం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో తొక్కిసలాట ప్రాంతం సందర్శనకు వచ్చిన రేఖాశర్మకు ఇతరులు గొడుగు పట్టుకున్న వీడియోను ఉద్దేశిస్తూ.. రేఖాశర్మ తన గొడుగును ఎందుకు పట్టుకోలేదని కొంతమంది సోషల్ మీడియాలో ప్రశ్నించారు.

రెండోరోజూ సాగిన పూరీ రథయాత్ర

పూరి : ప్రపంచ ప్రసిద్ధి పొందిన పూరిలో జగన్నాథ రథయాత్ర రెండోరోజైన సోమవారం కూడా కొనసాగింది. సోమవారం యాత్రలో కూడా లక్షలాది మంది పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం ప్రారంభమైన యాత్ర సూర్యాస్తమయం తరువాత బొడొదండొ వద్ద నిలిపివేశారు. సోమవారం ఉదయం మళ్లీ యాత్ర ప్రారంభయింది. గుండిచా మందిరం వద్దకు చేరుకున్నాయి. జగన్నాథ రథయాత్ర సందర్భంగా ఆదివారం జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మరణించగా, దాదాపు 130 మంది గాయపడ్డారని అధికారులు సోమవారం వెల్లడించారు. పూరీ యాత్రలో బలభద్రుడు రథం లాగుతున్న సమయంలో భారీ జనంలో ఊపిరాడక బోలంగీర్ జిల్లాకు చెందిన వ్యక్తి మరణించినట్లు చెప్పారు. కొంతమంది పోలీసు సిబ్బందితో సహా 130 మందికిపైగా గాయపడినట్లు అధికారులు తెలిపారు. వీరికి వివిధ ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స అందించినట్లు చెప్పారు. మృతుడి కుటుంబానికి రూ.4 లక్షల పరిహారాన్ని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఝూర్సుగూడ జిల్లాలో కుకుజంఘ గ్రామంలో ఆదివారం నిర్వహించిన రథయాత్రలో శ్యామ్ సుందర్ కిషన్ మరణించాడు. రథాన్ని లాగుతుండగా ప్రమాదవశాత్తూ కిందపడిపోవడంతో రథ చక్రాలు అతనిపై నుంచి వెళ్లాయి.

తుంగభద్రకు 37వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



హోళగుంద : కర్ణాటక రాష్ట్ర శివమొగ్గ, దవనగిరి, రాణి బెన్నూర్, తదితర ప్రాంతాల్లో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు రోజుకు 37,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు బోర్డ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 22 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. రుతుపవనాల కారణంగా రెండు మూడు రోజుల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గత ఏడాది వర్షాలు లేక బెంగళూరు, ముంబయి తదితర ప్రాంతాలకు రైతులు వలస వెళ్లారు. అక్కడ పనులు దొరకకపోవడంతో తిరిగి సొంత గ్రామాలకు వచ్చి తమ పొలాల్లో పనులు చేసుకుంటున్నారు.

సీలింగ్ భూముల్లో నిర్మాణాల కూల్చివేత

- భారీగా మోహరించిన పోలీసులు
- అడ్డుకునేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ మేయర్, కార్పొరేటర్ల అరెస్ట్



నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో ఎన్నో ఏండ్లుగా నివాసముంటున్న పేదలు, మధ్యతరగతి ప్రజల నివాసాలను సీలింగ్ భూముల్లో నిర్మించారంటూ అధికారులు కూల్చేశారు. సాలార్జంగ్ కంచెలోని సర్వే నెంబరు 1లోని సీలింగ్ భూముల్లో నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చేశారు. విషయం తెలుసుకున్న పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు అక్కడకు చేరుకుని కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దాంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మేడిపల్లి తహసీల్దార్ హసీనా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కూల్చివేతల కార్యక్రమానికి మేడిపల్లి సీఐ గోవింద్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కబ్జాదారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, కూల్చివేతల విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముమ్మాటికీ రాజకీయ కక్ష సాధింపు చర్యలే.. :మేయర్ జక్క వెంకట్ రెడ్డి

సీలింగ్ భూముల్లో నిర్మాణాల కూల్చివేత ముమ్మాటికీ రాజకీయ కక్ష సాధింపు చర్యలేనని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆరోపించారు. కూల్చివేతల నేపథ్యంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ పార్టీ మేయర్‌ను దించేందుకు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అనేక రకాల కుట్రలు చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే కొందరు బీఆర్ఎస్ కార్పొరేటర్లను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని, మరికొందరి కోసం ప్రయత్నాలు చేశారని చెప్పారు. కానీ వారు పార్టీ మారకపోవడంతో ఆస్తులకు నష్టం కలిగించేలా భయభ్రాంతులకు గురి చేస్తూ అన్ని రకాల అనుమతులున్న నిర్మాణాలనూ సీలింగ్ ల్యాండ్ పేరుతో కూల్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తనను మేయర్ పదవి నుంచి దించి.. తన అల్లుడు అమర్‌సింగ్‌ను మేయర్‌గా చేయడానికి మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అరాచక రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

సామాన్య ప్రజలను బలి చేయడం సరికాదు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎస్.సృజన

పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో జరుగుతున్న రాజకీయ పరిణామాల కారణంగా సామాన్య మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ(ఎం) మేడిపల్లి మండల కార్యదర్శి ఎస్.సృజన ఆవేదన వ్యక్తం చేశారు. కూల్చివేతల నేపథ్యంలో ఆమె ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీలింగ్ ల్యాండ్ విషయంలో సంవత్సరాల తరబడి హద్దులు నిర్ధారించడంలో రెవెన్యూ అధికార యంత్రాంగం విఫలమైందన్నారు. ఇక్కడ నిర్మాణ అనుమతులు మంజూరు చేసే సమయంలో విచారణ చేపట్టిన రెవెన్యూ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు అది సీలింగ్ భూమి అని తెలియదా అని ప్రశ్నించారు. నాలుగేండ్ల కిందట సీలింగ్ భూమి అంటూ తేనె తెట్టెను కదిలించిన అప్పటి అధికార పార్టీకి చెందిన కొందరు.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి లక్షల రూపాయలు వసూళ్లు చేశారని ఆరోపించారు. ఇప్పుడు అధికార మార్పిడి కావడంతో ప్రస్తుత అధికార పార్టీ నేతలు కూడా అదే ధోరణిలో కూల్చివేతల కార్యక్రమం చేపడుతున్నారని తెలిపారు. ఏదేమైనా స్వార్థ రాజకీయాల కారణంగా పేద, మధ్య తరగతి ప్రజలు బలిపశువులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మొక్కలు నాటడం సమాజం బాధ్యత



నవతెలంగాణ-సిటీబ్యూరో/ఉప్పల్

- భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలి: బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- రామంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమం ప్రారంభం
- 30 సర్కిళ్లోని 56 లొకేషన్‌లో 7134 మొక్కలు సిద్ధం

మొక్కలు నాటడం ఆడంబరం కాదని.. దానిని సమాజం బాధ్యతగా తీసుకోవాలని బీసీ, రవాణా శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సమాజానికి పనికొచ్చే అవసరమైన మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రామంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంత్రి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇందులో భాగంగానే వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. జీహెచ్ఎంసీ వ్యాప్తంగా 30 లక్షల మొక్కలు నాటేందుకు కార్యాచరణ చేశామని, అందులో భాగంగా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించినట్టు తెలిపారు. సోమవారం 30 సర్కిళ్లలోని 56 ప్రాంతాల్లో మొత్తం 7134 మొక్కలు నాటేందుకు సిద్ధం చేసినట్టు చెప్పారు. ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు చేసినా ప్రజల సహకారంతోనే విజయవంతమవుతాయని, మొక్కలు నాటడం కాదు వాటి బాధ్యతను కూడా ప్రజలు తీసుకోవాలని అన్నారు. ప్రజలందరూ చిత్తశుద్ధితో వనమహోత్సవంలో పాల్గొనాలని తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో సమాజానికి మేలు చేసే మొక్కలను నాటుతున్నామన్నారు.

60 లక్షల మొక్కలు సిద్ధం : మేయర్

ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యం 30 లక్షలు కాగా, జీహెచ్ఎంసీలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని 60 లక్షల మొక్కలను సిద్ధం చేశామని మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. గతంలో జీహెచ్ఎంసీలో మొక్కలు నాటిన సందర్భంగా ప్రపంచ స్థాయిలో హైదరాబాద్ నగరానికి గ్రీన్ అవార్డు వచ్చిందని తెలిపారు. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా 2021లోనే 147శాతం చెట్లు పెరిగినట్టు గుర్తించిందన్నారు. నగరంలో 33.15 కిలోమీటర్లు ఉన్న అటవీ విస్తీర్ణం 81.81 కిలోమీటర్ల వరకు పెరగడం గుర్తించినట్టు చెప్పారు. వన మహోత్సవ కార్యక్రమం సందర్భంగా నగరంలో కళాశాలలు, ఖాళీ స్థలాలు, పార్కులు, సెంట్రల్ మీడియంలో, రోడ్డుకిరువైపులా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఆమ్రపాలి కాట, ఉప్పల్ ఎమ్మెల్యే బి.లక్ష్మారెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, అడిషనల్ కమిషనర్ యూబీడీ సునంద, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలంటూ 'అల్ట్రాటెక్' ముట్టడి

- బూదవాడ గ్రామస్తులపై పోలీసుల లాఠీఛార్జి
- 26 మందికి గాయాలు



ఫ్యాక్టరీ వద్ద ఆందోళనకు దిగిన కార్మికులు, గ్రామస్తులు

జగ్గయ్యపేట : అల్ట్రాటెక్ బాలాజీ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామస్తులు సోమవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ ఫ్యాక్టరీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన కార్మికులకు న్యాయం చేయాలని, నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపట్టారు. ఫ్యాక్టరీని ముట్టడించారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, తమ గ్రామానికి చెందిన ఒక కార్మికుడు మృతి చెందారని, 15 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లైమ్ స్టోన్, ఐరన్ ఓర్, రెడ్ సాయిడ్ మిశ్రమం సరఫరా అవుతున్న పైపులైన్ రెండు నెలలుగా లీక్ అవుతోందని, రక్షణ చర్యలు తీసుకోవాలని కార్మికులు పలు దఫాలు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు., దీనికి యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ మెయిన్ గేటును నెట్టేసి కొంతమంది లోపలికి ప్రవేశించారు. విజయవాడ డిసిపి కె.శ్రీనివాసరావు, నందిగామ ఎసిపి డాక్టర్ రవికిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు ఒక్కసారిగా గ్రామస్తులపై విరుచుకుపడి దొరికిన వారిని దొరికినట్లు లాఠీలతో చితకబాదారు. దీంతో, 26 మందికి గాయాలయ్యాయి. ఇద్దరికి చేతి వేళ్లు విరిగాయి. ఒకరికి చెయ్యి విరిగింది. గాయపడిన వారిలో కొందరు తెలంగాణ రాష్ట్రం మేళ్లచెరువు మండలం దొండపాడు గ్రామ సమీపంలోని ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీ ఆస్పత్రిలోనూ, మరికొందరు జగ్గయ్యపేటలోని ప్రభుత్వ ప్రయివేట్ ఆస్పత్రుల్లోనూ చికిత్స పొందుతున్నారు.

చెక్కుల పంపిణీ

గ్రామస్తుల ఆందోళన నేపథ్యంలో ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించి ప్రమాదంలో మృతి చెందిన ఆవాల వెంకటేష్ కుటుంబానికి రూ.50 లక్షలు, గాయపడిన వారికి రూ.25 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. జిల్లా కలెక్టర్ జి.సృజన, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ బాధిత కుటుంబ సభ్యులను ఫ్యాక్టరీలో పరామర్శించారు. వారికి కంపెనీ తరఫున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మృతి చెందిన కార్మికుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఆ కుటుంబంలోని పిల్లలకు చదువు ఉచితంగా, గాయపడిన ఉద్యోగులకు ఆరోగ్య సమస్యలు ఉంటే వారికి ఉచితంగా చికిత్స కంపెనీ యాజమాన్యం అందిస్తుందని తెలిపారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

అల్ట్రాటెక్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. వెంకటేష్ మృతదేహాన్ని వారు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ప్రమాదంలో ఎంతమంది చనిపోయారనే దానిపై అనుమానాలు ఉన్నాయనీ, దానిపై యాజమాన్యం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ఘటన దురదృష్టకరం : మంత్రి వాసంశెట్టి సుభాష్

అల్ట్రాటెక్ ప్రమాదంలో గాయపడి ఆంధ్ర, మణిపాల్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని రాష్ట్ర కార్మిక, కర్మాగార, బాయిలర్స్, వైద్య, బీమా సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీలో బాయిలర్ పేలిన ఘటన చాలా దురదష్టకరమన్నారు. కార్మికులకు ఇఎస్ఐ, బీమా వంటి పథకాలను సదరు సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం వర్తింపజేస్తున్నదీ లేనిదీ విచారించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులందరికీ ప్రభుత్వపరంగా నష్టపరిహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరలో నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ కమిషనర్ ఎం.శేషగిరిబాబు, విజయవాడ ఆర్‌డిఒ బిహెచ్.భవానీ శంకర్, డిఎంహెచ్ఒ ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర మంత్రి వ్యాఖ్యలు హేయం

విశాఖపట్నం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ నష్టాల్లో కూరుకుపోవడం వల్లే కేంద్రం ప్రయివేటుపరం చేయాలని భావించిందని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ అనడం సత్యదూరమని, ఆయన వ్యాఖ్యలు అత్యంత హేయమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పేర్కొంది. స్టీల్‌ప్లాంట్ నష్టాలు పూడ్చడం ఏ ప్రభుత్వానికైనా కష్టమని అనడాన్ని బట్టి కేంద్ర ప్రభుత్వ విధానం ప్రయివేటు వారికి కొమ్ము కాయడమేనని తేటతెల్లమైందని విమర్శించింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1343వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ సిఐ అండ్ సిసిపి, కోకో ఒవెన్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు ఎన్ రామారావు, డి ఆదినారాయణ మాట్లాడారు. ఈ ఏడాది కూడా విశాఖ స్టీల్ నష్టాల్లో ఉందని కేంద్ర సహాయ మంత్రి పేర్కొనడం దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుగా ఉందని అన్నారు. నష్టాలకు కేంద్ర బిజెపి ప్రభుత్వ ఆంక్షలే కారణమని తెలిపారు. 2021లో నికర లాభాల్లో ఉండి 28 వేల కోట్లు టర్నోవర్ చేసిన విశాఖ ఉక్కును అదానీకి, అంబానీకి అమ్మేందుకు చేస్తున్న కుట్రలను వివరించారు. ఉత్పత్తికి కావలసిన రా మెటీరియల్ కొనుగోలు చేయకుండా, అనేక విభాగాలను ఆపేసి, వైజాగ్ స్టీల్ బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బతీసింది ఎవరని ప్రశ్నించారు.

పిర్జాదీగూడలో పేదల ఇండ్లు కూల్చటం సరికాదు

- అన్ని అనుమతులిచ్చింది అధికారులే
- బాధితులకు అన్యాయం చేయొద్దు : ఎంపీ ఈటల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పిర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని సాయి ప్రియ ఎన్‌క్లేవ్‌లో పేదలు కట్టుకున్న ఇండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చేయించడం సరికాదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బాధిత కుటుంబాలకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వారి పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బాధిత కుటుంబాలతో కలిసి ఈటల మీడియాతో మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపురంలో 350 ఎకరాల్లో సాలార్‌జంగ్ కంచె పేరుతో ఉందనీ, ఆ భూ యజమానుల నుంచి 30, 40 ఏండ్ల కిందట పైసాపైసా కూడబెట్టుకుని, తమకు వచ్చే నెలసరి జీతంలో నెలకింత కట్టుకుంటూ పేదలు అక్కడ ఇండ్ల జాగాలు కొనుక్కున్నారని చెప్పారు. ఇండ్లు కట్టుకునేందుకు అన్ని అనుమతులిచ్చింది ప్రభుత్వ అధికారులే కదా? ఇప్పుడు ఆ ఇండ్లను కూల్చడమేంటి? ఇదెక్కడి న్యాయం? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. గత ప్రభుత్వంలాగానే రేవంత్‌రెడ్డి సర్కారూ పేదలను ఇబ్బందులను గురిచేస్తున్నదని విమర్శించారు. అక్కడ ఇండ్లు కట్టుకోవడానికి జీహెచ్ఎంసీ పర్మిషన్ కూడా ఉందని చెప్పారు. అన్ని అనుమతులున్న ఇండ్లను కూల్చడానికి కలెక్టర్, ఆర్డీఓ, ఎమ్మార్వోకు తెలివి లేదని విమర్శించారు. కలెక్టర్‌కు ఫోన్ చేస్తే ఎత్తట్లేదనీ, ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రికి ఫోన్లు చేస్తే తమకు తెలియదని చెబుతున్నారని చెప్పారు. ఈ విషయం సీఎంకు తెలుసా? మున్సిపల్ శాఖ మంత్రికి తెలుసా? అసలు రాష్ట్రంలో ఏం జరుగుతున్నదని ప్రశ్నించారు. గంజాయి, గుడుంబా అమ్మేవాళ్లను పట్టుకునే సోయి లేదుగానీ పేదల మీద ప్రతాపం ఏంటని నిలదీశారు. బీఆర్ఎస్‌ను ఓడించాలనే కసితో కాంగ్రెస్‌కు ప్రజలు ఓట్లేస్తే చేసే పని ఇదా? అని నిలదీశారు. ప్రజలు కొనుక్కున్న భూములకు 118 జీవో ప్రకారం క్రమబద్ధీకరణ చేయకుండా ఇప్పుడు ఇష్యూ చేయడమేంటి? అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి రాగానే అయ్యప్ప సొసైటీ వాళ్లను బెదిరింపులకు గురిచేసిందనీ, ఇప్పుడు కాంగ్రెస్ నేతలు కూడా సాయి ఎన్‌క్లేవ్‌లో అందిన కాడికి దోచుకోవాలనే ఆలోచనలో ఉన్నారని ఆరోపించారు. అధికారులు బాధ్యతలు మరిచి వ్యవహరిస్తే జైలుకెళ్లక తప్పదని హెచ్చరించారు. పేదల జోలికొస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. బాధిత కుటుంబాలకు క్షమాపణలు చెప్పి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అసోంలో ఉధృతంగా వరదలు

- 28 జిల్లాల్లో 23 లక్షల మందిపై ప్రభావం



గౌహతి : అసోంలో వరదల పరిస్థితి సోమవారం నాటికి కూడా తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో అనేక నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తున్నాయని అస్సాం ప్రభుత్వం ఒక అధికారిక బులెటిన్‌లో తెలిపింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ వరదలు, కొండచరియలు విరిగిపడటం, తుపానులు వంటి కారణాలతో 78 మంది మరణించారు. వారిలో వరదల కారణంగానే 66 మంది మరణించారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లోని 3,446 గ్రామాల్లో సుమారు 23 లక్షల మందిపై వరదలు ప్రభావం చూపుతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 68,432 హెక్టార్ల పంట భూములు ముంపునకు గురయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 269 సహాయక శిబిరాల్లో 53,689 మంది తలదాచుకుంటున్నారు.

కాంగ్రెస్ వేధింపులను తిరిగి వడ్డీతో సహా చెల్లిస్తాం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతున్న నేపథ్యంలో వాటిని మళ్లీ వడ్డీతో సహా చెల్లిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో సోమవారం ప్రజలు కట్టుకుంటున్న ఇళ్లను అక్రమంగా కూలగొట్టిన తీరుపై ఆయన మండిపడ్డారు. ఆ ఘటన సమాచారాన్ని తెప్పించుకుని తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు. కాంగ్రెస్ నాయకులు అమ్మిన, రేవంత్ ప్రభుత్వం క్రమబద్ధీకరించిన చేసిన ప్లాట్లలో నిర్మించుకుంటున్న ప్రజల ఇండ్లను మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఏం ఆశించి కూలగొట్టించాడో తేల్చాలని డిమాండ్ చేశారు. 'ప్రజా పాలనలో ప్రజలకు మద్దతు ఇవ్వడానికి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులతో నిర్బంధిస్తారా..? మీకు అన్నగా ప్రచారం చేసుకుంటూ సుధీర్ రెడ్డి మేడ్చల్ అసెంబ్లీ పరిధిలో చేస్తున్న అరాచకాలపై మీరు ఇంటెలిజెన్స్ నివేదిక తెప్పించుకోండి' లేదంటే ప్రజలు తిరగబడుతారని' కేటీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్ నిర్బంధాలు ప్రజాగ్రహాన్ని నిలువరించలేవని తెలిపారు. అమాయక ప్రజలకు ఈ ప్లాట్లు అమ్మింది కాంగ్రెస్ నాయకుడు రాందాస్ గౌడ్, ఆ పార్టీకి చెందిన నాయకుడు జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ కార్పొరేటర్ అమర్ సింగ్ కుటుంబమని తెలిపారు. ఈ ప్లాట్లను 2008లో నాటి సీఎం రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం క్రమబద్ధీకరించిందని గుర్తు చేశారు. గతంలో రెవెన్యూ అధికారులు ఇది పట్టా భూమిగా ఎన్వోసీ జారీ చేశారనీ, ప్రభుత్వ నిబంధనలకు లోబడి మున్సిపల్ అధికారుల అనుమతి తీసుకుని ప్రజలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఇంటి నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. కానీ మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అధికారులను వేధించి అమాయక ప్రజల ఇండ్లను కూలగొట్టించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయిప్రియ, సత్యనారాయణ పురం కాలనీ ప్లాట్ల యజమానుల సమస్యను శాశ్వతంగా తీర్చాలనే లక్ష్యంతో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం 118 జీవో పరిధిలో చేర్చి ప్లాట్ ఓనర్లకు మేలు చేసిందని తెలిపారు. కానీ ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అసమర్థ ప్రభుత్వం అమాయకుల ఇండ్లను కూల్చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందనీ, ఆ వెంటనే ఆ ప్లాట్ ఓనర్లకు న్యాయం చేస్తామని తెలిపారు. తాము ఇలా వేధించాలి అనుకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ నామరూపాల్లేకుండా పోయేదన్నారు.

మంత్రి సీతక్క కార్యాలయంలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థ

- ప్రజాభవన్‌లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టం ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) హైదరాబాద్ ప్రజాభవన్‌లోని తన క్యాంపు కార్యాలయంలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. 13,600 చదరపు అడుగుల పైకప్పు విస్తీర్ణంలో ఉన్న ఈ నిర్మాణంలో ఏడాదికి సుమారు 1.15 మిలియన్ లీటర్ల వర్షపు నీటిని సంరక్షించుకోవచ్చు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క నీటి సంరక్షణ ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. భూగర్భ జలాలను పెంచడానికి, పట్టణ వరదలను తగ్గించడానికి వర్షపు నీటి సంరక్షణలో అంతా చురుగ్గా పాల్గొనాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. " దాహం వేసినప్పుడు బావిని తవ్వలేము, ఆకలి వేసినప్పుడు విత్తనాలు వేయడం వల్ల ఉపయోగం లేదు. ముందస్తు ప్రణాళికతోనే వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలి" అని అన్నారు. ఇటీవల బెంగుళూరు, ఢిల్లీ వంటి నగరాల్లో తలెత్తిన నీటి సంక్షోభాలను ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. మన రాష్ట్రం కూడా అలాంటి పరిస్థితిలో పడకూడదనుకుంటే అంతా వర్షపు నీటిని సంరక్షించుకోవాలని కోరారు. నీటిని సంరక్షించడం, పొదుపుగా వాడుకోవడమే సుస్థిరమైన మార్గమని ఆమె నొక్కి చెప్పారు. ప్రతి పౌరుడు నీటి సంరక్షణ ప్రయత్నాలకు సహకరించాలని, పర్యావరణ సమతుల్యతను పునరుద్ధరించడంలో తోడ్పాటునందించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా నీటి సంరక్షణ కార్యక్రమాలను ప్రోత్సహించడంలో వాక్ ఫర్ వాటర్ సంస్థ, దాని వ్యవస్థాపకుడు కరుణాకర్ రెడ్డి చేస్తున్న కృషిని మంత్రి సీతక్క అభినందించారు.